www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్



నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము
న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ.. 24న ప్రమాణం 2
2027 ఫిబ్రవరి 9 దాకా పదవిలో జస్టిస్ సూర్యకాంత్

శుక్రవారం | 31-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 195 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: నవమి ఉ.10.04 తదుపరి దశమి, నక్షత్రం: ధనిష్ఠ రా.6.51 తదుపరి శతభిషం, వర్జ్యం: రా.1.53-3.27, దుర్ముహూర్తం: ఉ.8.39-9.19, మ.12.21-1.07, అమృతఘడియలు: ఉ.8.19-9.56, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.16, సూర్యాస్తమయం: 5.40 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం రజాల అగ్రహారం వద్ద మేజర్ శారదా నదికి గండి పడిన దృశ్యం


శివమెత్తిన శారద..!

భారీ వర్షాలతో గండ్లు.. 1,500 ఎకరాలు మునక
ముంపునకు గురైన వై.లోవ గ్రామం 13

పంట నష్టం.. రైతుకు కష్టం

3 లక్షలకుపైగా ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
ఇందులో 70 శాతం వరే.. నీటమునిగిన చేలు
మొక్కజొన్న, పత్తి, ఉద్యాన పంటలకూ దెబ్బ
ఉమ్మడి తూర్పు, కృష్ణా జిల్లాల్లో భారీ నష్టం
ప్రభావిత జిల్లాల్లో అధికారుల పరిశీలన
కొన్ని ప్రాంతాల్లో గురువారమూ కుండపోత

'మొంథా' నష్టం.. 5,265 కోట్లు



ఇది ప్రాథమిక అంచనా: సీఎం

ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్లు, సీసీ ఫుటేజీల ఆధారంగా లెక్కించాం
పూర్తిస్థాయి నివేదిక రూపొందించాక కేంద్రానికి!
తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొన్నాం.. రియల్‌టైమ్‌లో నిరంతరం పర్యవేక్షించాం.. డేటా బేస్‌తో ముందస్తు చర్యలు
సీఎస్ నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది వరకు పంచ సూత్ర ప్రణాళికతో బాగా పని చేశారు
క్షేత్ర స్థాయి పర్యటనలతో ప్రజలకు మరింత భరోసా: సీఎం

నష్టం ఇలా...

- పంటలకు 829 కోట్లు
- రోడ్లకు 2,079 కోట్లు
- ఆక్వాకు 1,270 కోట్లు



కాకినాడ జిల్లాలో మొలకలు వచ్చిన వరి పనలు

'పర్యవేక్షణ, అప్రమత్తత, రక్షణ, పునరావాసం, సాధారణ పరిస్థితి' అనే పంచ సూత్ర ప్రణాళికతో అధికార యంత్రాంగం చక్కగా పని చేసింది. భవిష్యత్‌లో టెక్నాలజీని మరింత ముందుకు తీసుకెళ్తాం. - సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల రాష్ట్రంలో రూ.5,265 కోట్ల మేర నష్టం సంభవించినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శాటిలైట్ చిత్రాలు, డ్రోన్లు, సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నష్టాన్ని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ తుఫాన్‌ను రియల్ టైమ్‌లో పర్యవేక్షించి, ముందు జాగ్రత్తతో నష్టాన్ని భారీగా తగ్గించగలిగామని, ప్రభుత్వ

మిగతా 13వ పేజీలో...



కృష్ణా జిల్లా కోడూరులో పొలంలో దిగి దెబ్బ తిన్న పంటలను పరిశీలించి, రికార్డులు చూస్తున్న డిప్యూటీ సీఎం పవన్. చిత్రంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మంత్రులు కొల్లు రవీంద్ర, సుభాష్

ప్రతి రైతునూ ఆదుకుంటాం



ముందస్తు సన్నద్ధతతో 'మొంథా' నష్టాన్ని తగ్గించాం: డిప్యూటీ సీఎం

అవనిగడ్డ నియోజకవర్గంలో నష్టం పరిశీలన
ముందుచూపుతో చంద్రబాబు జాగ్రత్త చర్యలు
ఆర్టీజీఎస్ నుంచి 24 గంటలూ పర్యవేక్షించాం
గ్రామస్థాయి వరకూ యంత్రాంగం అప్రమత్తం
పునరావాస కేంద్రాలకు 1.16 లక్షల మంది
కౌలు రైతులకు ప్రత్యేక సాయంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం: పవన్ కల్యాణ్

51 లక్షల టన్నుల ధాన్యం కొంటాం
క్వింటాకు 2,369 మద్దతు ధర ఇస్తాం: మనోహర్

అవనిగడ్డ/ కోడూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతునూ రాష్ట్రప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకుంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. ముందస్తు సన్నద్ధతతో నష్టాల తీవ్రతను గణనీయంగా తగ్గించామని తెలిపారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు, అవనిగడ్డ, చల్లపల్లి మండలాల్లో జరిగిన పంట నష్టాన్ని..

మిగతా 12వ పేజీలో...

సీఎం చంద్రబాబు పనితీరు అభినందనీయం
వైసీపీ కారణంగానే ఫసల్ బీమా యోజన రైతులకు అందలేదు: బీజేపీ చీఫ్ మాధవ్



గురువారం బుసాన్‌లో జిన్‌పింగ్‌తో ట్రంప్ కరచాలనం

వర్క్ పర్మిట్ల ఆటో-రెన్యువల్‌కు
అమెరికా స్వస్తి
ఆ దేశంలో ఉన్న వేల మంది భారతీయ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం

చైనాతో ట్రంప్ రాజీ!
సుంకాలు 57 శాతం నుంచి 47 శాతానికి తగ్గింపు 2
ఏడాదిపాటు అరుదైన లోహాల సరఫరాకు చైనా ఓకే
అమెరికా నుంచి సోయా ఉత్పత్తుల దిగుమతులకు సమ్మతి
అణు పరీక్షలు మొదలుపెట్టండి
పెంటగాన్‌కు ట్రంప్ ఆదేశం

మావోయిస్టు డంపుల్లో
400 కిలోల బంగారం?
భారీగా పసిడి నిల్వలు ఉండొచ్చని అనుమానాలు 2

పాటలు పాడి, గుసగుసలాడే ఏఐ..
'లూనా'
ప్రపంచంలోనే తొలి స్పీచ్ టూ స్పీచ్ మోడల్ 2
భారతీకు చెందిన 25 ఏళ్ల యువకుడి ఆవిష్కరణ

'టెక్'తో చెక్



మొంథాను ఎదుర్కొన్న సాంకేతిక పంథా
రియల్‌టైమ్‌లో సేకరించిన సమాచారంతో ముప్పుపై సమగ్ర విశ్లేషణ
దీంతో తీరం వెంబడి ప్రాంతాల్లో బాగా తగ్గిన ప్రాణ, ఆస్తి నష్టం
టెక్నాలజీ వనరుగా అక్కరకొచ్చిన అవేర్ 2.0 వ్యవస్థ 12
1.1 కోట్ల మెసేజీలతో అప్రమత్తం చేసిన ఆర్టీజీఎస్

ఇది బాబు సృష్టించిన విపత్తు



గత 16 నెలల్లో రాష్ట్రానికి 16 తుఫాన్లు
ఒక్క రైతుకూ నష్టపరిహారం ఇవ్వలేదు
పార్టీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్‌లో జగన్ వింత వ్యాఖ్యలు 12

జగన్ పరువు తీసేసిన సొంత మీడియా
సీఎంగా లేకపోయినా తుఫాన్‌లో ఆదుకున్న ఏకైక మగాడట!

ప్రజల్లోకి పోలీసులు

- డిజిటల్ అరెస్ట్ పేరిట వృద్ధుడి నుంచి రూ.3.7 కోట్ల దోపిడీ, డాక్టర్‌కు రూ.3 కోట్లు కుచ్చుటోపీ.. ఇలాంటి వార్తలు తరచూ వింటుంటారు. సామాన్యుల నుంచి ఉన్నత విద్యావంతుల దాకా.. చివరకు ఎమ్మెల్యేలు, ఎంపీలను కూడా సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. ఇంకా అధిక వడ్డీలు, చిట్టీల పేరిట మోసాలు.. గంజాయి, డ్రగ్స్ రవాణా.. మహిళలపై నేరాలు.. రోడ్డు ప్రమాదాలు.. ఎందరో జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి.
- ఈ ఐదు రకాల నేరాలను అరికట్టేందుకు పోలీసులు సమగ్ర ప్రణాళిక రూపొందించారు. నేరాలు జరిగాక బాధ్యులను అరెస్ట్ చేయడంతో పాటు నేరాల బారిన పడకుండా ముందుగానే ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవమైన నవంబరు 1న ఇందుకు శ్రీకారం చుడుతున్నారు. 'కమ్యూనిటీ ఫస్ట్' పేరిట ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారం చేయనున్నారు.

'కమ్యూనిటీ ఫస్ట్'తో నేరాల కట్టడి



ప్రజల భాగస్వామ్యంతో అడ్డుకట్ట
అవగాహన కోసం విస్తృత ప్రచారం
మహిళలపై నేరాలు, గంజాయి వాడకం, ఆర్థిక, సైబర్ మోసాల అడ్డుకట్టకు వ్యూహం
రేపటి నుంచి సమగ్ర కార్యక్రమం
ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అమలు
కనీసం 15 శాతం నేరాల తగ్గింపే లక్ష్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
ఒకప్పుడు జేబులు కొట్టడం, ఇళ్లకు కన్నాలు వేయడం వంటి దొంగతనాలు జరిగేవి. వాటిని కట్టడి చేసేందుకు పోలీసులు గస్తీ నిర్వహించేవారు. కాలంతో పాటు నేరాలు జరిగే తీరూ మారింది. ఇప్పుడు 'జేబు', ఇంటి 'ఆర్థికం' అన్నీ సెల్‌ఫోన్లలోనే దొంగలకు దొరికిపోతున్నాయి. సైబర్ నేరగాళ్లు ఎక్కడో ఉండి ప్రజల నుంచి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. ఇక స్వార్థ శక్తులు గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించి యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్నాయి. కొందరు చిట్టీలు, అధిక వడ్డీలు, పెట్టుబడుల పేరిట ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా, పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా అఘాయిత్యాలు మాత్రం ఆగట్లేదు. వీటితో పాటు పోలీసులకు రోడ్డు ప్రమాదాలూ సవాల్‌గా మారాయి. ప్రధానమైన ఈ ఐదు నేరాలను తగ్గించే లక్ష్యంతో రాష్ట్ర పోలీసులు పంచ ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి, ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలు కట్టడి చేయడం ఈ ప్రణాళిక లక్ష్యం. మహిళలపై

మిగతా 14వ పేజీలో...

అప్పు తెచ్చి బకాయిల చెల్లింపు!



నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఒకేసారి చెల్లించేందుకు రూ.3 వేల కోట్ల రుణానికి ప్రభుత్వం నిర్ణయం
'ఆశా' ప్రతినిధులతో జరిగిన భేటీలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో వెల్లడి
ఆందోళన విరమణకు ఆస్పత్రుల అంగీకారం!

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సరికొత్త ఆలోచన చేస్తోంది. దాదాపు రూ.3,500 కోట్ల వరకు ఉన్న పెండింగ్ బకాయిల మొత్తాన్ని 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' కింద చెల్లించాలని భావిస్తోంది. ఇందు కోసం బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వైద్య సేవ ట్రస్ట్ సీఈవో దినేశ్ కుమార్ గురువారం ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల

మిగతా 3వ పేజీలో...

ప్రభుత్వాస్పత్రుల్లో
ఓపీ పైపైకి!

6 నెలల్లో 20శాతం పెరుగుదల నమోదు
నాలుగు కోట్ల మందికి పైగా వైద్య సేవలు
80 నుంచి 150కి పెరిగిన ఓపీ కౌంటర్లు
రోగులు వేచి ఉండే సమయం తగ్గుదల
వైద్యులు, సిబ్బంది హాజరు 92 శాతానికి
వైద్య, రక్త పరీక్షల్లో 6.10 శాతం వృద్ధి



'నెయ్యి'లోనూ కమీషన్ల దందా!

కాంట్రాక్టర్లకు వైవీ పీఏ అప్పన్న బెదిరింపులు!
భోలేబాబా, ప్రీమియం డెయిరీలపై ఒత్తిళ్లు.. కమీషన్లు ఇవ్వకుంటే కాంట్రాక్టుల రద్దు.. నేరుగా, ఫోన్లో హెచ్చరికలు
అప్పన్న నిరుపేద.. అయినా ఢిల్లీ బ్యాంకుల్లో 4.5 కోట్లు
విశాఖలో 13 ఖరీదైన స్థలాలు, ఫ్లాట్లు
ఎవరి బినామీయో తేల్చేందుకు సిట్ సమాయత్తం

తిరుపతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కమీషన్లు కొడితేనే ఆర్డర్లు! తాగి ఊగే మద్యంకైనా ఇదే విధానం! తిరుమల లడ్డూకు వాడే నెయ్యికైనా ఇదే పాలసీ! జగన్ హయాంలో జరిగిందిదే! కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో బుధవారం అరెస్టయిన టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కడూరు చిన్న అప్పన్న పాత్రపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లోతుగా

మిగతా 14వ పేజీలో...

'జోగి'కి బిగుస్తున్న నకిలీ మద్యం ఉచ్చు!



త్వరలోనే ఆయనను విచారణకు పిలిచే అవకాశం
ఇప్పటికే జోగి పేరు వెల్లడించిన 'అద్దేపల్లి' సోదరులు 3



జట్టు సభ్యులతో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సంతోషం

జెమీమా రోడ్రిగ్స్ (127 నాటౌట్)

వారెవ్వా.. ఏమి ఆట!

మహిళల వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్

సెమీస్‌లో ఆసీస్‌పై సంచలన విజయం
339 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన భారత్
జెమీమా సూపర్ సెంచరీ
డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా నాకౌట్ 10
సౌతాఫ్రికాతో ఆదివారం ఫైనల్ ఫైట్

ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో భారత జట్టు అంచనాలకు మించిన ఆటతీరుతో అద్భుతం చేసింది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా రూపంలో ఎదురైన అగ్ని పరీక్షలో.. వారెవ్వా.. అనే రీతిలో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రత్యర్థి 339 పరుగుల భారీ లక్ష్యాన్ని ముందుపెట్టగా.. స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్(127 నాటౌట్) సూపర్ సెంచరీతో కదం తొక్కడం, మిగిలిన బ్యాటర్లు సత్తా చాటడంతో లక్ష్యాన్ని పూర్తి చేసి ఆసీస్‌ను టోర్నీ నుంచి సాగనంపింది. ఈ క్రమంలో మహిళ వన్డే క్రికెట్ చరిత్రలో భారీ లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా రికార్డు కూడా సృష్టించింది. ఇక, ఆదివారం జరిగే ఫైనల్లో భారత జట్టు సౌతాఫ్రికాతో తలపడనుంది.

జోరుగా ఆరోగ్య బీమా

- ఇటీవలి కాలంలో ఏకంగా 38% వృద్ధి
- జీఎస్టీ ఎత్తివేతే ప్రధాన కారణం : పాలసీ బజార్ నివేదిక

న్యూఢిల్లీ, అక్టోబరు 30: ఆరోగ్యబీమా పథకాలపై కేంద్రప్రభుత్వం జీఎస్టీ తొలగించటంతో ఆరోగ్య బీమా పట్ల ప్రజల్లో ఆసక్తి గణనీయంగా పెరిగింది. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్న వారి సంఖ్య ఇటీవలికాలంలో 38శాతం వృద్ధి చెందిందని ప్రముఖ ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ సంస్థ పాలసీ బజార్ వెల్లడించింది. ఈమేరకు విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గతంలో పాలసీదారులు ఎంచుకునే ఆరోగ్య బీమా కవరేజీ సగటున రూ.13 లక్షలు ఉండ గా.. ఇప్పుడది రూ.18 లక్షలకు పెరిగింది. కొత్తగా ఆరోగ్య బీమా తీసుకుంటున్న వారిలో దాదాపు సగం (45%) మంది రూ.15-25 లక్షల కవరేజీని ఎంపిక చేసుకుంటున్నారు. 24% మంది రూ.10-15 లక్షల కవరేజీకి మొగ్గు చూపుతుండగా.. కేవలం 18%మంది మాత్రమే రూ.10 లక్షలలోపు కవరేజీ తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్న వారు జీఎస్టీ తొలగింపు అనంతరం.. ఉన్న పాలసీకి మరిన్ని కొత్త సదుపాయాలను ఎంపిక చేసుకుంటూ అవసరమైన అదనపు ప్రీమియం చెల్లిస్తున్నారు. 61ఏళ్లు, ఆపై వయస్కుల్లో ఎక్కువ మొత్తం కవరేజీతో కూడిన బీమా పథకాల పట్ల ఆసక్తి 11.5% పెరిగింది. చిన్న పట్టణాల్లోనూ హెల్త్ ఇన్సూరెన్స్‌పై ఆసక్తి పెరుగుతోంది. భారీ కవరేజీ ఉన్న బీమా పథకాలు తీసుకుంటున్నారు. మొత్తంగా ఆరోగ్యబీమాపై దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆసక్తి గణనీయంగా పెరిగిందని, జీఎస్టీ ఎత్తివేతే దీనికి ప్రధాన కారణమని పాలసీ బజార్ నివేదిక వెల్లడించింది.

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ, అక్టోబరు 30: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. కేంద్ర న్యాయ శాఖ ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబరు 23న ప్రస్తుత సీజేఐ జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ పదవీ విరమణ చేయనున్న సంగతి తెలిసిందే. దీంతో నవంబరు 24న జస్టిస్ సూర్యకాంత్ 53వ సీజేఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన దాదాపు 15 నెలల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఫిబ్రవరి 9, 2027లో జస్టిస్ సూర్యకాంత్ పదవీ విరమణ చేస్తారు. "భారత రాజ్యాంగం కల్పించిన అధికారం మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. జస్టిస్ సూర్యకాంత్‌ను నవంబరు 24 నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు" అని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న తొలి హరియాణా వాసి కావడం గమనార్హం.

2020 ఢిల్లీ అల్లర్ల వెనుక పెద్ద కుట్ర

- సుప్రీంలో ఢిల్లీ పోలీసుల కౌంటర్ అఫిడవిట్

న్యూఢిల్లీ, అక్టోబరు 30: ఈశాన్య ఢిల్లీలో 2020లో జరిగిన మత అల్లర్ల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, దేశ స్వరూపాన్ని మార్చాలనే లక్ష్యంతో చాలా జాగ్రత్తగా ఈ అల్లర్లను నిందితులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ తదితరులు సృష్టించారని పోలీసులు సుప్రీంకోర్టుకు తెలిపారు. వారి బెయిల్ పిటిషన్లను తిరస్కరించాలంటూ గురువారం కౌంటర్ అఫిడవిట్‌ను సమర్పించారు. భారత పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశరాజధానిలో ఉన్న సమయంలోనే అక్కడ మత అల్లర్లు రేపాలని నిందితులు కుట్ర చేశారని, వారి చాట్ మెసేజ్‌ల్లో ట్రంప్ పేరు రికార్డయిందని ఆ అఫిడవిట్‌లో పోలీసులు పేర్కొన్నారు. వారి కుట్రను బయటపెట్టే సాక్ష్యాలు, చాట్ మెసేజ్‌లు, సాంకేతిక ఆధారాలు లభించాయని తెలిపారు. ఈ అల్లర్లలో 53 మంది మరణించారని, 753 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని 177 పేజీల అఫిడవిట్‌లో పోలీసులు తెలిపారు.

సునీతారెడ్డి చెప్పినట్టు దర్యాప్తు జరగాలా?

- దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారు... కోర్టులో నిందితుల వాదన

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో 'తదుపరి దర్యాప్తు' చేయాలంటూ ఆయన కుమార్తె సునీతారెడ్డి చేసిన వినతిని తిరస్కరించాలని నిందితులు సీబీఐ కోర్టును కోరారు. ఆమె దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని, తదుపరి దర్యాప్తు కోరడం వెనుక వ్యక్తిగత, రాజకీయ ఎజెండా రెండూ ఉన్నాయని ఆరోపించారు. ఈ మేరకు నిందితులుగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి (ఏ-5), వైఎస్ భాస్కర్‌రెడ్డి (ఏ-7), కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి (ఏ-8)లు గురువారం కౌంటర్ దాఖలు చేశారు. సునీతా రెడ్డి తనకు కావాల్సిన విధంగా, తాను నిర్దేశించిన విధంగా దర్యాప్తు జరగాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఇందుకు సీబీఐని పావుగా వాడుకోవాలని చూస్తున్నారని, ఇందుకు సీబీఐ లొంగిపోయిందని చెప్పారు. పార్లమెంట్ సభ్యుడు అయిన అవినాశ్‌రెడ్డిని నిందితుడిగా చేర్చడం ద్వారా సీబీఐ లొంగిపోయినట్లు స్పష్టంగా తెలుస్తోందని పేర్కొన్నారు. సునీతారెడ్డి నిర్దేశం మేరకు తదుపరి దర్యాప్తు చేపట్టి అప్రూవర్‌గా మారిన దస్తగిరి (ఏ-4) ను స్వేచ్ఛగా వదిలేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తదుపరి దర్యాప్తు చేయడానికి కొత్త విషయాలు ఏవీ లేవని చెప్పారు. ఈడీ, ఇన్‌కంట్యాక్స్ శాఖల కోణంలో దర్యాప్తు చేయాలని ఆమె కోరుతున్నారని, అలాంటప్పుడు ఇక సీబీఐ చేయాల్సిన దర్యాప్తు ఏముంటుందని ప్రశ్నించారు. మరో నిందితుడు సునీల్‌యాదవ్ కౌంటర్ కోసం తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదాపడింది.

ఆర్టీసీ బస్సు కింద నిప్పురవ్వలు..

- పొగలు రావడంతో టెన్షన్ టెన్షన్.. భోగాపురం వద్ద కలకలం
- అద్దాలు పగులగొట్టి దూకేసిన ప్రయాణికులు

భోగాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ట్రావెల్స్ బస్సు దగ్ధమైన దుర్ఘటన మరువక ముందే.. విజయనగరం జిల్లాలో ఆర్టీసీ బస్సు కింద నిప్పురవ్వలు రేగడం కలవరపాటుకు గురిచేసింది. బస్సు ఇంజన్ వద్ద పొగలు చూసి భయపడిపోయిన ప్రయాణికులు ఒక్కసారిగా అద్దాలు పగలగొట్టి బయటకు దూకేశారు. కొన్ని నిమిషాలపాటు తీవ్ర గందరగోళం రేపిన ఈ ఘటన విజయనగరం జిల్లా భోగాపురం వద్ద గురువారం చోటు చేసుకుంది. శ్రీకాకుళం-1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బస్సు గురువారం విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తోంది. విజయనగరం జిల్లా భోగాపురం స్టేజ్ వద్ద దిగే ప్రయాణికుల కోసం డ్రైవర్ బస్సు నిలిపాడు. రెండు నిమిషాల తర్వాత మళ్లీ బయల్దేరగా.. అంతలోనే బస్సు ముందు భాగంలోనూ, బస్సు కింద నుంచి పెద్దపెద్ద నిప్పురవ్వలు రేగడాన్ని బయటవారు గమనించి కేకలు వేశారు. డ్రైవర్ డీఎస్ మూర్తి వెంటనే బస్సు ఆపగా అంతలోనే బస్సులోపల పొగలు కనిపించాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనతో బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. కొందరు బస్సు వెనుక అద్దాలు పగులకొట్టి కిందకు దూకేశారు. అందరూ ఒకేసారి బస్సు దిగేందుకు ప్రయత్నించడంతో కొందరు వృద్ధులు, మహిళలు కింద పడిపోయారు. బస్సు దిగిన అందరూ దూరంగా పరుగులు తీశారు. బస్సు ఆపాక నిప్పురవ్వలు తగ్గిపోయాయి. విషయం తెలిసి అక్కడకు చేరుకున్న ఎస్ఐ సూర్యకుమారి డ్రైవర్‌తో మాట్లాడి బస్సును పరిశీలించారు. దీనిపై డ్రైవర్ మూర్తి మాట్లాడుతూ ఇంజన్ వద్ద షార్టు సర్క్యూట్ కారణంగా ఈ విధంగా జరిగిందని, ఇదేమి ప్రమాదం కాదని తెలిపారు. ఈ సమయంలో బస్సులో 76 మంది ప్రయాణికులు ఉన్నారు. కాసేపటికి వారందరినీ వేరొక బస్సు ఎక్కించి సురక్షితంగా పంపించారు.

నేతాజీ విమాన ప్రమాదంలో చనిపోలేదు

- ఇది దేవర్ మాట: ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

చెన్నై, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'నేతాజీ విమాన ప్రమాదంలో చనిపోలేదనే నేను నమ్ముతున్నాను. అయితే దీనిని నిరూపించడానికి నావద్ద ఎలాంటి ఆధారం లేదు' అని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ (సీపీఆర్) అన్నారు. తమిళనాడులోని రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తురామలింగ దేవర్ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. దేవర్ స్మారక స్థలం వద్ద నివాళులర్పించారు. ఆ సందర్భంగా సీపీఆర్ విలేకరులతో మాట్లాడుతూ.. 'దేవర్.. నేతాజీకి బలమైన మద్దతుదారుడు. ఆయన తన జీవితకాలంలో ఎన్నడూ అబద్ధమాడలేదు. ఆయన, 'నేతాజీ విమాన ప్రమాదంలో చనిపోలేదు. ఆయనను నేను కలిశాను' అని చెప్పారు.

పాటలు పాడి, గుసగుసలాడే ఏఐ..'లూనా'

- భారత్‌కు చెందిన 25 ఏళ్ల యువకుడి ఆవిష్కరణ



జైపూర్, అక్టోబరు 30: జైపూర్ కేంద్రంగా పని చేసే పిక్సా ఏఐ అనే స్టార్టప్ కంపెనీ వ్యవస్థాపకుడైన స్పర్ష్ అగర్వాల్ అనే 25 ఏళ్ల యువకుడు కృత్రిమ మేధ(ఏఐ)కి సంబంధించి అద్భుతమైన ఆవిష్కరణ చేశారు. ప్రపంచంలోనే తొలి స్పీచ్ టు స్పీచ్ ఏఐ మోడల్.. అంటే మనుషుల మాటలు విని తిరిగి మాటల రూపంలోనే బదులిచ్చే ఏఐని అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చారు. 'లూనా' అనే పేరు కలిగిన ఈ ఏఐ మోడల్.. మనిషి మాట్లాడే మాటలకు అచ్చం మనిషిలానే స్పందించి మాటలతోనే బదులిస్తుంది. లూనా గుసగుసలాడుతుంది, కబుర్లు చెబుతుంది, మాట్లాడే విషయానికి అనుగుణంగా తన గొంతు సవరించుకుంటుంది. అంతేనా సొంతంగా పాటలు కూడా పాడుతుంది. సరిగ్గా చెప్పాలంటే ఏఐతో కాదు ఓ మనిషితోనే మాట్లాడుతున్నామనేలా పని చేస్తుంది. ఐఐటీ భువనేశ్వర్ పట్టభద్రుడైన స్పర్ష్ అగర్వాల్.. పెద్దగా సాంకేతిక మౌలిక సదుపాయాలు, లక్షల కోట్ల పెట్టుబడులు లేకుండానే ఈ ఆవిష్కరణ చేశారు. జీపీయూ(గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్)లు, క్లౌడ్ క్రెడిట్‌లు అద్దెకు తీసుకొని, క్రెడిట్ కార్డు ద్వారా అప్పులు చేసి స్పర్ష్ లూనాను అభివృద్ధి చేశారు. స్పర్ష్ బృందంలో నితీశ్ కార్తీక్, అపూర్వ్ సింగ్, ప్రత్యూష్ కుమార్ సభ్యులు కాగా మరో ముగ్గురు ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందించారు. ఎక్స్ వేదికగా బుధవారం(అక్టోబరు 29న) లూనాను ప్రపంచానికి పరిచయం చేసిన స్పర్ష్.. లూనా సామర్థ్యాన్ని తెలిపే ఓ వీడియోను పోస్ట్ చేశారు. భావోద్వేగాలను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా పని చేసే ఏఐ మోడళ్ల అభివృద్ధికి భారతదేశాన్ని కేంద్రంగా మార్చడమే తన లక్ష్యమని స్పర్ష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

చైనాతో ట్రంప్ రాజీ!

- సుంకాలు 57% నుంచి 47%కు తగ్గింపు
- జిన్‌పింగ్‌తో చర్చల తర్వాత ట్రంప్ ప్రకటన



బుసాన్, అక్టోబరు 30: భారీ స్థాయిలో సుంకాలు విధిస్తామంటూ చైనాపై అంతెత్తున లేచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. అందుకు భిన్నంగా రాజీకి వచ్చారు. అదే సమయంలో చైనా కూడా కొంతమేర దిగి వచ్చింది. ట్రంప్ చైనాపై సుంకాలను పదిశాతం తగ్గించగా.. అరుదైన లోహాల సరఫరాపై నియంత్రణలను వాయిదా వేసేందుకు, అమెరికా సోయా ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు చైనా అంగీకరించింది. గురువారం దక్షిణకొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. ఏపీఈసీ సదస్సులో పాల్గొనేందుకు దక్షిణ కొరియాకు వచ్చిన ట్రంప్, జిన్‌పింగ్.. గురువారం ఉదయం బుసాన్ విమానాశ్రయంలో సుమారు రెండు గంటల పాటు భేటీ అయ్యారు. అనువాదకుల సాయంతో కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ట్రంప్ అమెరికాకు తిరుగుప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. "భేటీ అద్భుతంగా జరిగింది. దీనికి పదికి 12 మార్కులు ఇవ్వొచ్చు. చైనాపై సుంకాలను ప్రస్తుతమున్న 57శాతం నుంచి 47శాతానికి తగ్గిస్తున్నాం. అరుదైన లోహాల సరఫరాపై విధించిన నియంత్రణలను ఏడాది పాటు వాయిదా వేసేందుకు చైనా అంగీకరించింది. అమెరికా నుంచి సోయాబీన్ ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది" అని ట్రంప్ వెల్లడించారు. అమెరికా నుంచి ఇంధనం కొనుగోలుకు జిన్‌పింగ్ ముందుకొచ్చారని.. ఫెంటానిల్ మత్తుమందు, దాని మూల పదార్థాల సరఫరాను అరికట్టడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ఆపే అంశంపైనా చర్చించామన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని, ఆ తర్వాత జిన్‌పింగ్ కూడా అమెరికాలో పర్యటిస్తారని ట్రంప్ చెప్పారు. ఇక చైనా వాణిజ్య శాఖ కూడా అరుదైన లోహాల సరఫరా, సోయా ఉత్పత్తుల దిగుమతులపై ట్రంప్, జిన్‌పింగ్ మధ్య ఒప్పందం కుదిరినట్టు ప్రకటించింది. అయితే కీలకమైన ఎన్‌వీడియా చిప్‌సెట్లను చైనాకు అనుమతించడం, తైవాన్ వివాదం, అమెరికాలో టిక్‌టాక్‌పై నిషేధం ఎత్తివేత, రష్యా చమురు కొనుగోళ్లు వంటి అంశాలపై ట్రంప్-జిన్‌పింగ్ మధ్య చర్చలు జరగలేదు. దీనితో తాజా ఒప్పందంతో పెద్దగా ప్రయోజనం లేదని మార్కెట్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, భారత్‌లోని నాలుగు కంపెనీలు అరుదైన (రేర్ ఎర్త్) అయస్కాంతాలను దిగుమతి చేసుకునేందుకు చైనా నుంచి లైసెన్సులు పొందాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం వెల్లడించారు. దీనికి సంబంధించి ఇతర వివరాలేవీ వెల్లడించలేదు.

కెనడాపై టారిఫ్‌లు ఎత్తివేసేందుకు సెనేట్ తీర్మానం

కెనడాపై ట్రంప్ వేసిన అడ్డగోలు టారిఫ్‌లను ఎత్తివేయాలంటూ అమెరికా చట్టసభ సెనేట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 50, వ్యతిరేకంగా 46 ఓట్లు వచ్చాయి. ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ సెనేటర్ టిమ్‌కైన్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, డెమొక్రాట్లతోపాటు అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన నలుగురు సెనేటర్లు కూడా దానికి మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. గతంలోనూ ఇదే తరహాలో ట్రంప్‌కు అడ్డగోలుగా టారిఫ్‌లు వేసే అధికారం లేదంటూ సెనేట్ తీర్మానం చేసింది. కానీ రిపబ్లికన్లకు ఎక్కువ పట్టున్న ప్రతినిధుల సభ ఆ తీర్మానాన్ని చేపట్టేందుకు తిరస్కరించింది. తీర్మానం అమల్లోకి రావాలంటే.. ఇరు సభలు ఆమోదించాల్సిందే.

వర్క్ పర్మిట్ల ఆటో-రెన్యువల్‌కు అమెరికా స్వస్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 30: అమెరికాలో వలస కార్మికుల వర్క్ పర్మిట్ల ఆటోమేటిక్ పునరుద్ధరణను రద్దు చేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రకటించింది. వలస విధానాలను మరింత కఠినతరం చేసే చర్యల్లో భాగంగా ట్రంప్ యంత్రాంగం ఈ మేరకు నిర్ణయించింది. అమెరికాలోని ప్రవాస శ్రామిక శక్తిలో మెజారిటీ వాటా కలిగిన వేలాది మంది భారతీయ ఉద్యోగులను ఈ నిర్ణయం తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈఏడీ పునరుద్ధరణ కోసం అక్టోబరు 30, ఆ తర్వాత దరఖాస్తు చేసే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ వర్తించదని డీహెచ్ఎస్ స్పష్టం చేసింది. ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ (ఈఏడీ)ను పొడిగించే ముందు వలస కార్మికుల నేపథ్యాన్ని సమగ్రంగా పరిశీలించడంతో పాటు వారి సోషల్ మీడియా ఖాతాలను జల్లెడ పట్టేందుకు ఈ నూతన నిబంధనను అమలులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇమిగ్రేషన్ మోసాలను అరికట్టడానికి, జాతి ప్రయోజనాలకు భంగం కలిగించేవారిని దేశం నుంచి బహిష్కరించడానికి తాజా నిబంధన వీలు కల్పిస్తుందని పేర్కొంది. బైడెన్ ప్రభుత్వంలో ఆ వర్క్ పర్మిట్ గడువు ముగిసినప్పటికీ, దాని పునరుద్ధరణ కోసం సకాలంలో రెన్యువల్ కోసం దరఖాస్తు చేసి ఉంటే వారు 540 రోజుల పాటు ఉద్యోగంలో కొనసాగడానికి అనుమతించేవారు. ఇప్పుడు వలసదారులు ఈఏడీ గడువు ముగియడానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

అణు పరీక్షలు వెంటనే మొదలుపెట్టండి

- పెంటగాన్‌కు ట్రంప్ ఆదేశం
- దూకుడుగా వ్యవహరిస్తున్న రష్యా, చైనాలకు దీటుగా నిలిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడి

బుసాన్, అక్టోబరు 30: ప్రచ్ఛన్న యుద్ధకాలంలో దూకుడుగా సాగిన 'అణ్వస్త్ర' పోటీ మళ్లీ మొదలవుతోంది. అణ్వస్త్రాల విషయంలో రష్యా, చైనా దూకుడు మీద ఉన్నాయని, ఈ నేపథ్యంలో అమెరికా కూడా అణు పరీక్షలు నిర్వహిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దక్షిణకొరియాలోని బుసాన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ముందు ట్రూత్ సోషల్‌లో దీనికి సంబంధించి పోస్టు పెట్టడం గమనార్హం. అంతేకాదు అమెరికాకు తిరిగి వెళుతుండగా ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలోనూ ఆయన మీడియాతో మాట్లాడారు. "ఇతర దేశాలు అణు పరీక్షలు చేస్తున్నాయి. ఆ దూకుడుకు దీటుగా నిలిచేందుకు అమెరికా కూడా అణు పరీక్షలు నిర్వహించడం సమంజసమని భావిస్తున్నాను. వెంటనే మన అణు పరీక్షలు మొదలుపెట్టాలని యుద్ధ శాఖను (రక్షణ శాఖకు ట్రంప్ పెట్టిన పేరు) ఆదేశించాను. అణుశక్తిలో ఇప్పుడైతే రష్యా రెండో స్థానంలో ఉంది. చాలా దూరంలోనే అయినా చైనా మూడో స్థానంలో ఉంది. కానీ ఐదేళ్లలో దగ్గరికి చేరుకోవచ్చు" అని ట్రంప్ పేర్కొన్నారు. అణు పరీక్షలు నిర్వహించే ప్రాంతాలను త్వరలో ఎంపిక చేస్తామని చెప్పారు. నిజానికి తాను అణు నిరాయుధీకరణను కోరుకుంటానని, దీనిపై రష్యాతో ఇప్పటికే మాట్లాడుతున్నానని పేర్కొన్నారు.

అణ్వస్త్ర పోటీకి దారితీస్తుందా?

అణు పరీక్షలు నిర్వహించాలన్న ట్రంప్ నిర్ణయంతో మళ్లీ అణ్వస్త్ర పోటీ మొదలవుతుందేమోనన్న చర్చలు మొదలయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా అణ్వస్త్ర సామర్థ్యమున్న దేశాలు 1996లో 'సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. అయితే రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆ ఒప్పందం నుంచి బయటికి వస్తున్నట్టు 2023లో ప్రకటించారు. అమెరికాకు చెందిన ఆర్మ్స్ కంట్రోల్ అసోసియేషన్ లెక్కల ప్రకారం ప్రస్తుతం అమెరికా వద్ద 5,225 అణ్వస్త్రాలు, రష్యా వద్ద 5,580 అణ్వస్త్రాలు ఉన్నాయి. ఇక సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ నివేదిక ప్రకారం.. 2020లో చైనా వద్ద 300 అణ్వస్త్రాలు ఉండగా, ప్రస్తుతం 600కు చేరాయి. 'ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ టు అబోలిష్ న్యూక్లియర్ వెపన్స్ (ఐసీఏఎన్‌డబ్ల్యూ) గణాంకాల ప్రకారం.. ఫ్రాన్స్ వద్ద 290 అణ్వస్త్రాలు, యూకే 225, భారత్ 180, పాకిస్తాన్ 170, ఇజ్రాయెల్ 90, ఉత్తరకొరియా వద్ద 50 అణ్వస్త్రాలు ఉన్నాయి.

ఎండ తగలని జీవితాలు..!

దేశంలోని 46.5% మందిలో విటమిన్-డి లోపం

న్యూఢిల్లీ, అక్టోబరు 30: పట్టణాల్లో ప్రజల జీవితాలు ఎండ కన్నే సోకనివి అయిపోయాయి. ఉదయం ఆఫీసుకు వెళ్లడం మొదలు.. రాత్రి ఇంటికి చేరుకోవడం వరకు ఎక్కడా సూర్యకిరణాలు శరీరానికి తగలడంలేదు. దీంతో మన శరీరంలో స్వతహాగా విటమిన్-డి ఉత్పత్తి జరగడంలేదు. మన దేశంలో కౌమార వయసు వారు మొదలు.. ఉద్యోగాలు చేసే వారి వరకు వివిధ వయసుల ప్రజల్లో విటమిన్-డి లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మెట్రోపోలిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ సంస్థ జాతీయ స్థాయిలో చేసిన అధ్యయనం ద్వారా అది వెల్లడైంది. దేశంలో 46.5 శాతం మంది ప్రజల్లో విటమిన్-డి లోపం ఉందని 2019-25 మధ్య చేసిన 22 లక్షల ల్యాబ్ పరీక్షలను విశ్లేషించి ఆ సంస్థ చెప్పింది. అలాగే 26 శాతం మందిలో ఆ విటమిన్ చాలినంత స్థాయిలో కూడా లేదని పేర్కొంది.

ఉష క్రైస్తవంలోకి మారొచ్చు

- అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ వ్యాఖ్య

వాషింగ్టన్, అక్టోబరు 30: హిందువుగా ఉన్న తన భార్య ఉషా వాన్స్ ఏదో ఒక రోజున క్రైస్తవ మతంలోకి మారే అవకాశం ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ మారకపోయినా తనకేమీ ఇబ్బంది లేదని చెప్పారు. బుధవారం మిస్సిసిపీలో జరిగిన టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "ప్రస్తుతం ఉష నా వెంట ప్రతి ఆదివారం చర్చికి వస్తోంది. చర్చి కారణంగా నేను ప్రభావితమైనట్టే ఆమె కూడా ప్రభావితమవుతుందని ఆశిస్తున్నా. అలా జరగాలని కోరుకుంటున్నా. ఎందుకంటే క్రైస్తవ సువార్తపై నాకు విశ్వాసం ఉంది. నా భార్య కూడా అలాగే నడుస్తుందని భావిస్తున్నా" అని చెప్పారు. ఉష క్రైస్తవ మతాన్ని పుచ్చుకుంటారా అని ప్రేక్షకులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ చిట్టచివరకు ఆమె క్రీస్తు వద్దకు రావాల్సి ఉంది కదా! అని వ్యాఖ్యానించారు. అయితే ఆమె మతవిశ్వాసాలు తనకు ఇబ్బంది కలిగించడం లేదని అన్నారు. "ఒకవేళ ఆమె మారకపోతే.. అదేమీ నాకు సమస్యలు తెచ్చిపెట్టదు" అని అన్నారు. తాను 2019లో క్యాథలిక్‌లోకి మారినట్టు చెప్పారు. పిల్లల్ని మాత్రం క్రైస్తవ పద్ధతుల్లో పెంచుతున్నామన్నారు.

ఫ్యాక్టరీల్లో సేఫ్టీ ఆఫీసర్లు తప్పనిసరి

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఫ్యాక్టరీల్లో సేఫ్టీ ఆఫీసర్ల నియామకాన్ని తప్పనిసరి చేస్తూ కార్మిక శాఖ కార్యదర్శి ఎం శేషగిరిబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్‌కు సంబంధించి పాటించాల్సిన నిబంధనలనూ విడుదల చేశారు. ఫ్యాక్టరీల్లో ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పాలసీని ప్రభుత్వం తీసుకువచ్చింది. అగ్రిమెంట్ గడువు పూర్తి అయిన వెంటనే ఇరువర్గాల అంగీకారం మేరకు ఉద్యోగికి కొనసాగింపు ఉండేలా సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. మరోవైపు ఉద్యోగులు ఆయా కంపెనీల్లో ఏడాది లేదా రెండుళ్లు వర్క్ చేసినా ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ నిబంధనల ప్రకారం అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాల్సి ఉంటుంది. సేఫ్టీ ఆఫీసర్ల నియామకాన్ని తప్పనిసరి చేసిన కార్మిక శాఖ వారి వేతనాలనూ నిర్ణయించింది. గురువారం జారీ చేసిన సవరణ ఉత్తర్వులకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

ఆడిషన్స్ పేరుతో పిలిచి.. బందీలుగా..!

- 17 మంది పిల్లలు.. మరో ఇద్దరు కూడా
- ముంబైలోని పొవైలో ఘటన
- పోలీసుల భారీ రెస్క్యూ ఆపరేషన్
- ఎదురుకాల్పుల్లో నిందితుడి మృతి..

ముంబై, అక్టోబరు 30: ఆడిషన్స్ పేరుతో స్టూడియోకు రప్పించి 17 మంది పిల్లలు (13 నుంచి 17 ఏళ్ల వయసు), మరో ఇద్దరు వ్యక్తులను పట్టపగలే బంధించి బెదిరింపులకు పాల్పడటం ముంబైలో సంచలనంగా మారింది. వారిని కాపాడేందుకు పోలీసులు భారీ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలోనే నిందితుడు కాల్పులకు తెగబడగా.. పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపి బందీలను క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. బుధవారం ముంబై పొవై ప్రాంతంలోని ఆర్ఏ యాక్టింగ్ స్కూల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. రోహిత్ ఆర్య.. పిల్లలను బంధించి సామాజిక మాధ్యమాల్లో లైవ్ స్ట్రీమింగ్ పెట్టి మరీ బెదిరింపులకు పాల్పడటం వైరల్‌గా మారింది. 'నేను రోహిత్ ఆర్య. ఆత్మహత్య చేసుకోవడానికి బదులుగా ఒక ప్లాన్‌తో పిల్లలను ఇక్కడ బందీలుగా ఉంచాను.నేను ఉగ్రవాదిని కాదు.. డబ్బు అవసరం లేదు. నావి సాధారణ డిమాండ్లే.. నేను కొందరితో మాట్లాడాలనుకుంటున్నాను. ఆ డిమాండ్ నెరవేర్చకపోతే స్టూడియోను తగలబెడతా.' అంటూ నిందితుడు ముందు వీడియోలో హెచ్చరించాడు. దీనిపై సమాచారమందుకున్న ముంబై పోలీసులు.. అగ్నిమాపక దళంతో కలిసి సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. నిందితుడితో మాట్లాడేందుకు ప్రయత్నించగా అతడు నిరాకరించాడు. దీంతో బాత్రూం గది ద్వారా స్టూడియోలోనికి ప్రవేశించిన పోలీసులు.. 2గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలోనే నిందితుడు కాల్పులకు తెగబడగా.. పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో అతడు తీవ్రంగా గాయపడటంతో అదుపులోకి తీసుకొని.. 19 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఘటనా స్థలంలో ఓ ఎయిర్‌గన్, పలు రసాయనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొద్దిరోజులుగా అతడు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని.. తన పనికి సంబంధించిన బకాయి డబ్బుల కోసమే ఇదంతా చేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వెనక ఇంకా ఎవరైనా ఉన్నరా అన్నది గుర్తించే పనిలో పడ్డారు.

మావోయిస్టు డంపుల్లో 400 కిలోల పసిడి!?

హైదరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ తర్వాత మావోయిస్టు అగ్రనేతల నుంచి సాధారణ దళ సభ్యుల వరకు లొంగుబాట పట్టారు. మావోయిస్టులు భారీ సంఖ్యలో లొంగిపోతున్న క్రమంలో వారు సేకరించిన రూ.కోట్ల నగదు ఎక్కడ, ఎవరి అధీనంలో ఉంది? డంపుల సంగతేంటి? అనే అంశాలపై నిఘా వర్గాలు దృష్టి సారించగా.. విస్తుపోయే విషయాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. మావోయిస్టులు సేకరించిన రూ.వందల కోట్ల నగదును కొవిడ్ సమయంలో బంగారం రూపంలోకి మార్చివేసినట్లు నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిసా, ఏపీలోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి మావోయిస్టులు పార్టీ ఫండ్ వసూలు చేసి.. దాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. పార్టీకి నిధుల సేకరణకుగాను విస్తృత నెట్‌వర్క్ ఉందన్న విషయం ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడైంది. మావోయిస్టులు తమకు అందిన డబ్బును రెండు విధాలుగా మారుస్తున్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. పార్టీ సానుభూతిపరులు, వారి బంధువులు, కుటుంబసభ్యుల పేరిట బ్యాంకు ఖాతాలు, కంపెనీలు ప్రారంభించి అందులోకి కోట్లాది రూపాయలను మళ్లిస్తున్నారని, డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి రూ.కోట్లు జమ చేస్తున్నారని.. మిగతా డబ్బును బంగారం రూపంలోకి మార్చేశారని భావిస్తున్నారు.

ఆ బంగారం ఎక్కడుంది?

మావోయిస్టు పార్టీ వద్ద దాదాపు రూ.400 కోట్ల నిధులు ఉంటాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. 400 కిలోల బంగారం నిల్వలు కూడా ఉండొచ్చని అనుమానిస్తున్నాయి. ఆ పుత్తడి అంతా అడవుల్లోని డంపుల్లో ఉందా? లేక బయటే సురక్షిత స్థావరాల్లో దాచారా? అనే అంశంపై కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఝార్ఖండ్‌కు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎల్ఎఫ్ఐ) నాయకుడు దినేశ్ గోపేను ఆగస్టులో ఈడీ అధికారులు అరెస్టు చేశారు. దినేశ్ తన భార్య, ఆమె బంధువుల పేరిట డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ల నుంచి సేకరించిన దాదాపు రూ.20 కోట్లను బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించాడని అధికారులు గుర్తించారు. ఇక బీజాపూర్ పోలీసులు మూల్‌వాసీ బచావో మంచ్ (ఎంబీఎం)కు చెందిన ఇద్దరు సభ్యులు బ్యాంకులో రూ.6 లక్షలు డిపాజిట్ చేస్తుండగా అరెస్టు చేశారు. మజ్దూర్ సంఘటన సమితి సభ్యులు నిధులు సేకరించి, బ్యాంకుల్లో డిపాజిట్లు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గతంలో మావోయిస్టు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడైన ప్రద్యుమ్న శర్మ బంధువు చెన్నైలోని వైద్య కళాశాలలో చేరగా, ఆమె ఫీజుకు కావాల్సిన రూ.1,13,70,500ను బ్యాంకు ఖాతాల ద్వారా ఇచ్చినట్లు ఎన్ఐఏ గుర్తించింది. ఇంత మొత్తంలో డబ్బును సులభంగా పంపగలుగుతున్నారంటే వారి బినామీ ఖాతాల్లో ఎంత నగదు ఉందనే వివరాలు తేలాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మావోయిస్టు పార్టీ నుంచి ఆయుధాలతో వెళ్లి లొంగిపోతున్న వారు, ఆయుధాలు వదిలి లొంగిపోతున్న వారు తమ వద్ద ఉన్న డబ్బు లెక్కలను పార్టీకి చెప్పిన తర్వాతే బయటకు వస్తున్నారని తెలుస్తోంది. లొంగిపోతున్న మావోయిస్టులను కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు ప్రశ్నించడంతో పాటు డబ్బు లెక్కలు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

అనిల్ అంబానీ గ్రూప్‌లో 42,000 కోట్ల ఆర్థిక మోసాలు

- బయటపెట్టిన కోబ్రా పోస్ట్.. తోసిపుచ్చిన రిలయన్స్ గ్రూప్

న్యూఢిల్లీ: అంబానీ సోదరుల్లో ఒకరైన అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్‌లో భారీ ఆర్థిక మోసం జరిగిందని ఇన్వెస్టిగేటివ్ పోర్టల్ కోబ్రా పోస్ట్ బయటపెట్టింది. 2006 సంవత్సరం నుంచి గ్రూప్ కంపెనీలు రూ.41,921 కోట్లకు పైబడిన నిధులు దారి మళ్లించాయని పేర్కొంది. అనిల్ అంబానీ గ్రూప్ మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తూ కంపెనీల షేరు ధరలు పడిపోయేలా చేసేందుకు చేస్తున్న దుష్ప్రచారంగా దాన్ని వివరించింది. రిలయన్స్ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలు రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ క్యాపిటల్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ కార్పొరేట్ అడ్వైజరీ సర్వీసెస్ బ్యాంక్ రుణాలు, ఐపీఓలు/బాండ్ల జారీ ద్వారా సేకరించిన నిధులు అన్నీ కలిపి రూ.28,874 కోట్లు ప్రమోటర్లతో అనుబంధం ఉన్న కంపెనీల్లోకి దారి మళ్లించినట్లు కోబ్రా పోస్ట్ ఆ కథనంలో తెలిపింది. ఇది కాకుండా మరో రూ.13,047 కోట్లు.. సింగపూర్, మారిషస్, సైప్రస్, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, అమెరికా, యూకేల్లోని విదేశీ సంస్థల నుంచి డొల్ల కంపెనీల ద్వారా మోసపూరితమైన విధానంలో దేశానికి తరలించారని కూడా ఆరోపించింది.

నిబంధనల ఉల్లంఘన

ఈ క్రమంలో కంపెనీల చట్టం, ఫెమా, పీఎంఎల్ఏ, సెబీ, ఆదాయపు పన్ను చట్టం వంటి విభిన్న చట్టాల్లోని నిబంధనలు ఉల్లంఘించినట్టు కూడా తెలిపింది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సెబీ, ఎన్‌సీఎల్‌టీ, ఆర్‌బీఐ, విదేశీ నియంత్రణ సంస్థల ఉత్తర్వులు, ఫైలింగ్‌ల ఆధారంగా తాను ఈ వివరాలు సేకరించినట్టు కోబ్రా పోస్ట్ తెలిపింది. ఈ నిధులను వ్యక్తిగత విలాసాల కోసం వినియోగించిన క్రమంలో ఒక ఉదాహరణ చూపుతూ 2008 సంవత్సరంలో అనిల్ అంబానీ తన గ్రూప్‌లోని ఒక లిస్టెడ్ కంపెనీ నిధులతో 2 కోట్ల డాలర్ల విలువ గల ఒక యాచ్ కొనుగోలు చేసినట్టు తెలిపింది. ఇలా నిధులు దారి మళ్లించేందుకు అనిల్ ధీరూభాయ్ గ్రూప్ (అడాగ్).. ప్రత్యేక కంపెనీలు లేదా ఎస్‌పీవీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. తొలుత ఈ కంపెనీలకు నిధులు బదిలీ చేసి ఆ తర్వాత వాటన్నింటినీ కొట్టి వేయడం వంటి చర్యల ప్రభావం వల్ల గ్రూప్‌లోని మొత్తం ఆరు లిస్టెడ్ కంపెనీలు ఆర్థిక కష్టాల్లో పడ్డాయని కోబ్రా పోస్ట్ వెల్లడించింది.

రేపు పెద్దన్నవారిపల్లికి సీఎం చంద్రబాబు

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం వస్తున్నారని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం పరిశీలించారు. జిల్లాలో నవంబరు నెలకు 2,64,802 మందికి రూ.115.92 కోట్ల పింఛన్ సొమ్ము మంజూరైంది. పెద్దన్నవారిపల్లిలో జరిగే పింఛన్ల పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొంటున్నారు. గ్రామంలో 756 మంది లబ్ధిదారులు ఉన్నారు.

'సత్యసాయి శత జయంతి'కి ఉపసంఘం

అమరావతి/పుట్టపర్తి రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల పర్యవేక్షణ, నిర్వహణ, వివిధ శాఖలతో సమన్వయానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. దీనికి అనగాని సత్యప్రసాద్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పయ్యావుల కేశవ్, సత్యకుమార్, ఎస్.సవిత, మంత్రి కందుల దుర్గేష్, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సభ్యులు. పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

చెరువు నీరు ఇండోసోల్ ప్రాజెక్టుకా?

- అనుమతులతోనే పైపులైన్ వేశారా?
- క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించండి
- నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు రోజువారీ అవసరాల కోసం వినియోగించే చెరువునీటిని ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు ఎలా తరలిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ముందుంచిన ఫొటోలను పరిశీలిస్తే నీటి తరలింపునకే పైపులైన్లు వేశారన్న పిటిషనర్ వాదనలో వాస్తవం ఉన్నట్లు కనపడుతోందని వ్యాఖ్యానించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలోని చేవూరు, చెన్నాయపాలెం గ్రామాల చెరువుల నుంచి ఆ సోలార్ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారా.. నీటి తరలింపునకు అనుమతులు ఉన్నాయా.. అనే విషయాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. అనుమతులు లేకుంటే నీటి తరలింపుపై ముందుకెళ్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది. తదుపరి విచారణ నాటికి నివేదికను తమ ముందుంచాలని స్పష్టంచేసింది. విచారణను నవంబరు 5వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుడ్లూరు మండలం చేవూరు, కావలి మండలం చెన్నాయపాలెం గ్రామాల పరిధిలోని చెరువు నీటిని ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు తరలిస్తున్నారని ఆ రెండు గ్రామాల ప్రజలు పలువురు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇది బుధవారం ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రెండు గ్రామాల ప్రజలు చెరువు నీటిని తాగునీరు, ఇతర రోజువారీ అవసరాల కోసం వినియోగిస్తారని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ల ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. సోమశిల నుంచి ఆ సోలార్ ప్రాజెక్టుకు అవసరమైన నీటిని తరలించబోతున్నారని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ పైపైకి!

6 నెలల్లో 20శాతం పెరుగుదల నమోదు.. నాలుగు కోట్ల మందికి పైగా వైద్యసేవలు

- 80 నుంచి 150కి పెరిగిన ఓపీ కౌంటర్లు
- రోగులు వేచి ఉండే సమయం తగ్గుదల
- వైద్యులు, సిబ్బంది హాజరు 92 శాతానికి
- వైద్య, రక్త పరీక్షల్లో 6.10 శాతం వృద్ధి
- రికార్డు స్థాయిలో ఆస్పత్రులకు రోగులు క్యూ



అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఓపీ, ఐపీ, వైద్య పరీక్షలతో పాటు వైద్యులు, సిబ్బంది హాజరు గణనీయంగా మెరుగుపడింది. గడిచిన ఆరు నెలల్లో 20 శాతం వృద్ధితో ప్రభుత్వ వైద్యశాలల్లో 4 కోట్ల మందికి పైగా ఓపీ సేవలు అందించారు. గతంలో ఓపీ సేవలు అందించడానికి ఒక్కో రోగికి సగటున 42 నిమిషాలు పట్టేది. ప్రస్తుతం ఇది 26 నిమిషాలకు తగ్గిపోయింది. ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ కౌంటర్లు కూడా 80 నుంచి 150కి పెరిగాయి. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులకు సంబంధించిన కౌంటర్లను 53 నుంచి 116కు పెంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైద్యరంగాన్ని మెరుగుపరచడానికి ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేపట్టిన ప్రయత్నాలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయి. వివిధ విభాగాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరు, పథకాల అమలుకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ఆయన ఎప్పటికప్పుడు తెప్పించుకుంటూ అనుకూల, ప్రతికూల అంశాల్ని నిశితంగా గమనించి, తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఆరోగ్య రంగంలో పరిస్థితులను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో వచ్చిన ఫలితాలపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది హాజరు, ఓపీ, ఐపీ, డయాగ్నొస్టిక్ సేవల్లో పురోగతి, ఆరోగ్య పథకాల అమలులో వచ్చిన మార్పు ఆశాజనకంగా ఉన్నాయని హర్షం వ్యక్తం చేశారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత గత వైసీపీ ప్రభుత్వం నుంచి వారసత్వంగా సంక్రమించిన సమస్యలను పరిష్కరించడంపై ఆరోగ్యశాఖ పూర్తిస్థాయిలో దృష్టి పెట్టింది. సిబ్బందిలో క్రమశిక్షణ రాహిత్యం, జవాబుదారీతనం లోపించడాన్ని గుర్తించిన మంత్రి సత్య.. వివిధ విభాగాల పనితీరు, పథకాల అమలు మదింపు కోసం ఒక పటిష్టమైన, సమగ్ర మూల్యాంకన వ్యవస్థను గత నవంబరులో ప్రవేశపెట్టారు. దీని ఆధారంగా వివిధ జిల్లాల పనితీరు, పథకాల అమలు, డివిజన్లకు ర్యాంకులు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ప్రభుత్వ వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు ఈ ఏడాది ఏప్రిల్‌లో 83శాతం ఉండగా, సెప్టెంబరు నాటికి 92 శాతానికి పెరిగింది. నర్సులు, పారామెడికల్ సిబ్బంది హాజరు 90 శాతానికి పైగా ఉండగా, వైద్యుల హాజరు 82శాతం ఉంది. తిరుపతిలో వంద శాతం, కాకినాడలో 99.92 శాతం, విశాఖ కేజీహెచ్‌లో 95.30 శాతం మంది వైద్యులు విధులకు హాజరవుతున్నారు. ఆరు నెలల సగటు ప్రకారం... విశాఖలో అత్యధికంగా 93.13 శాతం, కర్నూలు, రాజమండ్రిల్లో 90శాతానికి పైగా వైద్యుల హాజరు నమోదైంది. ఇక నెల్లూరు, ఏలూరు, గుంటూరు, తిరుపతిల్లో వైద్యుల హాజరు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో దాన్ని మెరుగుపర్చడానికి చర్యలు చేపట్టాలని శాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. ఇదే సమయానికి ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఈసీజీ సేవలతో పాటు ల్యాబ్ పరీక్షలను 2.50 కోట్ల మంది రోగులకు ఆరోగ్యశాఖ అందించింది. ఈ విషయంలో 6.10 శాతం వృద్ధి నమోదైంది.

పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తాం

వైద్య వ్యవస్థలో జవాబుదారీతనం కోసం నిరంతర పర్యవేక్షణతో చేసిన కృషి మంచి ఫలితాలను ఇవ్వడం ఆనందంగా ఉంది. ఓపీ సేవల్లో ఆరు నెలల్లో 20 శాతం వృద్ధి, ఐపీలో కూడా దాదాపు ఇంతే స్థాయిలో నమోదైంది. ఐపీని కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన కోసం చేయాల్సినది ఇంకా చాలా ఉంది. - ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

అప్పు తెచ్చి బకాయిల చెల్లింపు!

(మొదటి పేజీ తరువాయి)

అసోసియేషన్ (ఆషా) ప్రతినిధులతో జరిగిన సమావేశంలో వెల్లడించారు. చర్చల్లో భాగంగా సీఈవో కీలక విషయాలు వారికి తెలిపారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలనే నిర్ణయం తీసుకుందని, అయితే రుణం రావడానికి 3-4 నెలల వ్యవధి పడుతుందని తెలియజేశారు. వచ్చిన వెంటనే బకాయిలు మొత్తం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒకేసారి బకాయిల మొత్తం క్లియర్ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో ఆషా ప్రతినిధులు సమ్మె విరమణకు సూత్రప్రాయ అంగీకారం తెలిపారు. ఆషా జనరల్ బాడీ సమావేశంలో చర్చించిన తర్వాత దీనిపై తుది నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు. మరోవైపు తాత్కాలిక ఉపశమనం కింద వెంటనే ఆస్పత్రులకు రూ.250 కోట్లు విడుదల చేయాలని ఆషా ప్రతినిధులు కోరారు. ఇప్పటికే రూ.250 కోట్లు విడుదల చేశామని, మరో రూ.250 కోట్లు విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని ట్రస్ట్ అధికారులు హామీ ఇచ్చారు. శుక్రవారం ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె విరమణ నిర్ణయం ఉండనుంది.

1-2 నెలలకోసారి 250 కోట్లు చెల్లిస్తున్నా..

ప్రభుత్వం ఒకవైపు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులకు 1-2 నెలలకోసారి రూ.250 కోట్ల వరకూ చెల్లింపులు చేస్తోంది. అయినా రూ.3 వేల కోట్లకు పైగా బకాయిలు అలానే ఉంటున్నాయి. పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్యం బంద్, సమ్మె, ఆందోళనలు అంటూ హడావుడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం బ్యాంకు నుంచి రుణం తీసుకొని, నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులు చేయాలని నిర్ణయించినట్లు ట్రస్ట్ సీఈవో పేర్కొన్నారు. తీసుకొన్న రుణాన్ని బ్యాంకుకు ప్రతినెలా కొంత మొత్తం లెక్కన చెల్లించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

శస్త్ర చికిత్సల ప్యాకేజీలు పెంచండి..

మరోవైపు ప్రభుత్వం ప్రజలకు బీమా కల్పించే దిశగా వెళ్తున్న నేపథ్యంలో శస్త్ర చికిత్సల ప్యాకేజీలు పెంచాలని ఆషా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ట్రస్ట్ ప్రారంభించిన తర్వాత కేవలం ఒకటి, రెండు సార్లు మాత్రమే ప్యాకేజీలు పెంపు చేపట్టారని, ఇప్పుడు ఆ ప్యాకేజీలతో ఇన్సూరెన్స్‌లో వైద్య సేవలు అందించలేమని ట్రస్ట్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని అధికారులు తెలిపారు.

మంత్రివర్గ సమావేశం 10కి వాయిదా

అమరావతి : రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముందస్తుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకా రం నవంబరు 7వ తేదీ కాగా, మొంథా తుపాన్, ఇతర కారణాల దృష్ట్యా ప్రభుత్వం వాయిదా వేసి 10వ తేదీన సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. 8వ తేదీ నాటికి ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు వారి శాఖలకు సంబంధించిన అజెండాలను జీఏడీకి పంపించాల్సి ఉంటుంది.

బిల్లులు ఆమోదించేందుకు 25 శాతం కమీషన్!

- కాంట్రాక్టర్ నుంచి రూ.1,25,000 లంచం డిమాండ్
- ఏసీబీకి చిక్కిన రేపల్లె రేంజ్ అటవీ అధికారి

బాపట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బిల్లులకు ఆమోదం తెలపాలంటే 25 శాతం కమీషన్ ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను వేధింపులకు గురి చేసిన బాపట్ల జిల్లా రేపల్లె రేంజ్ అటవీ అధికారి రమణారావును ఏసీబీ అధికారులు గురువారం వల పన్ని పట్టుకున్నారు. బాపట్ల మండలం ఆదర్శనగర్ సమీపంలో ఉన్న నగరవనం సుందరీకరణ పనుల్లో రూ.5.90 లక్షల బిల్లులకు సంబంధించిన మొత్తాన్ని ఈ నెల 25న కాంట్రాక్టర్ కర్రి వీర్ల అంకయ్య ఖాతాల్లో జమయింది. ఇందులో రమణారావు లంచం డిమాండ్ చేశారు. ఇవ్వకపోయేసరికి సాంకేతిక అంశాల పేరుతో ఇబ్బంది పెట్టడంతో అంకయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. నగర వనంలో రమణారావు రూ.1,25,000 లంచం తీసుకుంటుండగా గుంటూరు రేంజ్ ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహేంద్ర సారథ్యంలోని బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం గుంటూరు ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.

'జోగి'కి బిగుస్తున్న

నకిలీ మద్యం ఉచ్చు!

- త్వరలోనే ఆయనను విచారణకు పిలిచే అవకాశం
- ఇప్పటికే జోగి పేరు వెల్లడించిన 'అద్దేపల్లి' సోదరులు
- సిట్ విచారణలో అదే వాంగ్మూలం



అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావు

విజయవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేశ్ చుట్టూ నకిలీ మద్యం కేసు ఉచ్చు బిగుస్తుందా..? త్వరలో సిట్ అధికారులు ఆయనను ప్రశ్నించడానికి రంగం సిద్ధం చేశారా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. నకిలీ మద్యం తయారీ కేసులో ఇప్పటికే జోగి రమేశ్ పేరును ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన విడుదల చేశాడు. ఈ కేసులో అద్దేపల్లి సోదరులు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. జనార్దనరావు నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉండగా.. ఆయన సోదరుడు జగన్మోహనరావు విజయవాడ జిల్లా జైల్లో ఉన్నాడు. అటు సిట్ అధికారులు, ఇటు ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఈ ఇద్దరినీ వేర్వేరు గదుల్లో వీడియో రికార్డింగ్ మధ్య విచారించినప్పుడు వారు జోగి రమేశ్ పేరును వెల్లడించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో 2022 నుంచి నకిలీ మద్యం తయారీని మొదలు పెట్టాడు. ఇదంతా నాటి వైసీపీ ప్రభుత్వంలో ఉన్న జోగి రమేశ్ ప్రోద్బలంతోనే సాగినట్టు వెల్లడించినట్టు తెలిసింది. వారి నుంచి తీసుకున్న వాంగ్మూలంలోనూ ఈ పేరును ప్రస్తావించారు. దీనికి సంబంధించిన కొన్ని ఆధారాలను అద్దేపల్లి సోదరులు సిట్ అధికారులకు ఇచ్చినట్టు సమాచారం. ఇబ్రహీంపట్నంలోని నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసివేయాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. ఇదే విషయాన్ని జోగి రమేశ్ వద్ద జనార్దనరావు ప్రస్తావించగా.. అంతా తాను చూసుకుంటానని మాజీ మంత్రి అభయమిచ్చినట్టు వారు వివరించారు. జోగి ఇచ్చిన భరోసాతోనే బెంగళూరు నుంచి మద్యం తయారీకి అవసరమైన స్పిరిట్, కార్మెల్, ఇతర రసాయనాల ముడిసరుకులను భారీగా రప్పించామని అన్నదమ్ములు పూసగుచ్చినట్టు చెప్పారు. ఇబ్రహీంపట్నంలో ఈ నకిలీ మద్యం తయారు చేస్తున్నప్పటి నుంచి జోగి రమేశ్‌తో తమకు సత్సంబంధాలు ఉన్నట్టు స్పష్టం చేసినట్టు తెలిసింది. జోగితో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను కూడా అందజేశారని విశ్వసనీయంగా తెలిసింది. అద్దేపల్లి సోదరుల నుంచి వాంగ్మూలం తీసుకున్న అధికారులు వాటిని పరిశీలించిన తర్వాత జోగి రమేశ్‌ను విచారణకు పిలవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతానికి అద్దేపల్లి సోదరుల విచారణ ముగిసింది. శుక్రవారం నుంచి మరో నిందితుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావును కస్టడీలోకి తీసుకుని విచారిస్తారు. ఆయన వాంగ్మూలాన్ని బేరీజు వేసుకుని జోగి రమేశ్‌ను విచారణకు పిలుస్తారని తెలుస్తోంది. ఈ విచారణ పూర్తయిన తర్వాత జోగిని ఈ కేసులో నిందితుడిగా చేర్చుతున్నామని అధికారులు కోర్టులో మెమో దాఖలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

ముగిసిన 'అద్దేపల్లి' సోదరుల కస్టడీ

నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహనరావులకు ఎక్సైజ్ పోలీసుల కస్టడీ గురువారంతో ముగిసింది. వారిద్దరినీ సిట్ అధికారులు విజయవాడలో వారం రోజులపాటు విచారించారు. కస్టడీ ముగియడంతో ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం వారిని ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణకు సంబంధించి వీడియోను అధికారులు న్యాయాధికారికి అందజేశారు. అనంతరం జనార్దనరావును ఎస్కార్ట్ సిబ్బంది నెల్లూరులోని కేంద్ర కారాగారానికి, జగన్మోహనరావును విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. కాగా, నకిలీ మద్యం తయారీ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న తిరుమలశెట్టి శ్రీనివాసరావును ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకోనున్నారు. ప్రస్తుతం అతడు నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్నాడు. కస్టడీ ముగిసిన అద్దేపల్లి జనార్దనరావును అక్కడి జైలు అధికారులకు అప్పగించి, శ్రీనివాసరావును విజయవాడకు తీసుకురానున్నారు.

నలుగురిపై పీటీ వారెంట్

నకిలీ మద్యం తయారీ కేసులో నలుగురు నిందితులపై పీటీ వారెంట్‌కు విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు అనుమతించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సయ్యద్ హాజీ, కట్టా శ్రీనివాసరావు, మిథున్ దాస్, అంతా దాస్.. చిత్తూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారు భవానీపురం ఎక్సైజ్ పోలీస్‌లు నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్నారు. వారిని కోర్టులో హాజరుపరిచేందుకు అనుమతివ్వాలని ఎక్సైజ్ పోలీసులు కొద్ది రోజుల క్రితం పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 22 లోపు వారిని కోర్టులో హాజరుపరచాలని న్యాయాధికారి జి.లెనిన్‌బాబు అనుమతిచ్చినా ఆ గడువులోగా హాజరుపరచలేదు. దీంతో మరో పిటిషన్ దాఖలు చేయగా.. నవంబరు 12లోగా కోర్టులో హాజరుపరచాలని న్యాయాధికారి ఆదేశాలిచ్చారు.

మార్గదర్శిపై హైకోర్టులోనే తేల్చుకోండి

- అనుబంధ పిటిషన్లపై విచారణ ముగించిన సుప్రీంకోర్టు
- ఉండవల్లి వాదనలు వినేందుకు విముఖత

న్యూఢిల్లీ, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ రిజర్వు బ్యాంకు నిబంధనలను పాటించలేదన్న కేసును హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ అంశంపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వాదనలు వినేందుకు విముఖత చూపించింది. మార్గదర్శి సంస్థ ఆర్బీఐ నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విచారణకు ఆదేశిస్తూ ప్రత్యేక జీవో జారీ చేశారు. ఆ జీవోను కొట్టివేయాలని కోరుతూ 2007 ఫిబ్రవరి 9న సంస్థల చైర్మన్ రామోజీరావుతో పాటు, మార్గదర్శి ఫైనాన్షియర్స్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఏపీ ప్రభుత్వం, వైఎస్‌ను ప్రతివాదులుగా చేర్చాయి. ఆ తర్వాత ఉండవల్లితోపాటు మరికొందరు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లు గురువారం జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ ఆరాధేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ మార్గదర్శికి సంబంధించిన ప్రధాన రిట్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అలాగైతే హైకోర్టులోనే తేల్చుకోవాలని తేల్చి చెప్పింది. వర్చువల్‌గా విచారణకు హాజరైన ఉండవల్లి అరుణ్ కుమార్ దీనికి అభ్యంతరం తెలిపారు. ఇది కేవలం డిపాజిట్లు, చెల్లింపులకు సంబంధించిన సమస్య మాత్రమే కాదని, ఆర్బీఐ నిబంధనల ఉల్లంఘన జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ అవసరమని చెప్పారు. ఇంతలో సిద్ధార్థ లూథ్రా కలుగజేసుకుని ఉండవల్లి అసలు ఇందులో ప్రతివాదే కాదన్నారు. ఇప్పటికే డిపాజిట్లు తిరిగి చెల్లించేశారని, మరో రూ.5.34 కోట్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. మెచ్యూరిటీ తేదీల ఆధారంగా ఆ మొత్తాలను కూడా చెల్లిస్తారని తెలిపారు. ఇరువర్గాల వాదనల తర్వాత.. ఈ కేసుకు అనుబంధంగా దాఖలైన అన్ని పిటిషన్లపై విచారణను ముగిస్తున్నట్టు ధర్మాసనం వెల్లడించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఫలించిన వ్యూహం

భారతప్రధాని నరేంద్రమోదీ రష్యానుంచి ముడి చమురు కొనడం ఆపివేయబోతున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించినప్పుడు అధికులు అయనమాట నమ్మలేదు. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని, వాణిజ్యాస్త్రాన్ని ప్రయోగించి రెండు దేశాలను దారికితెచ్చానని ట్రంప్ యాభైఐదుసార్లు చెప్పుకున్నా, భారత పాలకులు, అధికారులు అత్యధిక సందర్భాల్లో మౌనాన్నే ఆశ్రయించారు. అటు ఆమోదించకుండా, ఇటు పూర్తిగా కాదనకుండా మొదట్లో జాగ్రత్తపడినవారు, ఆ తరువాత, పాక్ సైనికాధికారులు దాడులు ఆపండి మహాప్రభో అని వేడుకోవడంతో ఆపరేషన్ సిందూర్‌ను తామే నిలిపివేశామన్నారు. భారత్ ఇకపై రష్యా చమురు కొనబోదని అదేపనిగా ఐదారుసార్లు చెప్పిన ట్రంప్, దిగుమతులు పూర్తిగా ఆపివేయడానికి కొంతసమయం పడుతుందని ఉదారంగా అన్నప్పటికీ, ఆయన కోరిక అతివేగంగా నెరవేరుతోంది. ఆయిల్ కంపెనీలు దిగుమతులు నిలిపివేయడమే కాదు, ఏకంగా సముద్రం మధ్యలో ఉన్న ముడిచమురు నౌకలు ప్రయాణం ఆపి, తిరిగి రష్యాకు మళ్ళిపోతున్న వార్తలు సైతం వింటున్నాం. అయినా ట్రంప్‌కు అక్కసుతీరడం లేదు. దక్షిణకొరియాలో ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కోపరేషన్ (ఎపెక్) సదస్సులో ఆపరేషన్ సిందూర్ గురించీ మోదీ గురించీ ఆయన చేసిన వ్యాఖ్యలు ఉపరితలంలో ప్రశంసలుగా కనిపించే ఒత్తిడి వ్యూహం.

వ్యాపారవేత్త అయిన ట్రంప్‌కు ఎవరిని ఎలా బుజ్జగించాలో, ఏ విధంగా లొంగదీసుకోవాలో తెలుసు. అర్థంపర్థంలేకుండా మాట్లాడుతూనే ఎదుటివారిని ఇరకాటంలో పడేయగలదిట్ట. ఆపరేషన్ సిందూర్‌ని అదేపనిగా ప్రస్తావిస్తూ భారతపాలకులమీద ఒత్తిడి పెంచే వ్యూహానికి ఆయన మరింత పదునుపెడుతున్నారు. యుద్ధాన్ని ఆపిన శాంతిదూతగా ట్రంప్‌ను దేశవిదేశీ వేదికలమీద పాకిస్తాన్ ప్రధాని, సైన్యాధ్యక్షుడు ఆకాశానికి ఎత్తేస్తూ, ఏకంగా నోబెల్ శాంతి కోసం నామినేట్ చేస్తూంటే, అవును నిజమేనని భారత పాలకులు ఒక్కమాట కూడా అననందుకు ఆయన అలిగాడు, ఆగ్రహించాడు. నేరుగా కాకున్నా, పరోక్షంగానైనా ప్రశంసించనందుకు నొచ్చుకున్నాడు. సుంకాల యుద్ధాన్ని ఇంత తీవ్రతరం చేయడం వెనుక దెబ్బతిన్న ఆయన అహం ఉన్నదని అందరికీ తెలుసు. గతంలో యుద్ధంలో కూలిన విమానాల ప్రస్తావన చేసిన ట్రంప్ ఇప్పుడు ఏకంగా నిగనిగలాడే అందమైన ఏడు సరికొత్త విమానాలంటూ మరో అడుగుముందుకు వేశారు. గతంలో, ఆపరేషన్ సిందూర్‌లో విమానాల కూల్చివేత విషయాన్ని అప్పటివరకూ ప్రకటించని భారతప్రభుత్వం, ట్రంప్ చెప్పిన సంఖ్య గురించి మాట్లాడకుండానే కూలినమాట వాస్తవమేనని ఆ తరువాత ఒప్పుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు విమానాలు ఎవరివో, ఏ కంపెనీవో నేరుగా నిర్వచించకుండా భారత్‌మీద పరోక్షంగా ఒత్తిడిపెంచే వ్యూహంలో ఉన్నారాయన.

మోదీని ప్రశంసిస్తూనే భారత్‌ను మోదే పనిలో ట్రంప్ నిపుణుడు. నాకు మంచి మిత్రుడు అంటూనే సుంకాలు, ప్రతీకార సుంకాలు, చమురు సుంకాలతో ఆయన కక్షతీర్చుకున్నాడు. ఉక్రెయిన్ యుద్ధంతో రష్యానుంచి ఒక్కసారిగా నలభైశాతానికి చేరిన ముడిచమురు దిగుమతులను ఆపించేందుకు ఆయన సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగించాడు, అంతిమంగా తాను అనుకున్నది సాధించాడు, మరోపక్క పైకి మాత్రం మోదీని మొండిమనిషని అంటున్నారు. తాను కోరుకున్న రీతిలో రష్యానుంచి పూర్తిగా ముడిచమురు దిగుమతులు నిలిచిపోతున్న తరుణంలో, మరిన్ని సరికొత్త రీతుల్లో భారత్‌ను వాణిజ్యఒప్పందంలో లొంగదీసే ప్రయత్నంలో ట్రంప్ ఉన్నారు. ట్రంప్ ఏవో వ్యాఖ్యలు చేసినంతమాత్రాన పట్టించుకోనక్కరలేదని, చమురు విషయంలో మోదీ దిగిరారనీ, ఆప్తమిత్ర రష్యాను వదులుకోబోరనీ కొందరు విశ్లేషించినప్పటికీ, అంతిమంగా ట్రంప్ కోరినట్టుగానే జరుగుతోంది. ట్రంప్ ఆంక్షల దెబ్బకు భారత్ అసంఘటిత రంగం బాగా దెబ్బతిని ఉన్నందున గత్యంతరం లేదన్న మాట కూడా నిజం. కానీ, దేశ ఇంధనభద్రతను పరిరక్షించుకోవడానికే ముడిచమురు దిగుమతి చేసుకుంటున్నామని, ఒక ఏడాది భారత్ కొనే ఇంధనం యూరప్ ఒక పూట కొనుగోలు చేసేదానికి సమానమని గతంలో అంతర్జాతీయ వేదికలమీద గర్జించిన మన నేతలు ఇప్పుడు మాట్లాడటం లేదు. భారతీయుల ప్రయోజనాల పరిరక్షణే తమ లక్ష్యమని, ఉపన్యాసాలు దంచిన పాలకులు ఇప్పుడు కాలు వెనక్కుతీసుకొనే కార్యక్రమాన్ని గుట్టుచప్పుడు కాకుండా కానిచ్చేస్తున్నారు.

సమరాంగణ సూత్రధారి... ఇందిర

ఇరవయ్యవ శతాబ్ది నాటి దూరదృష్టి గల పాలకుల్లో నెహ్రూ ఒకరు. వేగంగా ఆర్థికాభివృద్ధి సాధించడం ద్వారానే త్వరితంగా దేశ స్వాతంత్ర్యం, సమగ్రతలను కాపాడుకోవడం, పేదరికాన్ని నిర్మూలించడం, సామాజిక సంక్షేమం సాధించడం వీలవుతుందని ఆయన గట్టిగా విశ్వసించారు. ఆ దిశగా నిర్ణయాలు తీసుకోవడంలోనే ఆయన ఆలోచనా స్థాయి అర్థమవుతుంది. అందుకే ఆయన పాలనా కాలంలో అన్ని రంగాల్లోనూ సత్ఫలితాలు గణనీయంగా సంభవించాయి.

ఇక, 1966లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయిన నాటికి దేశంలో ఆర్థిక మాంద్యం, పారిశ్రామిక ఉత్పత్తుల పతనం, ఎగుమతులు తగ్గడం, ఆహారధాన్యాల సంక్షోభం ఏర్పడ్డాయి. వీటితో పాటు బడ్జెట్ డెఫిసిట్ పెరగడం, విదేశీ ఆర్థిక సాయంపై ఎక్కువగా ఆధారపడటం వంటివే గాక 1962, 1965నాటి యుద్ధాలు, పాకిస్థాన్- చైనా కూటమి ఏర్పాటులో సైన్యంపై ఖర్చు పెంచడం వంటివీ జరిగాయి. వర్షాలు లేక కరువు ఏర్పడింది. ధరలు పెరిగాయి. పాలనా ఖర్చులు తగ్గించుకోవడం వీలుపడలేదు. అయినా, యుద్ధ ప్రాతిపదికన ఆహార ధాన్యాలు సేకరించి, ప్రజలకు పంచి, వారి ప్రాణాలు కాపాడగలిగారు.

అందరు నాయకుల్లో ఉన్నట్లుగానే ఇందిరాగాంధీలోనూ కొన్ని బలమైన అంశాలు, కొన్ని బలహీన అంశాలు ఉన్నాయి. ఉదాహరణకు: ఎందరి నుంచి సలహాలను ఆహ్వానించినా, తన స్వీయ నిర్ణయానికే ప్రాధాన్యమిచ్చే గుణం ఆమెది. ఇది ఆమె రాజకీయ చతురత. అంతేకాదు, ఎలాంటి నిర్ణయాన్నైనా ధైర్యంగా, త్వరితంగా, సరైన సమయంలో తీసుకోవడం ఆమెకు అలవాటు. ఆమె తీసుకున్న చాలా నిర్ణయాల్లో మనం దీన్ని గమనించవచ్చు.



1969లో కాంగ్రెస్ చీలినప్పుడైనా కావచ్చు, 1971 నాటి బంగ్లాదేశ్ సందర్భమైనా కావచ్చు. అదే ఏడాది భారత్‌ను బెదిరించడానికి బంగాళాఖాతంలోకి అమెరికా పంపిన 'సెవెంత్ ఫ్లీట్‌'ను ఎదురించడంలోనైనా కావచ్చు. 1966లో 'పంజాబీ సుబా'ను సృష్టించారు. 1975లో అత్యవసర పరిస్థితి విధించారు. ఎమర్జెన్సీ పొడిగింపుతో నిరంకుశంగా పాలించే అవకాశమున్నా, ప్రజాస్వామ్య విలువలకు ప్రాణం పోయాలని భావించి ధైర్యంగా సాధారణ ఎన్నికలకు వెళ్లారు. 1977–79 మధ్య ఎమర్జెన్సీ కమిషన్ల ద్వారా జనతా ప్రభుత్వం వేధించిన సమయంలోనూ ఆమె సంయమనాన్ని, ధైర్యాన్ని కోల్పోలేదు.

దేశ ప్రజలపైన ఇందిరాగాంధీకి వల్లమాలిన ప్రేమ ఉండేది. 'నా దేశం గొప్పది' అనే గర్వం ఆమెలో ప్రస్ఫుటంగా అగుపడేది. భారత్ ఎదగబోయే స్థాయిని అంచనా వేసుకుని ఉప్పొంగిపోయేవారు. అందుకే, దేశ ప్రాధాన్యాలు, దేశ గౌరవం కాపాడ్డంలో ఇందిర రాజీపడేవారు కాదు. దేశీయంగా బలంగా ఉంటేనే జాతి గౌరవం, స్వాతంత్ర్యాలు భద్రంగా ఉంటాయని ఆమె గట్టిగా నమ్మేవారు. ఎన్ని అడ్డంకులు పుట్టుకొచ్చినా ఆ దిశగా శ్రమించేవారు. దేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, సాంకేతికంగా, సైనికంగా స్వయం సమృద్ధిగా, స్వతంత్రంగా నిలిపి ఉంచేందుకై కృషి చేసేవారు. ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారు. 1970 దశకంలో అనేక దేశాలు ఆయిల్ సంక్షోభంలో కొట్టుమిట్టాడినా భారత్‌ను మాత్రం ఆ సమస్య నుంచి ఇందిర కాపాడగలిగారు.

గ్రీన్ రెవల్యూషన్ విజయం ద్వారా దేశంలో ఆహారధాన్యాల కొరతను దూరం చేశారు. పాశ్చాత్య పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల్లో సంభవించే ఆర్థిక మాంద్యాల ప్రభావాలు భారత్ దరిదాపులకు కూడా రాకుండా చూడడంలో తన తండ్రి నెహ్రూను మరపించారు. భారత అంతర్గత విషయాల్లో ఇతర దేశాల ప్రమేయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే, కోల్డ్‌వార్ కూటముల నుంచి భారత్‌ను దూరంగా ఉంచారు. అణు కార్యకలాపాలను శాంతియుత కార్యక్రమాలకే పరిమితం చేసినా, అణ్వాయుధాల తయారీ నిషేధ ఒప్పందంపై సంతకానికి మాత్రం నిరాకరించారు. నెహ్రూ ఏర్పరచిన అలీన విధానాన్నే అనుసరించారు. దేశాన్ని శక్తిమంతమైనదిగానూ, స్వయం సమృద్ధ దేశంగానూ నిలబెట్టారు. అనేక సంస్కరణలు తెచ్చారు. మిశ్రమ ఆర్థిక విధానాలను అనుసరించి ప్రైవేట్ సెక్టార్ ఆరోగ్యకరమైన అభివృద్ధికి విధాన నిర్ణయాలు తీసుకున్నారు.

సెక్యులర్ భావజాలానికి అంకితమై, రాజకీయాల్లో మత భావజాలాలను తీవ్రంగా వ్యతిరేకించారు. అట్టి విధానం ప్రజల్ని చీలుస్తుందని, దేశాన్ని బలహీనపరుస్తుందని అభిప్రాయపడ్డారు. అందుకే, జాకీర్ హుస్సేన్ వంటి వారిని దేశాధ్యక్షులుగా చేశారు. ఆపరేషన్ బ్లూస్టార్ కారణంగా తన సిక్కు బాడీగార్డ్స్ చేతుల్లో 1984 అక్టోబర్ 31న ఇందిర అస్తమించారు. దేశం గొప్ప నాయకురాలిని కోల్పోయింది. బడుగు, మైనార్టీ ప్రజలంతా తమ 'అమ్మ'ను కోల్పోయినట్లుగా బాధపడ్డారు. దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన ఇందిర చిరస్మరణీయురాలు.

• దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి
రిటైర్డ్ ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్సిటీ

(నేడు ఇందిరాగాంధీ వర్ధంతి)

బిహార్ బాటలోనే దేశవ్యాప్త 'సర్'

ఆ అస్తవ్యస్తత ఇప్పుడు ఒక పద్ధతిని సంతరించుకున్నది! బిహార్ అనంతరం తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో నవంబర్ 4 నుంచి అమలుపరచనున్న ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- సర్) కార్యక్రమం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. ప్రజాస్వామ్య నైతికత అయిన వయోజన ఓటుహక్కును విచక్షణారహితంగా అత్యధిక ప్రజలకు తొలగించేందుకు మొరటు సాధనమైన 'సర్'ను ఇప్పుడు నాజూకు పద్ధతులతో విస్తరించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పూనుకున్నది. అర్హులైన పౌరులకు ఓటుహక్కు తొలగింపు విషయమై నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఒక పదునైన సాధనంగా దాన్ని మార్చివేసింది.




■ యోగేంద్ర యాదవ్

ఓటర్ జాబితాల ప్రత్యేక సవరణను తొట్ట తొలుత బిహార్‌లో అమలుపరిచిన తీరుతెన్నులు వివాదాస్పదమయ్యాయి. తీవ్ర గందరగోళం చోటుచేసుకున్నది. సవరించిన ఓటర్ జాబితాల్లో నిర్దుష్టత, కచ్చితత్వం మెరుగుపడకపోగా వివిధ కీలక అంశాల్లో నాణ్యత గణనీయంగా క్షీణించింది: వయోజన ఓటర్ల నిష్పత్తి (దీనినే ఓటర్లు- ప్రజల నిష్పత్తి అని కూడా అంటారు) బాగా పడిపోయింది; మహిళా, ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో తగ్గిపోయారు; ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికతను దెబ్బతీసే అక్రమాలు (నకిలీ ఓటర్ల నమోదు, డజన్ల కొద్దీ ఓటర్ల చిరునామా ఒకటే కావడం) మొదలైనవి యథాప్రకారం కొనసాగాయి. మరి ఈసీఐ ఈ లోపాలు, లొసుగులను గుర్తించిందా? అక్టోబర్ 27న 'సర్' రెండో దశను ప్రకటించిన తీరును నిశితంగా గమనిస్తే బిహార్ అనుభవాల నుంచి భారత ఎన్నికల సంఘం సరైన పాఠాలు నేర్చుకోలేదని స్పష్టమవుతున్నది. అసలు తన పరంగా జరిగిన తప్పులు అంగీకరించలేని అశక్తత, సరిదిద్దుకునేందుకు సుముఖత భారత ఎన్నికల సంఘంలో కనిపించలేదు. ఇదొక కఠోర వాస్తవం. మరికొన్ని వాస్తవాలను కూడా మనం తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. బిహార్‌లో 'సర్' అమలుకు ప్రభుత్వం వెచ్చించిన నిధులు భారీ పరిమాణంలో ఉండడం, అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన తరుణంలో ఓటర్ జాబితాల సవరణ హడావుడిగా చేపట్టడం, తమ ఓటుహక్కును కాపాడుకోవడంలో పేద ఓటర్లకు ఎదురైన కష్ట నష్టాలు, మానసిక వ్యధలు మొదలైన వాటిని గమనిస్తే ఒక విషయం విశదమవుతుంది: ఓటర్ జాబితాల సవరణను ఏ విధంగా చేయకూడదో బిహార్ 'సర్' నిరూపించింది.

భారత ఎన్నికల సంఘం ప్రకటించిన 'సర్' కొత్త వెర్షన్‌లో మార్పులు స్వతస్సిద్ధమైన ఒక కపట పథకాన్ని మరింత సమర్థంగా అమలుపరిచేందుకు ఉద్దేశించినవే. అవి సంక్షిప్తమైనవి మాత్రమే కాదు, స్పష్టంగా కనిపించని అదనపు అంశాలు సైతం వాటిలో ఉన్నాయి. బిహార్‌లో కంటే విశాల భారతదేశంలో మరింత పకడ్బందీగా తాను కోరుకున్న తీరులో 'సర్'ను అమలుపరిచేందుకు ఈసీఐ మెరుగ్గా సన్నద్ధమయిందనడంలో సందేహం లేదు. ఎన్నికల అధికారులకు 'సర్' అమలులో సకాలంలో శిక్షణ నిచ్చింది. నేమ్ మ్యాపింగ్ (ఒక పేరును గుర్తించేందుకు, సంధానం చేసేందుకు మరొక పేరుతో అనుబంధించే ప్రక్రియ)కు ఏర్పాట్లు చేసింది. పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్యూమరేషన్ ఫామ్‌లు దాఖలు చేసేందుకు అనుమతించింది. దీనివల్ల పోలింగ్ బూత్ స్థాయి అధికారులకు పనిభారం తగ్గుతుంది. తద్వారా సవరణ ప్రక్రియ శీఘ్రగతిన జరిగేందుకు వెసులుబాటు అవుతుంది. బిహార్ 'సర్' అమలులో బహిరంగంగా ప్రకటించకుండా రహస్యంగా చేసిన కొన్ని మార్పులను ఈసీఐ ఇప్పుడు అధికారికమైనవిగా చేసింది. ఓటర్లు ఇప్పుడు తమ ఎన్యూమరేషన్ ఫామ్స్‌తో పాటు ఎలాంటి డాక్యుమెంట్లను సమర్పించనవసరం లేదు. ఈ మినహాయింపును 2002–04 నాటి పాత ఓటర్ జాబితాల్లో ఉన్న వారి సంతానానికి, లేదా 'బంధువు'కు కూడా వర్తింపజేసింది. తాత్కాలికంగా దూర ప్రదేశాల్లో ఉన్న వారి తరఫున ఎన్యూమరేషన్ ఫామ్స్ సమర్పించేందుకు సంబంధిత వ్యక్తుల కుటుంబ సభ్యులకు అనుమతినివ్వడం వలన వెళ్లిన వారికి ఉపశమనం కలిగిస్తుంది. కొత్త ఓటర్ల కోసం ఎన్యూమరేషన్ ఫామ్స్ తీసుకువెళ్లేందుకు పోలింగ్ బూత్ స్థాయి అధికారులను అనుమతించడం మంచిదే. అయితే ఇంటింటికీ తిరిగి ఓటర్లను ధ్రువీకరించుకునే దశలో తొలగింపులకు కాకుండా గణనీయమైన స్థాయిలో అదనపు చేర్పులకు తోడ్పడి తీరాలి. దీనివల్ల ఓటర్లకు ప్రయాసలు, ఎన్నికల అధికారులకు పనిభారం తగ్గుతాయి. ఇవన్నీ సానుకూల సంస్కరణలుగా కనిస్తున్నా లోపభూయిష్టమైన పథకాన్ని సమర్థంగా అమలుపరిచేందుకు ఉద్దేశించినవే అనడంలో సందేహం లేదు.

చెప్పవచ్చినదేమిటంటే ఈ సడలింపులు, మెరుగుదలలు ఏవీ 'సర్'లో స్వతస్సిద్ధంగా ఉన్న ప్రాథమిక మినహాయింపు రూపకల్పనను మార్చవు. గతంలో ఎనిమిది పర్యాయాలు అమలుపరిచిన సమగ్ర సవరణ ప్రక్రియను పునరావృతం చేయడమే ప్రస్తుత ప్రత్యేక సమగ్ర సవరణ అని భారత ఎన్నికల సంఘం పదే పదే ఉద్ఘాటిస్తోంది. ఇదొక అబద్ధం.



ప్రస్తుత 'సర్' గతంలో జరిగిన ఏ సమగ్ర సవరణ కంటే కూడా భిన్నమైనది. గత సమగ్ర సవరణల మార్గదర్శక సూత్రాలు పూర్తిగా భిన్నమైనవి. ఈసీఐ ఈ సత్యాన్ని కప్పిపుచ్చజాలదు. మరీ ముఖ్యంగా ఓటర్ జాబితాల్లో మళ్లీ స్థానం పొందేందుకు, అంటే ఓటర్‌గా తమను తాము ధ్రువీకరించుకునేందుకు అవసరమైన దరఖాస్తును, డాక్యుమెంట్లను ఓటర్లే స్వయంగా సమర్పించాలి. ఇది మన దేశంలో సార్వత్రిక వయోజన ఓటు హక్కు నిర్మాణ వ్యవస్థ (వయోజన పౌరులు ప్రతి ఒక్కరూ తమ సామాజిక, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా ఓటు వేయడానికి వీలు కల్పించే చట్టబద్ధమైన, విధానపరమైన చట్రం) ఒక మౌలిక మార్పు. ఇంతకు ముందు ఓటరు నమోదు బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉండేది. మరొక కఠిన నిబంధనను కూడా కొత్త 'సర్' సవరించలేదు. సవరణ ప్రక్రియ ప్రారంభమైన నెల రోజుల్లో పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్‌ను దాఖలు చేయడంలో విఫలమైన ఓటర్లు ఎవరైనా 'నోటీసు, విచారణ, అప్పీల్ లేకుండా' ఓటర్ల జాబితా నుంచి తొలగింపబడతారు. ఈ కఠిన నిబంధన కఠోర శిక్ష (సామూహిక ఓటుహక్కుల తొలగింపు)కు దారి తీసే ప్రమాదమున్నది. ఇది సమంజసమేనా? పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలలో కూడా ఓటరు నమోదు బాధ్యత ప్రభుత్వం నుంచి వ్యక్తిగత ఓటర్లకు బదిలీ అయ్యింది. పర్యవసానంగా నమోదైన ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ నిర్మాణాత్మక అవరోధం వల్ల మన దేశంలో సైతం ఓటర్ జాబితాల నుంచి అర్హులైన ఓటర్లు హీనపక్షం 5 నుంచి 10 శాతం మేరకు మినహాయింపునకు లోనయ్యే ప్రమాదమున్నది. ఇలా తొలగింపునకు గురయ్యే ఓటర్లలో మహిళలు పెద్ద సంఖ్యలో ఉంటారు. బిహార్‌లో ఇదే జరిగింది. ఈ విషయమై ఈసీఐ దృష్టి పెట్టిందా? సమాధానం స్పష్టమే.

2002–04 నాటి ఓటర్ జాబితాల్లో ఉన్న వారి పౌరసత్వాన్ని నిశితంగా పరీక్షించినట్టు ఈసీఐ పదే పదే చెబుతోంది. ఇది మరొక అబద్ధం. ఓటర్ల పౌరసత్వాన్ని పరీక్షించలేదని నాటి సమగ్ర సవరణల మార్గదర్శక సూత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పుడు దేశవ్యాప్త సర్‌లో ప్రతి ఒక్కరూ తాము లేదా తమ బంధువులు 2002–04 నాటి ఓటర్ జాబితాలలో ఉన్నట్టుగా నిరూపించాలి. అలా నిరూపించని వారికి పౌరసత్వాన్ని ధ్రువీకరించే డాక్యుమెంట్లు చూపాలని నోటీసు జారీ అవుతుంది. గమనార్హమైన విషయమేమిటంటే 2002–04 ఓటర్ జాబితాల్లో తమ కుటుంబ సభ్యులలో ఎవరైనా ఒకరు ఎందుకు లేరో సాక్ష్యాధారాలతో నిరూపించాలని కూడా అడుగుతారు. ఇది అసోంలో అమలుపరిచిన జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్‌సీ)లా కనిపించడం లేదూ? సదరు డాక్యుమెంట్లను పరిశీలించి ధ్రువపరిచేందుకు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌లు అనుసరించాల్సిన విధి విధానాలను ఈసీఐ ఇంతవరకూ రూపొందించనే లేదు. ప్రస్తుత దేశ పాలకులకు ఇబ్బందికరంగా ఉన్న సామాజిక సమూహాలకు చెందిన వ్యక్తులను ఓటర్ జాబితాల నుంచి తొలగించేందుకే ఈ నిబంధనలను తెచ్చారనడంలో సందేహం లేదు. ఈ దృష్ట్యా రెండో దశ 'సర్' నేరుగా పౌరసత్వ అర్హతల ధ్రువీకరణ ప్రక్రియ అని భావించవలసివస్తోంది. మన ఓటర్ జాబితాలను వేధిస్తున్న వ్యాధికి 'సర్' సరైన ఔషధమా? కాదా? అని తనిఖీ చేసేందుకు కాక ముందుగా నిర్ణయించిన సందేహాస్పద సామర్థ్యం కలిగిన ఔషధం ఎంత చక్కగా పనిచేస్తుందో నిర్ధారించుకునేందుకు బిహార్‌లో అమలుపరిచిన ప్రత్యేక సమగ్ర సవరణ ఒక దృష్టాంతమనేది స్పష్టం.


> బిహార్ ఓటర్ జాబితాలో నాణ్యతను మెరుగుపరచడంలో 'సర్' సఫలమవలేదు. వయోజన ఓటర్ల నిష్పత్తి బాగా పడిపోయింది. మహిళా, ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో తగ్గిపోయారు. నకిలీ ఓటరు నమోదులు, డజన్ల కొద్దీ ఓటర్ల చిరునామా ఒకటే కావడం... మొదలైనవి యథా ప్రకారం కొనసాగాయి. మరి ఈసీఐ ఈ లోపాలను గుర్తించిందా? 'సర్' రెండో దశను ప్రకటించిన తీరును నిశితంగా గమనిస్తే బిహార్ అనుభవాల నుంచి భారత ఎన్నికల సంఘం సరైన పాఠాలు నేర్చుకోలేదని స్పష్టమవుతోంది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

మన మధ్య నడయాడిన 'స్టాలిన్'

సీపీఐ నాయకుడు స్టాలిన్ బాబు (అక్టోబర్ 24) మరణం బాధాకరం. వ్యక్తిగతంగా వారి జీవితంలో అపకీర్తులు లేవు. అన్నీ మంచి అలవాట్లే. ఆయన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలి. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన చురుకయిన పాత్ర పోషించారు. ఉద్యమాన్ని పార్టీకి ప్రయోజనాత్మకంగా ఎలా మలుచుకోవాలి? ఆ ఉద్యమ స్వరూపమేమిటి, అందులో పాల్గొంటున్నవారెవరు? వారు ఏ కోవకు చెందినవారు, వారి కుటుంబ నేపథ్యమేమిటి? వ్యక్తిగత అలవాట్లేమిటి? ఏదైనా బలహీనతలున్నాయా? ఉంటే వాటిని సరిచేయడానికి అవకాశాలున్నాయా? ఇతరేతర కారణాలు కూడా పరిశీలించేవారు.

సుగుణాలున్న కార్యకర్త కోసం స్టాలిన్ బాబు ఎంతయినా శ్రమించేవారు. వ్యక్తిగత విషయాలూ తెలుసుకుని తగిన సలహాలు ఇచ్చి, విశ్వాసం కల్పించేవారు. ఆనాడు గుంటూరులో విద్యార్థి ఉద్యమానికి ఆటంకంగా రౌడీ మూకలు అడ్డుతగిలేవి. దాన్ని ఎదుర్కోడానికి మేమంతా సైనికుల్లాగ కదన రంగంలోకి దూకినా, స్టాలిన్ మంచి వ్యూహం రూపొందించేవారు. కార్యకర్తల్ని తయారు చేయడంలోనూ, నాయకత్వ స్థాయి పెంపొందించడంలోనూ బాగా కృషి చేసేవారు. వాస్తవానికి నాకు రాజకీయాల వాసనే పడేది కాదు. తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో నగరి వద్ద అయనంబాకం గ్రామానికి చెందినవాడిని. చిత్తూరు జిల్లా అందులో తమిళ భాషా ప్రభావం నుంచి వచ్చినవాడిని. నేను గుంటూరు ఆయుర్వేద కాలేజీలో చేరాను. దానికి కారణం నగరిలో పాపులర్ ఆయుర్వేదిక్ డాక్టర్ రామచంద్రరాజు. వారు మా కుటుంబానికి సన్నిహితులు. వారికి నగరి, పుత్తూరు, తిరుత్తణి (తమిళనాడు)లలో హాస్పిటల్స్ ఉండేవి. నా పీయూసీ అయిపోయాక రామచంద్రరావు గారితో మాట్లాడే సందర్భంగా అప్పుడే పేపర్లో "గుంటూరు ఆయుర్వేదిక్ కాలేజీలో BAMS డిగ్రీ కోర్స్ ప్రకటించారు. ఆ ప్రకటన చూసి వెంటనే డాక్టర్ గారు నన్ను గుంటూరుకు వెళ్లి ఆయుర్వేదిక్ కాలేజీలో చేరమన్నారు.



ఆయుర్వేదిక్ కాలేజీలో ఎన్నికలు జరిగితే మా గ్రూపే గెలిచింది ఓడిపోయిన గ్రూప్ ఏఐఎస్ఎఫ్ అనుకూలురని తెలిసింది. ఏఐఎస్ఎఫ్ అనుకూలురులో ర్యాలీప్రసాద్ గోదావరి జిల్లావాడు. అప్పటికే ఏఐఎస్ఎఫ్ కార్యకర్త. విద్యార్థి సంఘం సమావేశం అయినాక ర్యాలీ ప్రసాదుతో 'ఏంటయా అట్ల మాట్లాడుతావ్ మీ నాయకులిట్లే సలహాలిస్తారా? ఎవరు మీ నాయకులు" అని నిలవేశాను. అపుడు ప్రసాదు "మా నాయకులను కలుస్తావా" అన్నాడు. సరే అని బ్రాడీపేట 4వ లైన్ ఏఐఎస్ఎఫ్ కార్యాలయానికి వెళ్ళాం. అక్కడ ఒక పొడవాటి వ్యక్తి చూడచక్కగా ఉన్నారు వారే స్టాలిన్ బాబు, ఆ పక్కనే కళాకారుడు మల్లె కిపాస్ పంచెతో చూడచక్కగా ఉన్నారు నల్లూరి వెంకటేశ్వర్లు.

నేను చిత్తూరు బాషలో "ప్రసాద్‌కు నీవిట్లాగే ట్రయినింగ్ ఇచ్చావా" అని నిష్ఠూరంగా మాట్లాడాను. స్టాలిన్ నాతో కూర్చో బ్రదర్ అని మాటల్లో దింపారు, ర్యాలీప్రసాద్‌నే మందలించినట్లు మాట్లాడారు. అది ఎత్తుగడే కావచ్చు. అప్పటి నుంచి నా కోసం కాలేజీకి, కొరిటిపాడులో నేనున్న రూముకు తరచూ రావడం, అరండల్ పేట ఇస్కస్ కార్యాలయం వద్దనున్న మార్వాడీ స్వీట్ షాపులో వెన్నుండ్లు, తినిపించేవారు. నాకు మిత్రులంటే చాలా ఇష్టం. రాజకీయాలకన్నా స్నేహానికే ప్రాధాన్యత నిస్తూ ఏఐఎస్ఎఫ్ కార్యక్రమాలకు తీసుకెళ్లడానికి ప్రయత్నించే క్రమంలో అక్ల నాగేశ్వరరావును పరమాయించేవారు. నన్ను లైన్‌లో పెట్టడానికి చాలా కష్టపడ్డారు. చివరికి వారి స్నేహంతో పాటు విస్తృతస్థాయి మిత్రబృందం ఏర్పడింది. దీనికి కొరిటిపాడులో ఉన్న రూము కూడా ఉపయోగపడింది. ఇదంతా చెప్పడానికి కారణం- మట్టిముద్దనైన నన్ను శిల్పంగా తయారుచేసి ఉద్యమానికి అప్పగించిన శిల్పి స్టాలిన్ బాబు.


నాలాంటి ఉద్యమకారులను పదుల సంఖ్యలో ఆయన తయారు చేశారు. రాష్ట్రంలోనే సమరశీల టీమ్ తయారయింది. ఇంతలో ఈ టీమ్ నుంచి నన్ను మా సొంత జిల్లా అయిన తిరుపతికే వెళ్లి పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణం చేయమని రాష్ట్ర పార్టీ ఆదేశించింది. అయితే ఇక్కడ ఒక చేదు నిజం చెప్పాల్సి వస్తున్నది. బూర్జువా పార్టీలలో రాకపోకలు సహజం, కమ్యూనిస్టు ఉద్యమాలలో ఒక స్థాయికి చేరిన కార్యకర్తలు గానీ నాయకులు గానీ ఉద్యమానికి ఏ కారణంగానైనా దూరమయితే సమాజానికి, నమ్మిన ఆశయాలకు, చివరికి వ్యక్తులకు తీరని ఆవేదన, నష్టం కలుగుతుంది. ఒక ఉద్యమానికి అంకితమయ్యాక ఆ ఉద్యమమే పరమావధిగా ఉండాలే తప్ప మార్గం మధ్యలో అడ్డొచ్చే తుంపర అడ్డు కాకూడదు. స్టాలిన్ బాబు జీవితం సమాజానికో చుక్కాని, కార్యదక్షత, పట్టుదల, అంకితభావానికి ప్రతిబింబం కూడా.

○ కె. నారాయణ
సీపీఐ జాతీయ కార్యదర్శి

(నవంబర్ 1న గుంటూరులో స్టాలిన్ బాబు సంతాపసభ)

సమైక్యతే భారతీయ జీవన ధర్మం

గణతంత్ర భారత పునాదులను నిశ్చయాత్మకంగా తీర్చిదిద్దిన వ్యక్తుల్లో ప్రముఖుడు స్వతంత్ర భారత తొలి ఉప ప్రధానమంత్రి, హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్. ఆయన జయంతిని పురస్కరించుకుని, ఏటా అక్టోబరు 31న 'రాష్ట్రీయ ఏక్తా దివస్' (జాతీయ సమైక్యతా దినోత్సవం) జరుపుకుంటున్నాం. 1947 అనంతరం 560కు పైగా సంస్థానాలను ఏకతాటి పైకి తెచ్చి ఒకే రాజకీయ ఛత్రం కింద వాటిని విలీనం చేశారాయన.



దేశ విభజనానంతర పరిస్థితుల్లో... పటేల్ వాస్తవిక దృక్పథం, సహనం, దృఢత్వాలే భారత ఉపఖండం విచ్ఛిన్నం కాకుండా నిరోధించాయి. ఆయన చొరవ, దృఢ సంకల్పమే లేకపోతే జునాగఢ్, హైదరాబాద్, జమ్మూ-కశ్మీర్ అనిశ్చితిలోకి జారిపోయి ఉండేవి. పటేల్ ప్రతిపాదించిన 'సమైక్యతా' భావన 'అందరూ ఒకేలా ఉండి తీరాల'న్నది కాదు... ఉమ్మడి వారసత్వంతో ముడిపడి ఉన్న దేశ జనుల భావాలు, హృదయాల కలయిక అది. విస్తృతమైన వైవిధ్యాలు, సరికొత్త ఆకాంక్షల శకంలో ఆ విశ్వాసమే భారత్‌ను స్థిరంగా నిలుపుతోంది.

ఐక్యత అంటే 'నిశ్చిత భావన' కాదని, దేశ చేతన దిశగా నిరంతర చర్యగా దాన్ని గుర్తిస్తూ... పటేల్ జయంతిని 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించాలని 2014లో ప్రభుత్వం నిర్ణయించింది. దేశ సమగ్రత కోసం పునరంకితమవుతామని దేశవ్యాప్తంగా పాఠశాలలు, పౌర సమాజ సంస్థలు, ప్రజలు ఆ రోజు ప్రతిజ్ఞ చేస్తారు. సమష్టి కార్యాచరణ దిశగా పటేల్ ఇచ్చిన పిలుపును ప్రతిబింబించేలా 'ఐక్యత కోసం పరుగు (రన్ ఫర్ యూనిటీ)' వంటి కార్యక్రమాలుంటాయి. దేశభక్తి భావోద్వేగాలకు మాత్రమే పరిమితం కాదని, మన క్రియాశీల భాగస్వామ్యం అవశ్యకమని ఇవి చాటుతాయి. పటేల్ దేశ నిర్మాణ పరంపరను చిరస్మరణీయం చేసేలా నెలకొల్పిన 182 మీటర్ల ఎత్తైన 'ఐక్యతామూర్తి (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ)' సమీపంలో... ఏక్తా నగర్‌లో ఈ సంవత్సరం ఆయన 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భిన్న స్వరాలు ఒక్కటవ్వడమే భారత్ బలమన్న స్ఫూర్తిని చాటేలా సాంస్కృతిక ప్రదర్శనలు, రాష్ట్రాల శకటాలు, 900 మందికి పైగా కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి.

> సర్దార్ పటేల్ 150వ జయంతి జరుపుకొంటున్న తరుణమిది. పాలరాతి విగ్రహాలో, స్మారకాలో పెట్టడం కాదు... తాము దేశ ఐక్యతా ప్రస్థానంలో భాగమని ప్రతి భారతీయుడూ భావించేలా చూడడమే ఆ ఉక్కు మనిషికి నిజమైన నివాళి.

విస్తృతమైన భాషలు, విశ్వాసాలు, జానపద సంప్రదాయాలు కలసిమెలసి సాగుతున్న మన దేశంలో... 'సంస్కృతి' భావనే అనాదిగా ఐక్యతకు శాశ్వత వారధిగా నిలిచింది. జోనల్ సాంస్కృతిక కేంద్రాల నుంచి జాతీయ స్థాయి మ్యూజియాల వరకు... సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సంస్థలన్నీ దేశ వారసత్వ సంపదను అందరికీ అందుబాటులోకి తేవడానికి నిరంతరం కృషి చేస్తున్నాయి. దేశ సాంస్కృతిక పటం నుంచి ఏ ప్రాంతమూ వేరుపడి లేదన్న భరోసానిస్తున్నాయి.

భాష, వంటకాలు, కళల విషయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య పరస్పర వినిమయం ద్వారా... 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' వంటి కార్యక్రమాలు ఈ స్ఫూర్తిని సంస్థాగతీకరిస్తున్నాయి. మహారాష్ట్ర విద్యార్థులు బిహూ నేర్చుకుంటారు, అస్సాం యువ కళాకారులు పుణేలో లావణి ప్రదర్శిస్తారు. 'ఒకరినొకరు తెలుసుకోవడమే కలిసి నిలిచేందుకు తొలి మెట్టు' అన్న పటేల్ భావనను అనుసరించడమే ఇది.

పర్యాటకం కూడా ఐక్యతకు సాధనం. పంజాబ్ స్వర్ణ దేవాలయం నుంచి కేరళ మిగులు జలాల వరకు, అస్సాం తేయాకు తోటల నుంచి రాజస్థాన్ ఎడారుల వరకు... 'దేఖో అప్నా దేశ్' కార్యక్రమం, నవీకరించిన 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా డిజిటల్ వేదిక'లు ప్రజలు తమ మాతృభూమిలోని అన్ని ప్రాంతాలనూ చుట్టి వచ్చేలా ప్రోత్సాహాన్నిస్తున్నాయి. ఒక్క 2024లోనే దేశీయ పర్యటనలు 294 కోట్ల మార్కును దాటాయి. భారత్ పట్ల భారతీయుల్లో పెరుగుతున్న ఉత్సుకతకు, చైతన్యానికి ఇది నిదర్శనం.

'స్వదేశ్ దర్శన్, ప్రసాద్' వంటి పథకాలు మౌలిక వసతుల కల్పనకే పరిమితం కాకుండా, స్థానికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. నాగాలాండ్‌లో ఓ మహిళ నడిపే అతిథి గృహానికి గుజరాత్ సందర్శకులు వెళ్లడం, జోధ్‌పూర్‌లోని ఓ కళాకారుడు తమిళనాడు పర్యాటకులకు హస్త కళాకృతులను విక్రయించడం... ఇవన్నీ వస్తువుల విక్రయమో, వ్యాపారం మాత్రమో కాదు... వారు అనుభవాలను పంచుకుంటారు. అది దేశాన్ని మరింత దగ్గర చేస్తుంది.

సమైక్యతా భావన తరతరాల చైతన్యంగా ఉండాలన్నదే సర్దార్ పటేల్ అంతరంగం. ఉదాసీనత, అవివేకం, సంకుచిత ప్రాంతీయ భావన వంటి విచ్ఛిన్నకర అంశాల నుంచి దాన్ని రక్షించుకోవాలి. 2047 వైపు దేశం వేగంగా అడుగులేస్తున్న తరుణంలో... దేశ సంపూర్ణ కృతనిశ్చయమే కేంద్రంగా పంచ ప్రాణ్ (ఆజాదీ కా అమృత మహోత్సవ్ ఐదు సంకల్పాలు) రూపకల్పన జరిగింది.

సర్దార్ పటేల్ 150వ జయంతిని జరుపుకుంటున్న తరుణమిది. పాలరాతి విగ్రహాలో, స్మారకాలో కాదు... దేశ ఐక్యతా ప్రస్థానంలో భాగమని ప్రతి భారతీయుడూ భావించేలా చూడడమే ఆ ఉక్కు మనిషికి మనమిచ్చే నిజమైన నివాళి. సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొనడం, మ్యూజియాల సందర్శన, అనేక రాష్ట్రాల సందర్శన... ఇలా ప్రతి సమష్టి కార్యక్రమమూ మన నాగరికతను అనుసంధానించే అమూర్త బంధాలను మరింత పటిష్ఠం చేస్తుంది.

సర్దార్ పటేల్ మాటల్లో చెప్పాలంటే... సమైక్యతే దేశ భవితకు మార్గం, మన అంతిమ లక్ష్యం – ఇదే ఏక్ భారత్, శ్రేష్ఠతా భారత్ స్ఫూర్తి... ఆయన నిర్దేశాన్ని శిరసావహిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అదే బాటలో నడుస్తున్నారు.



■ గజేంద్రసింగ్ షెకావత్
కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి

కొండంత భరోసా

రైతుల్లో ధైర్యంనింపిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- అవనిగడ్డ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటన
- మోకాలి లోతు నీరు ఉన్న వరి పొలాల్లో దిగి పరిశీలన
- నష్టం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు
- ప్రభుత్వం అండగా ఉంటుందని రైతన్నలకు అభయం



అవనిగడ్డలో నీటమునిగిన పంటపొలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర (ఇన్‌సెట్‌లో) రైతు ఇబ్బందులను తెలుసుకుంటూ..

మొంథా తుఫాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన దివిసీమ రైతులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన కొండంత భరోసా ఇచ్చింది. మోకాలి లోతు నీటితో ఉన్న పొలాల్లోకి దిగి వరి పంటలను పరిశీలించారు. పారదర్శకంగా పంటనష్టం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆపద వేళ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు అభయమిచ్చారు. చల్లపల్లి మండలం మాజేరు నుంచి కోడూరు మండలం కృష్ణాపురం వరకు దారి పొడవునా రైతుల సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా దివిప్రాంతంలోని ఆరు మండలాల్లో ఉన్న వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న వరి, వాణిజ్య పంటలను గురువారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. అధికారులు కేవలం పడిపోయిన పొలాలనే నష్టం జరిగినట్లుగా అంచనా వేస్తున్నారని రైతులు పవన్‌కు తెలిపారు. స్పందించిన ఆయన పడిపోకుండా నిలువునా ఉన్న పంట పొలాల్లో ఏ మేరకు నష్టం వాటిల్లుతుందనే విషయమై అంచనా వేయాలని కలెక్టర్ బాలాజీకి సూచించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఎక్కువ మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నామని, ప్రభుత్వం అసలు రైతుకు మాత్రమే పరిహారం అందిస్తుండటంతో ఏటేటా పెట్టుబడి పెట్టి శ్రమ చేసిన కౌలురైతుల కష్టానికి ఎలాంటి మిగతా 6లో..



పెనుగంచిప్రోలు వద్ద..



వత్సవాయి వద్ద..



అనాసాగరం వద్ద..

● కాజ్‌వే.. క్లోజ్ వే..



కీసర వంతెన నుంచి మునేరు విశ్వరూపం

మునేరు మహోగ్రం

భారీగా చేరుతున్న వరద

మొంథా తుఫాను గండం వీడిందంటే.. మునేరు వరద ముంపు జిల్లాపై పడగవిప్పింది. తెలంగాణాలో వర్షాల కారణంగా మునేరు మహోధృతంగా ప్రవహిస్తోంది. వేలాది ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి. గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వత్సవాయి మండలం పోలంపల్లి ఆనకట్ట వద్ద నీటిమట్టం 15 అడుగులకు చేరింది. లింగాల కాజ్‌వేను వరద ముంచెత్తింది. దీంతో ఈ మార్గంలో తెలంగాణాకు రాకపోకలు నిలిచిపోయాయి. పెనుగంచిప్రోలు వంతెనపై కూడా అడుగు ఎత్తున వరద ప్రవహిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సమీప గ్రామాలవారు భయాందోళన చెందుతున్నారు. పాలేరు, వైరా, కట్టలేరు కూడా ఉగ్రరూపం దాల్చాయి.

- వందల ఎకరాల్లో పంటలు నీటమునక
- వరదనీటిలో చిక్కుకుపోయిన గ్రామాలు
- పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు
- రెండోరోజూ జలదిగ్బంధంలో కాజ్‌వేలు
- ఏపీ-తెలంగాణ మధ్య రాకపోకలు బంద్
- పెనుగంచిప్రోలు ఆలయ పరిసరాల్లోకి వరద
- పాలేరు, వైరా, కట్టలేరులోనూ తగ్గని ఉధృతి
- క్షేత్రస్థాయిలో మంత్రులు, అధికారుల పర్యటన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల/వత్సవాయి/పెనుగంచిప్రోలు/నందిగామ) : మొంథా తుఫాను వల్ల తెలంగాణాలోని వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడటంతో మునేరుకు వరద చేరింది. ప్రస్తుతం 1.65 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ ప్రవాహం శుక్రవారానికి తగ్గుముఖం పట్టవచ్చని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వరంగల్ జిల్లా పాకాలలో పుట్టిన మునేరు 240 కిలోమీటర్లు ప్రవహించి ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలో కృష్ణానదిలో కలుస్తుంది. ఇది వరంగల్, ఖమ్మ జిల్లాల మీదుగా ప్రవహిస్తుంది. ఖమ్మం జిల్లాలో పుట్టిన కట్టలేరు వాగు.. వైరా వాగులో కలుస్తుంది. అక్కడి వైరా వాగు వచ్చి మునేరులో కలుస్తుంది. మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాల్లో గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల మధ్యలో మునేరు పరిధిలో 277.56 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నీరు మొత్తం మునేరులోకి వస్తోంది. ఈ ఏరుకు 2005లో రికార్డు స్థాయిలో 3.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. గత ఏడాది 3.10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఉదయం నుంచి నీటిమట్టం పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మునేరు వాగు మీదుగా తెలంగాణాకు ఉన్న మార్గాలను మూసివేశారు. గురువారం ఉదయం 9 గంటలకు కలవోడు వద్ద 24.50 అడుగులకు నీటిమట్టం మిగతా 6లో..



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

గండిని వదిలేయటం వల్లే..

పెనుగంచిప్రోలు మండలం రేకులగడ్డ వద్ద గత ఏడాది పడిన గండి (షైనమ్మ గండి)ని ఇప్పటి వరకు పూడ్చలేదు. మునేరు వరద ఈ గండి మీదుగా పంట భూములపైకి చేరింది. రేకులగడ్డ, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు గ్రామాలకు చెందిన వెయ్యి ఎకరాల మాగాణి వరి నీట మునిగింది.

పెనుగంచిప్రోలులో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తూ..





కీసర వంతెన నుంచి మునేరు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

నిరంతరం అప్రమత్తం

- ప్రజలెవరూ ఆందోళన చెందొద్దు
- నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం
- రైతుల క్షేమం, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం చొరవ: కలెక్టర్ లక్ష్మీశ
- ఎమ్మెల్యే సౌమ్య, సీపీ రాజశేఖరబాబుతో కలిసి మునేరు వరద పరిశీలన

8



కొండవీడు వాగు వద్ద వరద ఉధృతి

కొండవీడు వాగు రివర్స్ ఫ్లో

రెగ్యులేటర్ దెబ్బతినడంతో వాగులోకి ఎదురెళ్తున్న వరద

పక్కనే లిఫ్ట్ ద్వారా నదిలోకి తోడుతున్న యంత్రాంగం

విజయవాడ సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి ప్రాంతంలోని వరద నీటిని కృష్ణానదిలోకి చేరవేసే కొండవీడు వాగు రెగ్యులేటర్ ప్రమాదస్థాయికి చేరింది. నదిలో పెరిగిన వరద నీరు దెబ్బతిన్న రెగ్యులేటర్ గేట్ల ద్వారా తిరిగి వాగులోకి చేరుతోంది. రాజధాని ప్రాంతంలోని లాం గ్రామం నుంచి కొండవీడు వాగు ప్రారంభమై పెదపరిమి, నీరుకొండ, కృష్ణాయపాలెం, పెనుమాక, తుళ్లూరు, వెలగపూడి మీదుగా కృష్ణానదిలోకి చేరుతుంది. 30 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ వాగులోకి కొట్టెళ్ల వాగు, పాలవాగు, ఎర్రవాగులు మిగతా 6లో..

రెవెన్యూ డివిజన్లు

ఉమ్మడి కృష్ణా విభజన సమస్యలకు చెక్

ఒక నియోజకవర్గం.. ఒక రెవెన్యూ డివిజన్‌తో పరిష్కారం

- ఒక రెవెన్యూ డివిజన్‌లో రెండు నియోజకవర్గాలతోనే సమస్య
- గన్నవరం, పెనమలూరును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని డిమాండ్
- కైకలూరు, ముదినేపల్లి, నూజివీడును కృష్ణాలో కలపాలని వినతులు
- ఉయ్యూరు, తిరువూరు రెవెన్యూ డివిజన్ల రద్దుతోనే వీటికి పరిష్కారం
- గన్నవరం, మైలవరం రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో మార్గంసుగమం
- నియోజకవర్గాలు, బహుళ డివిజన్లు, భౌగోళిక ఇబ్బందులూ తీరినట్టే..



ఒక నియోజకవర్గం ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనలో గందరగోళం లేకుండా చేయటం కోసం, నియోజకవర్గ ప్రజలకు కేంద్ర స్థానంగా ఉండటం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగినదే. దీనివల్ల ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో తలెత్తిన గందరగోళాలను సరిచేయటంతో పాటు విభజిత జిల్లాల్లో విలీనం చేయాలన్న ప్రాంతాలను కలపటం కూడా తేలికవుతుంది. అదెలా అంటే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాను మచిలీపట్నం కేంద్రంగా కృష్ణాజిల్లాగా, విజయవాడ కేంద్రంగా ఎన్టీఆర్ జిల్లాగా గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, ఈ పునర్విభజనను గందరగోళంగా చేసింది. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన చేపట్టిన విభజనతో అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో తమ ప్రాంతాలను విజయవాడలో కలపాలన్న డిమాండ్లు వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది.

ప్రస్తుత రెవెన్యూ డివిజన్ల గందరగోళం ఇలా..

● ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడ రూరల్ (5 గ్రామాలు), మైలవరం, రెడ్డిగూడెం మండలాలు ఉన్నాయి. వీటిలో మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాలు విజయవాడ డివిజన్ పరిధిలో ఉండగా, ఒక్క రెడ్డిగూడెం మిగతా 6లో..

బార్ కౌన్సిల్ బరిలోకి పదిమందికి పైనే

- పీవోపీ అయిన వారికే ఓటుహక్కు
- సిటింగ్ సభ్యులైన సుంకర, చలసాని తిరిగి పోటీ

8

మొంథాను ఎదుర్కొన్నాం

- ముందుచూపుతో తప్పిన ముప్పు
- ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్

6

మొంథాను సమర్థంగా ఎదుర్కొన్నాం

- ముందుచూపుతో తప్పిన తీవ్ర ముప్పు
- తెలంగాణలో వర్షాలతోనే మునేరుకు వరద
- ఇన్చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్

కంచికచర్లరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను వల్ల రాష్ట్రంలో భారీస్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు జిల్లా ఇన్చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎగువ ప్రాంతం తెలంగాణాలో కురినిన భారీ వర్షాలకు మున్నేరుకు భారీగా వరద నీరు చేరుతుండటంతో గురువారం సాయంత్రం సత్యకుమార్, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎంపీ కేశినేని శివనాథ్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యలతో కలిసి కంచికచర్ల మండలం కీసర బ్రిడ్జి వద్ద మున్నేరు వరద ప్రవాహాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, మొంథా తుఫాను తీవ్రత దృష్ట్యా భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని ముందు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన ఎంపీ కేశినేని చిన్ని, సౌమ్య

గానే ప్రభుత్వం గ్రహించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తుఫానుకు వారం రోజుల ముందు నుంచే అధికార యాంత్రంగాన్ని అప్రమత్తం చేయడంతో ప్రాణ, ఆస్తి నష్టం నివారించగలిగమన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బంది నుంచి రాష్ట్రస్థాయి అధికారులను అప్రమత్తం చేసి తుఫాను ధాటికి ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించి సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. తెలంగాణా ప్రాంతంలో కురిసిన భారీవర్షాలకు ఖమ్మం వరంగల్, ప్రాంతాల నుంచి మున్నేరుకు అనూహ్యంగా వరద పెరిగి పెనుగంచిప్రోలు, వత్సవాయి, నందిగామ, కంచికచర్ల మండలాలలో తీర గ్రామాలను ముంచెత్తుతున్నదన్నారు. ప్రజలను కాపాడేందుకు జిల్లా అధికార యాంత్రంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలం లింగాల వద్ద కాజ్వేపై వరద ప్రవహించి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. నష్టం తీవ్రతను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సీపీ రాజశేఖర్‌బాబు, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ ఏసీపీ తిలక్, సీఐ చవాన్, ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు, తహసీల్దార్ నరసింహారావు, దేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి నిధులు కేటాయించండి

- మంత్రి సత్యకుమార్‌కు వసంత వినతి

నందిగామ : బీసీ జనాభా అధికంగా ఉన్న ఐతవరం గ్రామంలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. గురువారం తుఫాను పర్యటనలో భాగంగా ఐతవరం వచ్చిన మంత్రి సత్యకుమార్ ఎంపీ కేశినేని చిన్ని, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, శ్రీరామ్ రాజగోపాల్ తదితరులు వసంత నివాసానికి వచ్చారు. ఈసందర్భంగా తుఫాను ప్రభావంపై చర్చించారు. ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ, తమ గ్రామంలో బీసీలు అధికంగా ఉన్నారని, వారి అవసరాల కోసం నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.


తుఫాను ప్రభావంపై చర్చిస్తున్న నేతలు


పాతమాజేరులో పవన్‌కు తమ గోడు వివరిస్తున్న రైతులు

పాతమాజేరులో పవన్‌కు రైతుల వినతులు

చల్లపల్లి/అవనిగడ్డ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : దివిసీమ పర్యటన ముగించుకుని తిరిగివెళుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చల్లపల్లి మండలం పాత మాజేరులో రైతులు వరి కంకులతో స్వాగతం పలికారు. తుఫాను ప్రభావంతో పాలుపోసుకునే దశలో ఉన్న వరిపంట దెబ్బతిందనీ, గాలులకు కంకులు రాలిపోయాయని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేయగా.. బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రితో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు దిగేందుకు మహిళలు, యువత ఉత్సాహం చూపారు.


పులిగడ్డలో రోడ్డు సైడ్ వ్యాపారులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ప్రజలను పలకరిస్తూ.. పవన్ కల్యాణ్ పర్యటన

అవనిగడ్డ రూరల్ : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వచ్చిన పవన్ కల్యాణ్ పులిగడ్డలో మానవత్వం చాటుకున్నారు. పులిగడ్డలో వృద్ధుడు పెద్ది వెంకటేశ్వరావు ఇల్లు పూర్తిగా దెబ్బతినగా, పరిశీలించిన ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన మహిళ గొర్రె నాగసూరి భర్తను కోల్పోయి కుటుంబపోషణ కోసం పడుతున్న ఇబ్బందుల గురించి వివరించగా, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పవన్ కళ్యాణ్‌కు అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు దివి ప్రాంత రైతుల సమస్యలు వివరించారు.



అడుగడుగునా ఆంక్షలు..



అవనిగడ్డ/కోడూరు : పవన్ కల్యాణ్ దివిసీమ పర్యటన సందర్భంగా పోలీసుల ఆంక్షలతో రైతులు, ప్రజాప్రతినిధులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 8.30 గంటల నుంచే అవనిగడ్డ-కోడూరు రహదారిపై రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. మందపాకల మీదుగా నాగాయలంక వచ్చి అటు నుంచి అవనిగడ్డకు ట్రాఫిక్ మళ్లించటంతో ప్రజలు దాదాపు 14 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి వచ్చింది. కూటమి నేతలను కూడా పోలీసులు అనుమతించకపోవటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తీరగ్రామాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లిందని, అయినా రోడ్డు పక్కన పొలానికి వచ్చి వెళ్లిపోవటంలో ఆంతర్యమేమిటని మహిళలు మీడియాఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. పొలాలను పరిశీలించేందుకు డిప్యూటీ సీఎం కోడూరు వస్తున్నారని, కొండంత ఆశతో ఎదురుచూశామని, కానీ పోలీసు అధికారులు అనుమతించకపోవటంతో తీవ్ర ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు.


పుట్టలో పాలుపోసి పూజలు చేస్తున్న పవన్ కల్యాణ్

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో పవన్ కల్యాణ్

మోపిదేవి : ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లు మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పార్టీ నాయకులు వారికి ఘన స్వాగతం పలకగా.. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి నూతన వస్త్రాలు, శేషవస్త్రాలతో వారిని సత్కరించారు.

స్వచ్ఛ చల్లపల్లికి రావాలంటూ డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

చల్లపల్లి : దివిసీమ పర్యటనకు వచ్చిన పవన్ కల్యాణ్‌ను స్వచ్ఛచల్లపల్లి రథసారధులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్ దంపతులు మోపిదేవిలో మర్యాదపూర్వకంగా కలిశారు. 11 సంవత్సరాలుగా గ్రామంలో జరుగుతున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి సేవలను తెలియచేశారు. ఒకసారి చల్లపల్లి గ్రామాన్ని సందర్శించాలంటూ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. దీనికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు.

భక్తుల సౌకర్యాలను మెరుగుపరుస్తాం

- దుర్గగుడి చైర్మన్ రాధాకృష్ణ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల సౌకర్యాలను మెరుగుపరుస్తామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ బి.రాధాకృష్ణ అన్నారు. గురువారం ఆలయంలోని క్యూలను, కౌంటర్లను ఆయన పరిశీలించారు. తాగునీరు, ప్రసాదాల లభ్యత, పంపిణీ, రవాణా సౌకర్యాల తీరు తదితరాలపై భక్తులను అడిగి తెలునుకున్నారు. భక్తుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ఈవోతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


దుర్గగుడి ప్రాంగణంలో కౌంటర్లను పరిశీలిస్తున్న చైర్మన్ రాధాకృష్ణ

మునేరు మహోగ్రం

(5వ పేజీ తరువాయి)

చేరింది. కీసర వద్ద సాయంత్రం 4 గంటలకు 25.50 అడుగులకు నీటిమట్టం చేరింది.

పాలేరుపై 79.59 సెంటీమీటర్లు

ఒకపక్క మునేరు ఉప్పొంగుతుండగా, మరోపక్క పాలేరు పరవళ్లు తొక్కుతోంది. జనగాం జిల్లా నుంచి ప్రారంభమయ్యే పాలేరు మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల మీదుగా ప్రవహించి జగ్గయ్యపేట మండలం ముక్త్యాల వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. పాలేరు పరిధిలో 79.59 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వాగులన్నీ కృష్ణానదిలో కలవడంతో ఆ వరద ప్రభావం ప్రకాశం బ్యారేజీపై పడుతోంది. పోలంపల్లి ఆనకట్ట వద్ద గంటగంటకూ ఉధృతి పెరుగుతూనే ఉంది. కృష్ణానదికి కూడా వరద వస్తుండటంతో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ తదితరులు కీసర, పెనుగంచిప్రోలు, లింగాల, పోలంపల్లి ప్రాంతాల్లో పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు.

జలదిగ్బంధంలో కాజ్‌వేలు

చిల్లకల్లు-వైరా అంతర్రాష్ట్ర రహదారిలోని లింగాల కాజ్‌వే వరద దిగ్బంధానికి గురైంది. ఈ కాజ్‌వేపై ఆరేడు అడుగుల ఎత్తున వరద పొంగుతోంది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి అధికారులు ఈ కాజ్‌వేను మూసివేశారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కాజ్‌వే రెండువైపులా పహారా కాస్తున్నారు. అంతర్రాష్ట్ర రహదారిపై పూర్తిగా రాకపోకలు నిలిచి 24 గంటలు దాటింది. రెండువైపులా వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పెనుగంచిప్రోలు వంతెనపై ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఒక అడుగు ఎత్తున వరద ప్రవహిస్తోంది. ముందు జాగ్రత్తగా అధికారులు వంతెనను మూసివేశారు.

పెనుగంచిప్రోలు ఆలయ పరిసరాల్లోకి వరద

పెనుగంచిప్రోలు అమ్మవారి ఆలయం వద్దకు వరద చేరింది. పరిసరాలు నీట మునిగాయి. పలు దుకాణాలు వరదలో చిక్కుకున్నాయి. ఆలయం సెంటర్‌లోని కొన్ని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. అధికారులు అమ్మవారి సత్రంలో, ఎంపీయూపీ మెయిన్ స్కూల్‌లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యిమందిని తరలించారు. లింగాల, ఇందుగపల్లి గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా లోతట్టు ప్రాంతాలకు చెందిన 600 మందిని అక్కడికి తరలించారు. వేమవరం వద్ద వరద రోడ్డెక్కటంతో పెనుగంచిప్రోలు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

నీటిలోనే గ్రామాలు

కంచికచర్ల మండలం కీసర, గండేపల్లి, పెండ్యాల, ఎస్.అమరవరం, మోగులూరు, ముస్సలూరు తదితర గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొనటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణానదికి కూడా వరద వస్తుండటంతో తీర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కొనసాగుతున్న వైరా, కట్టలేరు ఉధృతి

వైరాయేరు, కట్టలేరుకు వరద కొనసాగుతూనే ఉంది. వైరాయేరు కూడలి కాజ్‌వేపై పొంగుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కీసర వంతెన వద్ద గురువారం సాయంత్రం 4 గంటలకు మునేరు వరద 5.82 మీటర్లకు చేరింది.

జాతీయ రహదారిపైకి చేరుతుందా?

మునేరు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గురువారం రాత్రికి భారీగా వరద పెరిగే అవకాశం ఉందన్న సమాచారం వారిని కలవరపాటుకు గురిచేస్తోంది. వరద ఇంకా పెరిగితే ఎన్‌హెచ్-65పైకి నీరు చేరే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే హైదరాబాద్-విజయవాడ ప్రధాన మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి.

ఐతవరం వద్ద అధికారుల పహారా

నందిగామ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మునేటి వరద క్రమేపీ పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం ఐతవరం వద్ద మోహరించింది. గత ఏడాది వరదల సమయంలో మునేరు ఐతవరం గ్రామం వద్ద రోడ్డుపైకి వచ్చింది. దీంతో జాతీయ రహదారిపై మూడు రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పలు వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. ఈ అనుభవాలు దృష్టిలో పెట్టుకొని అధికారులు అప్రమత్తమయ్యారు. ఏసీపీ తిలక్, సీఐలు వైవీవీఎల్ నాయుడు, చవాన్, ట్రాన్స్‌కో సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సదరు ప్రదేశంలో ఇప్పటికే వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. రోడ్డు క్రింద భాగంలో ఏర్పాటు చేసిన తూముల నిండుగా నీరు ప్రవహిస్తున్నది. ఇంకా ఏమాత్రం వరద పెరిగినా రోడ్డుపైకి నీరు చేరే ప్రమాదం ఉంది. అదే జరిగితే ట్రాఫిక్


ఐతవరం జాతీయ రహదారికి ఉన్న తూముల వద్ద అర్థరాత్రి విధులు

నిలిపివేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. లైటింగ్ వాహనాలను ఏర్పాటు చేసుకొని ఆ ప్రదేశంలో పహారా కాస్తున్నారు. దీంతో పాటు మధిర రోడ్డులో గల వాగులపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు.

రెవెన్యూ డివిజన్లు

(5వ పేజీ తరువాయి)

మండలం తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది.

● కృష్ణాజిల్లాలోని గన్నవరం, పామర్రు నియోజకవర్గాలు రెండేసి రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉన్నాయి. గన్నవరం నియోజకవర్గంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాలు (9 గ్రామాలు) ఉన్నాయి. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాలు గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. విజయవాడ రూరల్ మండలం (9 గ్రామాలు) మాత్రం విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోనిది. అలాగే, పామర్రు నియోజకవర్గంలో తోట్లవ ల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ, పెదపారుపూడి మండలాలు ఉన్నాయి. వీటిలో తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండలాలు ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయి. ఒక్క పెదపారుపూడి మండలం మాత్రం గుడివాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తుంది.

సమస్యలు ఇలా..

గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలన్నది ప్రజల డిమాండ్. దీనిపై ఇటీవల మంత్రుల కమిటీకి కూడా ప్రతిపాదనలు అందాయి. విజయవాడ విమానాశ్రయం గన్నవరంలో ఉంది. కానీ, గన్నవరం ప్రాంతం కృష్ణాజిల్లా పరిధిలో ఉంటుంది. దీంతో కృష్ణాజిల్లా కలెక్టరేట్ నుంచి కానీ, ఉయ్యూరు నుంచి కానీ ప్రోటోకాల్ విధుల కోసం రావాల్సి వస్తోంది. అలాగే, కైకలూరు, ముదినేపల్లి, నూజివీడును కృష్ణాజిల్లాలో కలపాలనే డిమాండ్ ఎప్పటినుంచో వస్తోంది. నూజివీడును కృష్ణాజిల్లాలో కలుపుతానని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హామీ ఇచ్చారు. తాజాగా ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలో ఒక నియోజకవర్గం తీసుకురావాలన్న ప్రభుత్వ నిర్ణయం ఈ చిక్కుముడులను పరిష్కరించేలా ఉంది.

గన్నవరం రెవెన్యూ డివిజన్ అవసరం

కృష్ణాజిల్లాలోని గన్నవరం, పెనమలూరును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలంటే ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ కారణంగా రెండు డివిజన్ల సమస్యలు తలెత్తుతాయి. అలాంటప్పుడు ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ స్థానంలో గన్నవరాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయటం వల్ల సమస్యకు చెక్ పెట్టవచ్చు. గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాలు ప్రస్తుతం గుడివాడ రెవెన్యూ డివిజన్‌లోనూ, విజయవాడ రూరల్ (9 గ్రామాలు) విజయవాడ రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. గుడివాడ డివిజన్‌లో ఉన్న మండలాలు, ఉయ్యూరు డివిజన్ పరిధిలోని పెనమలూరు మండలాలను గన్నవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకురావచ్చు. దీంతో పూర్తిస్థాయిలో గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలు ఎన్టీఆర్ జిల్లాలోకి చేర్చవచ్చు.

ఎందుకంటే..

గన్నవరాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఎందుకు చేయాలంటే.. ఇది రెండు నియోజకవర్గాలకు కేంద్రస్థానం. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే ఉంది. ఆర్డీవో ఇక్కడే ఉండటం వల్ల ప్రొటోకాల్ డ్యూటీలు నిర్వహించటం తేలిక. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో పామర్రు నియోజకవర్గంలోని తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండలాలు ఉన్నాయి. ఒక్క పెదపారుపూడి మండలం మాత్రమే గుడివాడ రెవెన్యూ డివిజన్‌లో ఉంది. తోట్లవల్లూరు, పెనమలూరు, పామర్రు, మొవ్వ మండలాలను ఉయ్యూరు డివిజన్ నుంచి తొలగించి గుడివాడలో కలపటం ద్వారా పామర్రు నియోజకవర్గం ఎదుర్కొంటున్న రెండు డివిజన్ల సమస్య కూడా పరిష్కారమవుతుంది. అలాగే, గన్నవరం నియోజకవర్గం ఎదుర్కొంటున్న రెండు డివిజన్ల సమస్య కూడా పరిష్కారమవుతుంది.

మైలవరంలోని రెండు డివిజన్ల సమస్య తీరాలంటే..

మైలవరం నియోజకవర్గం ఎదుర్కొంటున్న విజయవాడ, తిరువూరు రెవెన్యూ డివిజన్ల సమస్యను తీరాలంటే మైలవరం రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేయాలి. తిరువూరు డివిజన్‌ను రద్దు చేసి మైలవరం రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటుచేస్తే విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడ రూరల్ (5 గ్రామాలు), రెడ్డిగూడెంను మైలవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకురావటంతో పాటు తిరువూరు నియోజకవర్గంలోని ఏ.కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట, తిరువూరును కూడా తీసుకు రావచ్చు. తిరువూరు రెవెన్యూ డివిజన్‌ను రద్దు చేస్తే.. నూజివీడును కృష్ణాజిల్లాలో కలపటం కూడా తేలిక అవుతుంది.

రివర్స్ ఫ్లో

(5వ పేజీ తరువాయి)

సైతం కలుస్తాయి. ఆయా ప్రాంతాలు ముంపుబారిన పడకుండా ఈ వాగులే రక్షణగా ఉంటాయి. మొంథా తుపాను ప్రభావానికి కురిసిన భారీ వర్షానికి ఆయా ప్రాంతాల్లోని సాగు భూముల్లోకి భారీగా నీరు చేరింది. ఆ నీటిని అంతా కొండవీడు వాగు మాత్రమే కృష్ణానదిలోకి చేరవేయాల్సి ఉంటుంది. కృష్ణానదిలో నీరు తక్కువగా ఉంటే కృష్ణానది వద్ద కట్టిన రెగ్యులేటర్ నుంచి ఈ నీరు గ్రావిటీ ద్వారా నదిలో కలుస్తుంది. నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్న సందర్భాల్లో రెగ్యులేటర్ గేట్లను దించేసి, పక్కనే ఉన్న లిఫ్ట్ ద్వారా నదిలోకి తోడతారు.

నదిలో నీళ్లు నదిలోకే..

దాదాపు 30 ఏళ్ల కిందట కట్టిన రెగ్యులేటర్ గేట్లు అన్నీ దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా అమరావతి నుంచి వస్తున్న వరదతో కొండవీడు వాగు నిండుకుండలా మారింది. మరోవైపు కృష్ణానది సైతం ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో నిండిపోయింది. గురువారం నదిలో నీటిమట్టం ఊహించని రీతిలో 15 అడుగులకు చేరింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో నది నుంచి 5.66 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. అంతకంతకు పెరుగుతున్న నది ప్రవాహం దెబ్బతిన్న రెగ్యులేటర్ గేట్ల నుంచి తిరిగి కొండవీడు వాగులోకి చేరుతోంది.

ఐదు గేట్లు పూర్తిగా దెబ్బతినగా, మిగిలినవి పాక్షికంగా దెబ్బతిన్నాయి.వీటి నుంచి ప్రతి గంటకూ సుమారు 700 క్యూసెక్కుల నీరు కొండవీడు వాగులోకి చేరుతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇదే నీటని లిఫ్ట్ మూడు పంపులు ద్వారా తిరిగి కృష్ణానదిలోకి తోడుతున్నారు. ప్రతి గంటకు 1,059 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ ద్వారా నదిలోకి చేరవేస్తున్నారు.

దీనిలో అమరావతి గ్రామాల నుంచి వచ్చే నీరు సుమారు 350 క్యూసెక్కులు తోడుతుంటే, కృష్ణానది నుంచి వాగులోకి వచ్చే నీరు గంటకు 700 తోడాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతం నుంచి వాగు నీటిని బకింగ్‌హామ్ కాల్వలోకి రెండు గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి వదులుతున్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆస్టర్ పోతిన రమేశ్‌బాబు

రాయితీతో వైద్యపరీక్షలు

- ఆస్టర్ రమేశ్ ఎండీ డాక్టర్ పోతినేని రమేశ్‌బాబు

విజయవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్ట్రోక్ పేషెంట్లకు సత్వర వైద్యచికిత్సను అందించడానికి ఏడాది పాటు 50 వేలమంది రోగులకు ఆస్టర్ రమేశ్ ఆసుపత్రి అన్ని శాఖలు, 26 అవుట్ రీచ్ సెంటర్ల ద్వారా ప్రతిరోజు ఐదుగురు పేషెంట్లకు ఉచిత కన్సల్టేషన్, రాయితీతో వైద్యపరీక్షలు నిర్వహిస్తామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ పోతినేని రమేశ్‌బాబుతెలిపారు. నగరంలోని ఆస్టర్ రమేశ్ ఆసుపత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్ట్రోక్ అనేది ఆకస్మాత్తుగా జరిగే అత్యవసర వైద్య పరిస్థితి అని, ప్రతి నిమిషం విలువైనదన్నారు. సమయానికి సరైన ఆసుపత్రికి చేరితే మెదడులో మరణించే కణాలను రక్షించవచ్చన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగి గోల్డెన్ అవర్లో చికిత్స అందించగలిగితే చాలామంది రోగులు తిరిగి సాధారణ జీవితం పొందుతారని ఆయన పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 18 లక్షల కొత్త స్ట్రోక్ కేసులు నమోదవుతున్నాయని, ప్రతి ఆరు సెకన్లకు ఒక వ్యక్తి స్ట్రోక్‌కు గురవుతున్నారని వెల్లడించారు. 40 ఏళ్లలోపు యువకుల్లో 25శాతం కేసులు నమోదవుతున్నాయన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ధూమపానం, అధికబరువు అదుపులో ఉంచుకుంటే 90శాతం స్ట్రోక్‌లను నివారించవచ్చన్నారు. స్ట్రోక్ కనిపించిన నాలుగున్నర గంటల్లో చికిత్స పొందితే 80 శాతం మంది పూర్తిగా కోలుకోవచ్చని రమేశ్‌బాబు చెప్పారు. స్ట్రోక్ అనేది మెదడుకు రక్తప్రవాహం ఆకస్మాత్తుగా ఆగిపోవడం లేదా రక్తనాళం చిట్లిపోవడం వల్ల మెదడులో కణజాలం దెబ్బతినడం వల్ల ఏర్పడుతుందన్నారు. గుండె జబ్బుల తర్వాత ప్రపంచ వ్యాప్తంగా మరణానికి రెండో ప్రధాన కారణమని తెలిపారు.

దళితులపై పెరుగుతున్న లైంగిక దాడులు

- డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా కోటేశ్వరరావు



గవర్నర్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చట్టం పటిష్ఠంగా అమలు పర్చడం అందరి కర్తవ్యమని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా కోటేశ్వరరావు అన్నారు. దళిత స్త్రీ శక్తి సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హోటల్‌లో దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరుగుతున్న హింసకు సంబంధించి బాధితులు, సాక్షులతో లీగల్ క్లినిక్ నిర్వహించారు. జ్యూరీ సభ్యులుగా సీఐడీ పీసీఆర్ కె.శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయకుమార్, మాజీ ఇన్ఫర్మేషన్ కమిషనర్ అంబటి సుబ్బారావు, ఎస్సీ అసోసియేషన్ సెక్రటరీ రత్న ప్రదీప్, హైకోర్టు అడ్వకేట్ అభిజ్ఞలు ఉన్నారు. క్లినిక్‌కు దళిత స్త్రీ శక్తి సంస్థ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బైరా మాట్లాడుతూ, బలమైన చట్టం ఉన్నప్పటికీ దళితులు, ఆదివాసీల స్త్రీలు, బాలికలపై అత్యాచారాలు, లైంగిక దాడులు, హత్యలు వంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. చట్టం పటిష్ఠంగా అమలు పర్చడంలో కర్తవ్యం బలంగా ఉండాలన్నారు. బాధితులకు రావలసిన రాయితీలను సోషల్ వెల్ఫేర్ మంత్రితో మాట్లాడి సదుపాయం కలిగేట్టు చూస్తామని హామీ ఇచ్చారు. క్లినిక్‌లో దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరిగిన హింసా సంఘటనలను, 33 కేసులను జ్యూరీ సభ్యుల ముందుంచారు. దళిత స్త్రీ శక్తి నేషనల్ కో-ఆర్డినేటర్ ప్రతి కేసుకూ సమన్వయకర్తగా జ్యూరీకి వివరించారు. జ్యూరీ సభ్యులు స్పందిస్తూ బాధితులకు నష్టపరిహారం కోసం కృషి చేస్తామన్నారు.

కొండంత భరోసా

(5వ పేజీ తరువాయి)

ప్రతిఫలం లేకుండాపోతోందని కోడూరు మండలానికి చెందిన పలువురు కౌలు రైతులు పవన్ కల్యాణ్‌ను వివరించారు. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు ఈ ప్రాంత కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా, సాగులో ఎంతమంది కౌలుదారులు ఉన్నారో గణాంకాలు వేయాలని పవన్ కల్యాణ్ కలెక్టర్‌కు సూచించి, కౌలు రైతుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

పవన్ దృష్టికి దీర్ఘకాలిక సమస్యలు

దివిప్రాంత రైతులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను జిల్లా అధికారులు పవన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధికారులు రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. నాబార్డు సాయంతో అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మంత్రి కొల్లు రవీంద్రలు వివరించారు. ఈ విషయాన్ని వెంటనే క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని పవన్ హామీ ఇచ్చారు. గురువారం ఉదయం 11.10 గంటల సమయానికి కోడూరు మండలం కృష్ణాపురం వెళ్లిన పవన్ అక్కడి రైతులతో మాట్లాడారు. అనంతరం అవనిగడ్డ వచ్చేంత వరకు దారి పొడవునా తనకోసం ఎదురుచూస్తున్న రైతులను కలిసి వారి సమస్యలను విన్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

రైతుబజార్లకు సెలవు ఎత్తివేత

» ఈవో జాన్ విక్టర్

కృష్ణలంక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు విజయవాడలోని అన్ని రైతు బజార్లు ఏడు రోజులు పనిచేస్తాయని, శుక్రవారం సెలవు వుండదని కృష్ణలంక రైతుబజారు ఈవో జాన్‌విక్టర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరిగిన కూరగాయల ధరలు సాధారణ స్థితికి వచ్చేవరకు, కృష్ణలంక రైతుబజారు శుక్రవారం కూడా పనిచేస్తుందన్నారు.

పునరావాస కేంద్రాల్లో ఆహారం పంపిణీ

మొగల్రాజపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీస్తురాజపురం, మొగల్రాజపురంలో సీపీఎం అధ్వర్యంలో పునరావాస కేంద్రాల్లో గురువారం ఆహారం పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావం తగ్గినా ఇంకా కొండ ప్రాంతాల్లో రాళ్లు పడుతున్నాయన్నారు. కార్యకర్తలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు రమణారావు, కృష్ణ, దుర్గారావు, క్రాంతికుమార్, మురహరి, శ్రీనివాసరావు, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



ఆహార పంపిణీ చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు



నీట మునిగిన కోటిరెడ్డి రోడ్డు

కోటిరెడ్డి రోడ్డుకు మోక్షమెప్పుడు?

భారతీనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలోని భారతీనగర్ నుంచి ఆటోనగర్ రోడ్డు అధ్వానంగా మారింది. వర్షం కురిస్తే రోడ్డు చెరువులా మారుతుంది. దీంతో ఆ రోడ్డులో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మీద నీళ్లు సమీపంలోని నివాసాల్లోకి చేరుతున్నాయి. రాత్రి అయితే దోమలు దాడి చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నివాసాల్లోకి వరద చేరనీయొద్దు

» వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

రామలింగేశ్వరనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరద నీరు నివాస గృహాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. కృష్ణానదీ పరీవాహక ప్రాంతమైన రామలింగేశ్వరనగర్, సాయి రామ్ కట్ పీసెస్, బసవతారకనగర్ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి, పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రామలింగేశ్వరనగర్‌లోని సాయి రామ్ రోడ్డు, పోలీస్ కాలనీ, భూపేష్ గుప్తా నగర్, రణధీర్ నగర్, మెట్ల బజార్ ప్రాంతాల్లో మోటార్ల ద్వారా నీటిని ఎప్పటికప్పుడు తోడేస్తున్నట్టు తెలిపారు. సర్కిల్-1 పరిధిలో భవానీపురం చేపలరేవు వద్ద రెండు మోటార్లను ఏర్పాటు చేసి వరద నీరు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కె.షమ్మీ, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె. అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరనగర్, బసవతారకనగర్ లోతట్టు ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర



కాళీమాత ఆలయంలో మహాలింగార్చన

కృష్ణలంక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో తొమ్మిదో రోజు గురువారం పుట మన్నుతో చేసిన మహాలింగార్చన ఓంకారేశ్వర మూర్తిగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం క్షీరాబ్ధి ద్వాదశి కావటంతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్ తెలిపారు. పాల్గొనాలనుకునే భక్తులు ఆలయ కమిటీ వారిని సంప్రదించాలన్నారు. కార్తీక పౌర్ణమి రోజు సాయంత్రం 6 గంటలకు కార్తీకదీపం జరుగుతుందని భక్తులు పాల్గొనాలని కోరారు.

స్కేటింగ్ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కొల్లి సునీత

భారతీనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రోలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గన్నవరంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో పటమట శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి మహమ్మద్ అయాన్ అలీ 200 మీటర్ల, 400 మీటర్ల స్కేటింగ్‌లో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల రీజనల్ ఇన్‌చార్జి ఆర్.పద్మ, ప్రిన్సిపాల్ కొల్లి సునీత, ఉపాధ్యాయులు అలీని అభినందించారు.

సర్వమానవాళి కోసం చత్ పూజ

విద్యాధరపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సూర్యభగవానునికి, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు చత్ పూజలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ఉత్తర భారతీయ సేవా సంఘం అధ్యక్షుడు బావేష్ పాఠక్, ఉపాధ్యక్షుడు పంచానంద్ షా అన్నారు. భవానీఘాట్‌లో గురువారం ఉత్తర భారతీయ సేవా సమితి ఆధ్వర్యంలో బీహారీలు, డిల్లీ, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు చెందిన సుమారు 500 వందల మంది భక్తులు ప్రత్యేక స్నానాలు ఆచరించి, కృష్ణమ్మ ఒడిలో చత్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం కృష్ణమ్మకు హారతులు సమర్పించారు. బావేష్ పాఠక్ మాట్లాడుతూ దీపావళి తరువాత సూర్యభగవానునికి చత్ పూజ చేయడం ఆనావాయితీ అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ఉదయ్ షా, సచ్చిప్ నివేష్ కుమార్, రాంబందన్ నిషాద్, రవిశంకర్ పండిట్, మనిష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భ్రమరాంబ అమ్మవారు.. సర్వ మంగళదేవిగా దర్శనం



వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాతశివాలయంలో ఏడో రోజు గురువారం భ్రమరాంబ అమ్మవారు శ్రీసర్వమంగళదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు. గంగాపార్వతీ సమేత విజయేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాస నక్త దీక్ష మహోత్సవాల్లో భాగంగా గురువారం అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఈవో కె.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దుర్గగుడిలో అర్చకులు సహస్రలింగార్చనలో బిల్వ పత్రాలు, పుష్పాలను సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

ఆర్టీసీ డిపోలోని సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు బి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపోలో రెడ్ బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. నాగిరెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా డిపో సమస్యలపై నిరసన తెలుపుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. ఉద్యోగుల్ని గాలికి వదిలేసి డిపోలో ఇతర అసోసియేషన్‌ల సహకారంతో ఉద్యోగస్తులను డబల్ డ్యూటీలు చేయాలంటూ అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. అక్రమ పనిష్మెంట్‌లను, సస్పెన్షన్‌లను ఆపాలన్నారు. లేడీస్ స్టాఫ్ రూమ్‌లో ఐదు నిమిషాలు కూడా కూర్చోలేని పరిస్థితి ఉందన్నారు. డిపోలో ఉన్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. డిపో చైర్మన్ దుర్గారావు, ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20వేల పరిహారం ఇవ్వాలి

ఉయ్యూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20వేల పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదఓగిరాల, ఆకునూరు, కాటూరు, కడవకొల్లు, గండిగుంట గ్రామా ల్లో గురువారం కౌలురైతు సంఘం నాయకులతో కలసి పర్యటించి దెబ్బతిన్న వరి, అరటి పంటలను పరిశీలించారు. నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈక్రాప్‌తో సంబంధం లేకుండా రైతులు, కౌలు రైతుల నుంచి ప్రభుత్వం ప్రకటించిన ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కోసూరు శివనాగేంద్రం, అన్నే సుబ్బారావు, రాజేశ్, పలువురు కౌ లు రైతులు పాల్గొన్నారు.



ఆకునూరులో నేలకొరిగిన అరటితోటను పరిశీలిస్తున్నకౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

● **ఉంగుటూరు :** మొంథా తుపాను ధాటికి వరి పంటకు జరిగే నష్ట తీవ్రతను తగ్గించుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం రైతులకు సూచించింది. గురువారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(ఆంగ్రూ-గుంటూరు) డీన్ జి.రామచంద్రరావు నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయశాఖ అధికారులతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. మానికొండ, తరిగొప్పలలో నేలకొరిగిన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, చేపట్టాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేసింది. డీన్ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుతం సార్వా వరి చిరుపొట్ట, పాలుపోసుకునే దశలో వుందని, తుపాను దెబ్బకు చాప లా పడటంతో తాలుగింజలు ఏర్పడి, ధాన్యం రంగు మారే అవకాశముందన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా తిరుపతి జిల్లాకు చెందిన ఓ మహిళ విజయవాడ వచ్చి దుర్గమ్మను దర్శించుకుని కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. విధుల్లో ఉన్న పోలీసులు ఆమెను కాపాడారు. ఈ సంఘటన గురువారం కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధి శనైశ్వరస్వామి దేవస్థానం సమీపంలో జరిగింది. తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన ఝాన్సీరాణి(58) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధ పడుతుంది. ఈ క్రమంలో గురువారం ఉదయం రేణిగుంట నుంచి విజయవాడ వచ్చి దుర్గమ్మను దర్శించుకుని, శనైశ్వర స్వామి దేవస్థానం సమీపంలో కృష్ణా నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు ఆమెను కాపాడి కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. వివరాలు తెలుసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి, ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బందరు కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

వన్‌టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అమెరికన్ హాస్పటల్ సమీపంలోని బందరు కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం గుర్తించారు. కృష్ణలంక పోలీసులకు అందిన సమాచారంతో కాల్వలో ఉన్న మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చి పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లేకపోవటంతో పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

రోడ్లపై చెత్తకుప్పల తొలగింపు

ఉయ్యూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గండిగుంట గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారి, సర్వీస్ రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను పంచాయతీ శానిటరీ సిబ్బంది తొలగిస్తున్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న హైవే, సర్వీస్ రోడ్ల పక్కన రోజుల తరబడి చెత్తకుప్పలు, వ్యర్థాలు పేరుకుపోగా హైవే అధికారులు పట్టించుకోని నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేర సిబ్బంది చేత చెత్తకుప్పలు తొలగించి శుభ్రపరచి బ్లీచింగ్, సున్నం చల్లించి అపరిశుభ్రత లేకుండా చర్యలు చేపట్టినట్టు పంచాయతీ కార్యదర్శి కుమార్ తెలిపారు.

దెబ్బతిన్న గ్రామాల్లో మార్కెట్ యార్డ్ చైర్మన్ పర్యటన

విజయవాడ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న గ్రామాల్లో గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు(నర్సయ్య) గురువారం విస్తృతంగా పర్యటించారు. నున్న ఎన్టీపీసీ, మ్యాంగో మార్కెట్ మధ్య రహదారి జలమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. నీటి మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పి. నైనవరంలోని కుక్కలవాని కుంట చెరువు గండి పూడిక తీత పనులను పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. అంబాపురం పాముల కాలువ గుర్రపుడెక్క, తూటికాడతో నిండి తూములు పూడుకుపోవడాన్ని పరిశీలించిన ఆయన కాలువ ప్రవాహాన్ని పునరుద్ధరించాలని అధికారులను కోరారు. అంబాపురం, పి. నైనవరం గ్రామాల మధ్య జన్మభూమి రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా మారడాన్ని పరిశీలించి నిర్మాణానికి కృషి చేస్తానని రైతులకు హామి ఇచ్చారు. టీడీపీ నేతలు గుజ్జర్లపూడి బాబురావు, రైతు నాయకులు గుంటక సుబ్బారెడ్డి, సర్పంచ్ గండికోట సీతయ్య, గంపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన జన్మభూమి రోడ్డును పరిశీలిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు

రైతులూ.. ఆందోళన వద్దు

● పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన
● స్థానిక ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజాతో కలిసి పంట నష్టం పరిశీలన

పెనమలూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రాష్ట్రంలోని ప్రతి రైతునూ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభ్యర్థన మేరకు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి తాడిగడపలో తుపానుకు నేలకొరిగిన కంద, అరటి, పసుపు పంటలను పరిశీలించారు. భారీగా పంట నష్టపోయిన రైతు రాజబాబును పరామర్శించి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకొని మీడియాతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోలేమని, నష్టశాతాన్ని నివారించుకోగలిగామన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పంట నష్ట అంచనాలు తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని ఇరు ప్రభుత్వాలు రైతులకు ఆర్థిక సాయం అందిస్తాయన్నారు. 25న తుపాను ప్రకటన వెలువడినప్పటి నుంచి రైతుల పంటల నష్ట నివారణకు, ప్రాణనష్ట నివారణకు అత్యంత ప్రాముఖ్యత ఇచ్చామన్నారు. బుధవారం ఏరియల్ సర్వే చేసిన సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి వాస్తవ గణాంకాలను ఇవ్వాలని అధికారులను ఆదేశించారని, త్వరలో పంటనష్ట పరిహారాన్ని రైతులకు అందిస్తామన్నారు. తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉండనే హెచ్చరికలతో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అప్రమత్తమై అధికార వ్యవస్థ మొత్తాన్ని రంగంలోకి దించి ప్రాణ నష్టం లేకుండా నివారించగలిగారన్నారు. మిర్చి క్వింటాల్ ధర రూ.14వేలకు పైగా ఉంటే ఇది కూడా తెలుసుకోలేని జగన్ ఇంట్లో కూర్చొని రూ.11,500 అని మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. మామిడి రైతును ఆదుకునేందుకు రూ.300 కోట్లను అందించామని, 10వేల మిలియన్ల కిలోల పొగాకులను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని రూ.17వేల నుంచి రూ.25వేలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. పంట నష్టపోయిన రైతులున్న పంటను ఎలా రక్షించుకోవాలో సలహాలిచ్చేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలను రంగంలోకి దించుతున్నామన్నారు. టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, వెలగపూడి శంకరబాబు, యార్లగడ్డ సుచిత్ర, నంగెపు రంగారావు, పీతా గోపీచంద్, తుమ్మల రాంకుమార్, తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, నర్రా చంటి, మేడసాని రత్నకుమారి, కొండా ప్రవీణ్, ఏడీ సునీల్, తహసీల్దారు గోపాలకృష్ణ, ఏవో శైలజ పాల్గొన్నారు.




తాడిగడపలో అరటి, కంద పంటలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి, వెంట్రప్రగడలో వరిపైరును ఎమ్మెల్యే కుమార్‌రాజాతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

వెంట్రప్రగడలో ఎమ్మెల్యే వర్లతో కలిసి..

పెదపారుపూడి: ప్రభుత్వం చేయాల్సిందంతా చేస్తుందని, వ్యవసాయ శాఖ సూచలను రైతులు పాటించాలని మంత్రి అచ్చెనాయుడు అన్నారు. గురువారం సాయంత్రం పెదపారుపూడి మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో నేలకొరిగిన వరిపైరును ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని నష్టం అంచనాలు రూపొందించాలని, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు చేతికొచ్చిన వేళ తుపాను రావటం బాధాకరమన్నారు. ప్రకృతి వైపరీత్య సమయంలో వ్యవస్థలన్నీ సమర్థవంతంగా పని చేశాయన్నారు. ప్రాణనష్టం లేకుండా చేశామని, ప్రాథమిక అంచనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేలా 4 రోజుల్లోపు పూర్తి నివేదికలు సిద్ధం చేయాలని, గ్రామాలవారీగా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తామన్నారు. హెక్టార్‌కు 25వేల నష్టపరిహారం అందించిన చరిత్ర సీఎం చంద్రబాబుదే అన్నారు. జగన్ అబద్ధాలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. వీరంకి గురుమూర్తి, టీడీపీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షులు కూచిపూడి సుబ్బయ్య, సూరపనేని వెంకట సత్యనారాయణ, బుడ్డాలు, కాటమరాజు, ఏవో అంజనేయులు, అధికారులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.






దివిసీమలో డిప్యూటీ సీఎం

పంట నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను శ్రద్ధగా తిలకిస్తూ.. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రజలకు అభివాదం, పులిగడ్డలో కొబ్బరి బొండాలు విక్రయిస్తున్న మహిళ సమస్యలు తెలుసుకుంటూ.. భర్తను కోల్పోయిన గొర్రె నాగమణిని పరామర్శిస్తూ..

నేలకొరిగిన అరటి తోటలు

● లక్షల్లో నష్టపోయామంటున్న రైతులు ● ఆదుకోవాలని వేడుకోలు

మోపిదేవి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు, తుపాను ప్రభావంతో వందల ఎకరాల్లో సాగు చేసిన అరటి తోటలు నేలకొరగటంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మోపిదేవి మండలంలోని మోపిదేవిలంక, నాగాయితిప్ప గ్రామాల్లో అరటి, కంద, పసుపు వాణిజ్య పంటలు అధికంగా సాగు చేస్తున్నారు. రూ.50వేలతో లీజు తీసుకుని రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పంటలను సాగు చేశారు. మరికొద్ది రోజుల్లో చేతికి అందివస్తాయనుకున్న తోటలు విరిగి నేలపాలయ్యాయి. నేలకు ఒరిగిపడి ఉన్న అరటి తోటలను చూస్తున్నా రైతులు మా వెన్ను విరిగిపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస ఉపద్రవాలతో రైతులు ఆర్థికంగా కోలుకోలేని నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ మోపిదేవి లంక, నాగాయితిప్ప గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలో 350 ఎకరాలకు పైగా అరటి, కంద, పసుపు తోటలు సాగు చేస్తుండగా, పూర్తిగా నేలపాలయ్యాయని చెబుతున్నారు. ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేసి నష్టపోయిన వాణిజ్య పంటల రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగెకరాల అరటి.. పది లక్షలు నష్టం.. రాజులపాటి నరసారావు, కౌలు రైతు

నాగాయితిప్పలో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని అరటి పంట సాగు చేశాను. కొద్దిరోజుల్లో పంట చేతికి వస్తుందనగా అధిక వర్షాలు, తుపాను రూపంలో మొత్తం నేలమట్టం అయింది. రూ.10 లక్షలకుపైగా నష్టం వాటిల్లింది. వరుస ఉపద్రవాలతో ఆర్థికంగా కోలుకోలేని నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.



పూర్తిగా విరిగి పడిపోయిన అరటి పంటను చూపిస్తున్న రైతు రాజులపాటి నరసారావు



విజయవాడలోని విద్యాధరపురం బస్ డిపోలో నీట మునిగిన బస్సులు



ఎన్టీఆర్ జిల్లా చందాపురంలో పాడైన పత్తి పంటను చూపిస్తున్న రైతు

పునరావాస కేంద్రాల్లో వైద్యసదుపాయాలు: డీఎంహెచ్‌వో

విజయవాడ: ఎగువన కురిసిన వర్షాలతో మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో చిట్యాల వంతెన వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను, వైద్య శిబిరాలను కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు పరిశీలించారు. చిట్యాలతో పాటు లింగాల ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రాల్లో అత్యవసర మందులతో సహా అన్ని వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం సుహాసిని తెలిపారు.



పదవీ విరమణ పొందిన సమాచార శాఖ ఉద్యోగులు జాస్తి వెంకటలక్ష్మి, రూపవాణి దంపతులను సత్కరిస్తున్న అదనపు డైరెక్టర్ స్వర్ణలత

విధి నిర్వహణలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకం

● సమాచార శాఖ అదనపు డైరెక్టర్ స్వర్ణలత

కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే మహిళా ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణలో అందించే సేవలు ఎంతో కీలకమని ప్రజలకు ప్రభుత్వానికి వారధి అయిన సమాచార పౌర సంబంధాల శాఖలో అత్యంత సమర్థవంతంగా సేవలందించిన సూపరింటెండెంట్ ఎం రూపవాణి, విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న జాస్తి వెంకటలక్ష్మి పనితీరు అభినందనీయమని సమాచార శాఖ అదనపు సంచాలకులు ఎల్‌స్వర్ణలత అన్నారు. ఈనెల 31న పదవీ విరమణ చేయనున్న రూపవాణి, వెంకటలక్ష్మికి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ ఒకవైపు గృహిణిగా మరోవైపు ఉద్యోగిగా బాధ్యతలను అలుపెరగక నిర్వహిస్తారన్నారు. దాదాపు 40 ఏళ్లుగా వెంకటలక్ష్మి, 33 ఏళ్లుగా రూపవాణి తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ తమదైన శైలిలో సేవలందించిన మహిళా సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని తెలిపారు. వారి సేవలు నేటితరం వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా నిలిచే సమాచార శాఖలో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావించి ఉద్యోగులంతా సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు సంపాదించాలని కోరారు. అనంతరం వెంకట లక్ష్మీప్రసాద్ దంపతులను రూపవాణిని సన్మానించారు. రాష్ట్ర సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ సూర్యచంద్రరావు, డిప్యూటీ డైరెక్టర్లు బీ పూర్ణచంద్రరావు, వెంకట్రాజు గౌడ్, డీ రమేష్ భాస్కరనారాయణ, ఏడీలు ఎస్‌వీ మోహన్‌రావు, పీ రాజశేఖర్, ఏఎస్ వీరభద్రరావు, ఏ నారాయణరెడ్డి, డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డీఎల్ పీఆర్‌వో కే రవి, విశ్రాంత అధికారి ఎస్ శ్రీనివాస్ జీవన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తం

మునేరు, కృష్ణానదికి పోటెత్తుతున్న వరద

● ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు ● నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం
● రైతుల క్షేమం, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం చొరవ: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాలతో మునేరుకు వరద పోటెత్తుతోందని, ఈ నేపథ్యంలో మునేరుతో పాటు కృష్ణానదిలోని వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉన్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యతో కలిసి కీసర వంతెన వద్ద మునేరు వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు వివిధ ప్రాంతాల్లో వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణా, మునేరు, కట్టలేరు, వైరా, పాలేరులోని ప్రవాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామని, మునేరుకు అటూ ఇటూ ఉన్న 40 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకొన్నామని, గ్రామ సచివాలయాలు, పాఠశాలలను సిద్ధంగా ఉంచామని, ఏ ఇబ్బంది తలెత్తినా వెంటనే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు ఇలా వివిధ శాఖల అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులుంటే ప్రత్యామ్నాయ రహదారులకు కూడా ప్రణాళికలన్నట్టు వివరించారు.



మునేరు వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

రైతులకు ప్రభుత్వం పూర్తి భరోసా

రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టాల తుది అంచనాల నివేదికలకు అనుగుణంగా నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొంటున్నారని, సూచనలిస్తున్నారన్నారు. ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తుతోందని, ఈ నేపథ్యంలో బ్యారేజీకి ఎగువన, దిగువన ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామన్నారు.



ఏటిమొగ పంచాయతీలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న కార్మికులు

అంధకారంలోనే గ్రామాలు

నాగాయలంక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను తీరం దాటి రెండు రోజులు దాటినా మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా లేక అంధకారంలోనే మగ్గుతున్నాయి. 28న మధ్యాహ్నం నుంచే మండలంలోని 22 పంచాయతీల గ్రామాల్లో అధికారులు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. 29న సాయంత్రానికి నాగాయలంక, భావదేవరపల్లి, కమ్మనమోలు, నాలి, మర్రిపాలెం, వక్కపట్లవారిపాలెం పంచాయతీల్లో మాత్రమే విద్యుత్ సరఫరా, విరిగిన చెట్లను తొలగించి ఇచ్చారు. మిగిలిన 16 పంచాయతీల్లో విద్యుత్ సరఫరా లేక గ్రామస్థులు చీకట్లలోనే మగ్గుతున్నారు. రెండు రోజులుగా విద్యుత్ లేకపోవటంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులు బిల్లు కట్టకపోతే వెంటనే ఫీజులు తీసిన వారు ఇప్పుడు విద్యుత్ సరఫరా తక్షణం ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తున్నారు.

మండలంలో విరిగిన 200 విద్యుత్ స్తంభాలు

మొంథా తుపాను వల్ల సంభవించిన పెనుగాలులకు 200 విద్యుత్ స్తంభాలు విరిగినట్టు గుర్తించామని ఏఈ జీ వెంకటరాజు తెలిపారు. 16 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, వాటిలో 6 పునరుద్ధరించామన్నారు. మండలంలోని 22 పంచాయతీల గ్రామాల్లో 6 పంచాయతీల గ్రామాలకు మాత్రమే విద్యుత్ సరఫరాను అందించామన్నారు. గురువారం మరో 4 పంచాయతీలకు అందిస్తున్నామన్నారు. మిగిలిన పంచాయతీల్లో విద్యుత్ లైన్లను పునరుద్ధరణ చేసి త్వరగా ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్టు ఏఈ తెలిపారు.

మళ్లీ కృష్ణానదికి వరద

ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణానది దిగువకు 3 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారని మండల తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద స్థాయి ఇంకా పెరుగుతుందన్నారు. మండలంలోని నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒక పక్క మొంథా తుపానుతో తేరుకుంటున్న ప్రజలకు మళ్లీ వరద కృష్ణానదికి రానుండటంతో అప్రమత్తం అవుతున్నారు.

బార్ కౌన్సిల్ బరిలోకి.. పదిమందికి పైనే!

● సీవోపీ అయిన వారికే ఓటు హక్కు ● బెజవాడ బార్ నుంచి సిట్టింగ్ సభ్యులైన సుంకర, చలసాని తిరిగి పోటీ



విజయవాడ లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల బరిలోకి ఈసారి బెజవాడ బార్ నుంచి 10 మంది న్యాయవాదులకు పైగా పోటీ పడుతున్నారు. వీరిలో సిట్టింగ్ సభ్యులైన సుంకర రాజేంద్రప్రసాద్ (4వ సారి), చలసాని అజయ్‌కుమార్ (2వ సారి)తో పాటు మరో పది మంది ఉన్నారు. సుంకర రాజేంద్రప్రసాద్‌కు ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) న్యాయవాదుల సపోర్టు, చలసాని అజయ్‌కుమార్‌కు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్)కు చెందిన న్యాయవాదుల సపోర్టు ఉంటుంది. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన 152 బార్ అసోసియేషన్ల నుంచి సుమారుగా 150 నుంచి 200 మంది వరకు బార్ కౌన్సిల్ సభ్యులుగా పోటీలో ఉండే అవకాశం ఉంది. వీరికి రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల చెందిన దాదాపు 33,991 మంది న్యాయవాదులు ఓటు వేసి 25 మంది సభ్యులను ఎన్నుకోవాలి. సీవోపీ డిక్లరేషన్ చేయాల్సిన వారు దాదాపు 8వేల మంది ఉన్నారు. దాదాపు 42వేల మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోటీ చేసే న్యాయవాదులు నామినేషన్ ఫీజు కింద రూ.1.25 లక్షలు చెల్లించాలి. ఒక్కో న్యాయవాది 25 మంది న్యాయవాదులకు ఓటు వేయాలి. మొదటి ప్రిఫరెన్షియల్ ఓటు ఎవరికి ఎక్కువ పడితే వారు విజేత. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ (సీవోపీ) చేసిన వారికే ఓటు హక్కు. జనవరి 31లోగా దేశంలోని అన్ని బార్ కౌన్సిళ్లకు ఎన్నికలు నిర్వహించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. బెజవాడ 'బార్' నుంచి సుంకర, చలసానితోపాటు పీడీఎస్ నారాయణ, అరిగెల రాజా, సీహెచ్ మన్మథరావు, దావలి అబ్రహంలింకన్, మట్టా జయకర్, చంద్రగిరి విష్ణువర్ధన్, గంగిశెట్టి ఉమాశంకర్ (అయ్యప్ప), ఇస్మాయిల్ షేక్, బర్రె శ్రీనివాసరావు, అల్లాడ రామకృష్ణ, శ్రవణం అచ్యుతరామయ్య బెజవాడ బార్ నుంచి పోటీ పడుతున్నారు.

ఇంద్ర బస్సుకు తప్పిన ప్రమాదం



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఇంద్ర ఏసీ బస్సుకు గురువారం హనుమాన్‌జంక్షన్‌లో త్రుటిలో ప్రమాదం తప్పింది. ఏలూరు డిపోకు చెందిన ఇంద్ర సర్వీస్ హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతూ మార్గమధ్యంలో హనుమాన్ జంక్షన్ బస్టాండ్ లోపలికి వస్తున్న సందర్భంలో బస్సు పైభాగానికి ప్రవేశ మార్గంలో ఉన్న పాత బస్టాండ్ షెడ్ పైకప్పుకున్న ఇనుప రాడ్లను ఢీకొంది. దీంతో బస్సు పై భాగంలో నిప్పు రవ్వలు రేగడంతో బస్టాండ్‌లో ప్రయాణికులు కేకలు వేశారు. డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేసి ప్రయాణికులను దింపేశారు. ఏలూరులో దిగాల్సిన 15 మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం లేకపోవడంతో అదేబస్సులో ప్రయాణికులను ఏలూరు తరలించారు. బాడీ ఎత్తుగా ఉన్న బస్సులు పాత బస్టాండ్ షెడ్ రేకులకు అమర్చిన ఇనుపరాడ్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి బస్సులను నడపాల్సి వస్తోంది. అధికారులు స్పందించి షెడ్‌ను తొలగించాలని కోరుతున్నారు.

విశేషం

కృతజ్ఞతా దీపం

తెలుగు మాసాలలో ఎంతో పవిత్రమైన కార్తికం... ఆకాశదీపంతో ప్రారంభమవుతుంది. వాస్తవానికి ఆకాశదీపాలు అంటే... సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. వాటిని వెలిగించినది పరమేశ్వరుడు. లోకాన్ని వెలుగులతో నింపుతున్న ఆ దైవానికి కృతజ్ఞతగా.. భక్తులు ఆకాశదీపాలు వెలిగిస్తారు. గాలికి ఆరిపోకుండా చుట్టూ మూసి ఉండే, చిన్న రంధ్రాలు కలిగిన పాత్రలో దీపం వెలిగించి, దానికి తాడు కట్టి, ధ్వజస్తంభానికి వేలాడదీసిన తాడుతో జాగ్రత్తగా పైకి లాగుతారు. ఆ దీపం పితృదేవతలకు దారి చూపిస్తుందనే నమ్మకం ఉంది. ఆకాశదీపాన్ని వెలిగించినా, చూసినా, తలచుకున్నా ఎంతో మంచిదని, ఆ దీపకాంతి ప్రస



రించే ప్రదేశాన్ని పరమేశ్వరుడు కాపాడుతాడని పెద్దలు చెబుతారు. దీనివల్ల ప్రతికూల శక్తులు నశిస్తాయి. ఈ దీపం కోసం భక్తులు చమురు, పత్తితో తయారు చేసిన వత్తులు తమ శక్తి కొద్దీ ఇస్తూ ఉంటారు.

ప్రదోషకాలంలో...

ధ్వజస్తంభం మీద ప్రకాశించే ఆకాశదీపం ఆ చుట్టుపక్కల ప్రాంతమంతా వెలుతురు విరజిమ్ముతుంది. ధ్వజస్తంభం పైకి ఆకాశదీపాన్ని ఆరోహణ చేస్తే.. ఈశ్వరుడి ఉత్సవం నిర్వహిస్తున్నట్టు లెక్క. పూర్వకాలంలో, రవాణా వ్యవస్థ అంతగా అభివృద్ధి చెందని రోజుల్లో... బాటసారుల కోసం ఆకాశదీపాన్ని పెట్టేవారు. కాలినడకన వచ్చే బాటసారులు ఆకాశదీపాన్ని చూసి, ఆ సమీపంలో దేవాలయం, ఒక గ్రామం ఉన్నాయని తెలుసుకొనేవారు. రాత్రి ఆ గ్రామంలో విశ్రమించి, మరునాడు ప్రయాణాన్ని కొనసాగించేవారు. ప్రదోష వేళల్లో వెలిగించిన ఆకాశదీపాలను దర్శిస్తే... సకల దోషాలు, పాపాలు దూరమవుతాయంటారు.

ఉసిరి దీపాలు...

కార్తిక మాసంలో దీపాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పత్తితో చేసిన వత్తులను ఆవునెయ్యిలో నానబెట్టి, వాటిని అరటి దొప్పల్లో పెట్టి వెలిగిస్తారు. అలాగే ఈ మాసంలో ఉసిరి దీపాలు కూడా వెలిగిస్తారు. ఉసిరి కాయల పైభాగాన్ని గుండ్రంగా కోసి, మధ్యలో తొలిచి, దానిలో ఆవునేతిలో నానబెట్టిన వత్తి వేసి దీపం వెలిగించడం ఎంతో పుణ్యంగా భక్తులు భావిస్తారు. దీనివల్ల శుభాలు కలుగుతాయని, నవగ్రహ దోషాల పరిహారం జరుగుతుందని, ఇంటికి నరదృష్టి తొలగిపోతుందని నమ్ముతారు. త్రిమూర్తులు, సకల దేవతలు ఉసిరి చెట్టులో కొలువై ఉంటారని విశ్వసిస్తారు. ప్రధానంగా దశమి, ఏకాదశి, పౌర్ణమి తిథుల్లో, సోమవారం నాడు ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించడం ఆనవాయితీ. ఇది శ్రీమహావిష్ణువుకు, లక్ష్మీదేవికి ప్రీతికరమని పురాణాలు చెబుతున్నాయి. ఉసిరికి హిందూ ధర్మంలో ప్రత్యేక స్థానం ఉంది. కార్తిక మాసంలో దీని స్థానం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. స్నానం, దానం, దీపం, భోజనం.. ఇలా అన్నిటిలోనూ ఉసిరిని మన పూర్వులు చేర్చారు. ముఖ్యంగా కార్తిక పౌర్ణమినాడు ఉసిరి చెట్టు దగ్గర దీపం పెట్టి, ఉసిరికి సంబంధించిన ఇరవై ఒక్క నామాలను చదువుతారు. దీపావళి తరువాత ఎనిమిది రోజుల పాటు 'ఉసిరి నవమి' వ్రతాన్ని పాటిస్తారు. తొమ్మిదో రోజును 'అక్షయ నవమి' అంటారు. ఆ రోజు ఉపవాసం ఉంటారు. ఉసిరి చెట్టును విష్ణు స్వరూపంగా పూజిస్తారు. అనంతరం ఆ చెట్టు కింద కూర్చొని భోజనం చేస్తారు. ఇలా చేయడం వల్ల అన్ని రకాల పాపాలు, వ్యాధులు పోతాయనేది విశ్వాసం.

• సి.ఎస్.మూర్తి, 8328143489

కార్తిక మాసం

ఎప్పటినుంచో ఒక మాట ప్రసిద్ధిలోకి వచ్చింది...
శివుడికి ఇష్టమైన మాసం కార్తికం,
విష్ణువుకు ప్రీతికరమైనది మార్గశిరం అని.
పైపై దృష్టితో చూసేవాళ్ళు అన్న మాటలు ఇవి.
వాస్తవానికి ఇది శివకేశవులు ఇద్దరికీ
సంబంధించిన మాసం. ఎందుకంటే
వారిద్దరికీ ఎలాంటి భేదం లేదు, ఉండదు.

కార్తికం... ఇద్దరికీ ఇష్టమే!



కార్తిక మాసంలో మొట్టమొదటి రోజున 'గోక్రీడనం' అనే ఉత్సవం జరుగుతుంది. ఆ రోజున యజమానులు తమ ఆవులను ఏ చెరువు దగ్గరకో తీసుకువెళ్తారు. ఎండుగడ్డితో వాటిని చక్కగా తోమి, స్నానాలు చేయిస్తారు. పసుపు కుంకుమలతో అలంకరించి, మెడలో పూలమాలలు వేసి, పృష్ఠభాగం మీద కూడా పసుపు కుంకుమలను అద్దుతారు. వాటికి ప్రదక్షిణలు చేస్తారు. శ్రీమహావిష్ణువు కూడా కృష్ణావతారంలో గోపాలకునిగా ఉంటూ.. గోవులకు ఎనలేని సేవ చేశాడు. ఒక మడుగును ఆక్రమించుకున్న కాళీయుడు అనే పెను సర్పాన్ని పారద్రోలాడు. ఆ మడుగును గోవుల స్నానపానాదులకు వీలుగా మార్చాడు. అందుకే కార్తిక మాసంలోని ఎనిమిదో రోజున 'గోష్టాష్టమి' లేదా 'గోపాష్టమి' అనే పేరుతో ఉత్సవం నిర్వహిస్తారు. శివునికి ప్రీతిపాత్రమని అనుకొనే ఈ మాసంలో... ఏకాదశి తిథినాడు యోగ నిద్ర నుంచి శ్రీహరి మేలుకుంటాడు. 'ఉత్థాన ఏకాదశి' ఉత్సవాన్ని చేయించుకుంటాడు. ఆ మరునాడు... 'క్షీరాబ్ధి ద్వాదశి' పేరిట తన మామగారి ఇల్లు అయిన పాల సముద్రంలో, శేషునిపై పరుండి... తనవారందరికీ దర్శనం ఇస్తున్నాడు. మరో రెండు రోజుల తరువాత... 'వైకుంఠ చతుర్దశి' రోజున... మొత్తం దేవలోకంలోని వారందరికీ తన దర్శనాన్ని అనుగ్రహిస్తున్నాడు.

ఇల్లరికపు అల్లుళ్ళు

శివకేశవులు ఇద్దరూ శంఖాలను ధరిస్తారు (వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ...), ఒకరు నిరంతరం శరీరం నిండా పాముల్ని ధరించి కనిపిస్తూ ఉంటే, మరొకరు ఆదిశేషుడు అనే పెద్ద సర్పాన్ని శయ్యగా చేసుకొని పవళిస్తూ... అక్కడి నుంచే దర్శనం ఇస్తూ ఉంటాడు. శివుడు తన మామగారి ఇల్లయిన హిమాలయంపై తన నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటే, శ్రీమహాలక్ష్మి పుట్టినిల్లయిన పాలసముద్రాన్ని తన నివాసంగా శ్రీహరి మార్చుకున్నాడు. ఇద్దరూ ఉండేది మామగార్ల ఇళ్ళలోనే.. అంటే ఇల్లరికమే! శివుడు 'పినాకం' అనే వింటిని ధరిస్తే (పినాకపాణి), శ్రీహరి 'శార్ఙ్గ'మనే వింటిని (శార్ఙ్గధన్వా) ధరించి ఉంటాడు. శివుడు తన జటాజూటాన్ని పాదాలవరకూ ధరించి ఉంటే... రామావతారంలో శ్రీహరి దండకారణ్యానికి వెళ్ళే సందర్భంలో జటలను పెంచి, చివరి వరకూ అలాగే ఉన్నాడు (చీర అజిన జటాధారీ). శివుడు ఏనుగు చర్మాన్ని రాత్రివేళ, పులి చర్మాన్ని పగటిపూటా ధరిస్తాడు. శ్రీహరి రామావతారంలో పూర్తిగా ముతక నార వస్త్రాలను (వసనం చర్మ చ) ధరించాడు. శివుడు తన అర్ధ భాగాన్ని భార్యకు ఇచ్చి 'అర్ధనారీశ్వరుడు' అని అనిపించుకంటే, శ్రీహరి తన వక్షస్థలాన్ని లక్ష్మీ దేవికి స్థానంగా ఇచ్చాడు. ఆమె నిరంతరం అక్కడ కూర్చోగా, కూర్చోగా ఆ ప్రదేశంలో ఒక ఆనవాలు ఏర్పడింది అదే 'శ్రీ-వత్స-అంకం'. అందుకే ఆయనను 'శ్రీవత్సాంకుడు' అని కీర్తిస్తారు.

ఒకటే పేరు...

వారు వేరువేరుగా రాక్షసులను వధించారు. ఇద్దరూ కలిసి త్రిపురుడనే రాక్షసుణ్ణి చంపడం కోసం... ఒకరు (శివుడు) ధనువు కాగా, మరొకరు (శ్రీహరి) దానిలో తొడిగే బాణం అయ్యారు. ఆ ఇరువురికీ తోడుగా అగ్నిదేవుడు ఆ బాణం చివర ఉండే ములికిగా మారాడు. అగ్నిదేవుడు వారిద్దరికీ కుడికన్నే కదా! శివకేశవులకు భేదమే ఉన్నట్టయితే... వారిద్దరికీ కలిపి ఒకే పేరు ఉండడం కుదురుతుందా? హరికీ, హరుడికీ కలిపి ఉన్న పేరు 'వృషాకపి' (హర విష్ణూ వృషాకపీ). సరే... వారిద్దరూ అన్యోన్యంగా కనిపించవచ్చేమో కానీ... విభేదాలే ఉంటే వారి భార్యలు కలిసిమెలసి ఉండడం సాధ్యమేనా? కాదు కదా! ఆ ఇద్దరికీ (లక్ష్మీ పార్వతులకు) కలిపి 'వృషకపాయి' అనే పేరు ఉంది. ఇలా ఇద్దరి మధ్యా ఎన్నో కనిపిస్తాయి. ఇక శివకేశవ భేదం ఎక్కడుంది?

• డాక్టర్ పైలవరపు శ్రీనివాసరావు
9866700425

సకల ఆత్మల పండుగ

దైవమార్గం



క్రైస్తవులలోని క్యాథలిక్‌లు ప్రతి సంవత్సరం నవంబరు రెండో తేదీని 'సకల ఆత్మల పండుగ'గా పాటిస్తారు. తమ కుటుంబాలలో మరణించిన వ్యక్తుల ఆత్మ శాంతి కోసం ఆ రోజు పూజలు చేయిస్తారు. తమ ఆత్మీయుల సమాధుల దగ్గరకు వెళ్ళి, వాళ్ళకు దైవానుగ్రహం లభించాలని, మోక్షాన్ని పొందాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు జరిపిస్తారు. ఈ రోజును 'సమాధుల పండుగ' అని కూడా అంటారు. మృత్యువు, నిత్య జీవం తదితర అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయి.

చినిగి పోయిన వస్త్రాల మాదిరిగా ఆత్మను ధరించిన ఈ శరీరాలు కూడా భ్రష్టమైపోతాయనీ, పచ్చని చెట్ల నుంచి ఆకులు రాలినట్టు జీవులకు అంతిమంగా మరణం తప్పదనీ పవిత్ర గ్రంథమైన బైబిల్ (సీరా- 14:17) బోధిస్తోంది. "నా జీవనమార్గం అంతా నల్లటి మేఘాలతో ఆవరించి ఉంది. మరణ చిహ్నమైన శూన్యాన్ని అయిపోయాను. మృత్యు సంకేతంగా అదృశ్యం అయిపోయాను" అంటాడు తోబి అనే భక్తుడు.

పాపం వల్ల వచ్చే చీకటి నాకు వద్దని సొలోమాన్ రాజు చెప్పాడు. అందుకే.. మనిషి తన జీవిత కాలంలో మనిషిగా బతకాలి. దేవుడు చెప్పినవాటిని తుచా తప్పకుండా ఆచరించాలి. ముఖ్యంగా తన తోటి మనుషులను ఎటువంటి అరమరికలు లేకుండా ప్రేమించాలి. అటువంటి పనుల ద్వారా ఇక్కడ, పరలోకంలో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకోవాలి.

పాపభూయిష్టమైన జీవితం మరణానికి కారణమని, మరణ సూచనలు పాప భీతి వల్ల మనకు ముందే తెలుస్తాయనీ బైబిలు చెబుతోంది. "దురాశ గర్భాన్ని ధరించి పాపాన్ని కంటుంది, పాపం పరిపక్వమై మరణాన్ని కంటుంది" అంటాడు యాకోబు. ప్రేమమయుడైన దేవుడు అంతిమంగా తన బిడ్డలను తన చెంతకు పిలుచుకుంటాడు. దానికోసం మానవులు చేయవలసిన మంచి పనులు ఉన్నాయి. మనిషి శరీరం దాని మూల రూపమైన మట్టిలో కలిసిపోయినా... అందులోని ఆత్మ దైవాన్ని చేరుకుంటుందని (ప్రసంగి/ ఉపదేశి) బైబిల్ స్పష్టం చేస్తోంది. మళ్ళీ మళ్ళీ తప్పులు చేయకూడదని హెచ్చరిస్తూ... మానవాళిని మేలుకొలుపుతోంది. తెలిసో, తెలియకో తమ ఆత్మీయులు తప్పులు చేసినట్టయితే... ఆత్మల పండుగ రోజున తాము చేసే ప్రార్థనలు వారిని దైవ సన్నిధికి చేరుస్తాయనే విశ్వాసం ఉంది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

అష్టభుజాలతో ఆదిదేవుడు



'నిరాకారో మహేశ్వరః' అంటారు. ఈశ్వరుడికి ఆకారం లేదని చెబుతారు. కేదారేశ్వరుడి నుంచి రామేశ్వరుడి వరకు ఏ జ్యోతిర్లింగాన్ని దర్శించినా, కాళహస్తీశ్వరుడి నుంచి జంబుకేశ్వరుడి వరకు ఏ పంచభూతేశ్వరుడిని చూసినా, అమరేశ్వరుడి నుంచి భీమేశ్వరుడి వరకు ఏ పంచారామ క్షేత్రానికి వెళ్లినా కనిపించేది ఆ మహాదేవుడి లింగ రూపమే. కానీ, ఆదిదేవుడు సాకార రూపంలో కొలువైన ప్రదేశం... నెల్లూరులోని మహామృత్యుంజయ క్షేత్రం. ఇక్కడ ఆ సర్వేశ్వరుడు సాకార, నిరాకార రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు.

చిన్న ఆలయంగా మొదలై...

ఆమంచర్ల శివశంకర శర్మ (శంకరయ్య స్వామి) పరమ శివ భక్తుడు. అనారోగ్యం, అల్పాయుష్షు, అకాల మరణం లాంటి వాటితో బాధపడుతున్న వారికి ఆది వైద్యుడైన ఆ ముక్కంటి అనుగ్రహం ఉండాలని ఆశించారు. మహా మృత్యుంజయేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించారు. 2007లో తాత్కాలికమైన చిన్న ఆలయం ఏర్పాటు చేసి... నిత్యం రుద్రాభిషేకము, పూజలు జరిపేవారు. ఏటా ఉత్సవాలు నిర్వహించేవారు. తదనంతరం అప్పటి కంచి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి, కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతి స్వామి ఆశీస్సులతో ప్రధాన ఆలయ నిర్మాణానికి 2008లో పునాది వేశారు. ఎందరో దాతలు, భక్తుల సహకారంతో 2020 నాటికి ఆలయ నిర్మాణం పూర్తయింది ఆదే ఏడాది నవంబర్‌లో ప్రతిష్ఠ జరుపుకొంది.

ఆలయ దర్శనం

స్వహస్తాలతో అభిషేకం

మహా మృత్యుంజయేశ్వర స్వామి వారికి నిత్యం రుద్రాభిషేకం, ప్రతి నెలా శుక్ల, కృష్ణ పక్షాలలో త్రయోదశి నాడు ప్రదోష కాల అభిషేకాలు జరుగుతాయి. ప్రతి మాస శివరాత్రి రోజున రుద్ర, మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తారు. అమ్మవార్లు ఇద్దరికీ ప్రతి రోజూ శ్రీచక్ర కుంకుమార్చన, ప్రతి శుక్రవారం విశేష అభిషేకాలు జరుగుతాయి. ప్రతి శుక్ల పక్ష చతుర్దశి రోజున రుద్ర సహిత చండీ హోమం జరుపుతారు. ఏటా మాఘ మాసంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు, కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తారు. ఆ ఆలయంలో భక్తులు స్వహస్తాలతో స్వామి వారిని అభిషేకించే అవకాశం ఉంది.

ఎలా చేరుకోవాలి?: నెల్లూరు నగరంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ ప్రారంభంలో ఈ ఆలయం ఉంది. అది జాతీయ రహదారి నుంచి కనుపర్తిపాడు మీదుగా రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆలయం వరకు ఆటో, బస్సు సౌకర్యాలు ఉన్నాయి.

మహా మృత్యుంజయేశ్వర స్వామి, ఆదిపరాశక్తి, మహాకాళి అమ్మవార్లను నూతన ఆలయంలో ప్రతిష్ఠించారు. లక్ష్మీ గణపతి, బాలసుబ్రహ్మణ్యేశ్వరుడు, మేధా దక్షిణామూర్తి స్వామి సన్నిధులు, నాగదేవత సహిత నాగేశ్వర స్వామి మందిరం కూడా ఉన్నాయి.

ఆరోగ్య, ఆయుఃప్రదాత

ఈ క్షేత్రంలో మహా మృత్యుంజయేశ్వర స్వామి అష్టభుజాలతో, వ్యాఘ్ర చర్మంపై యోగ ముద్రలో ఆసీనుడై, నాలుగు చేతులతో అమృత కలశాలను ధరించి, తనను తానే అభిషేకించుకుంటూ దర్శనమిస్తారు. మరో రెండు హస్తాలతో జపమాలను, శంఖాన్ని ధరించి ఉంటారు. అలాగే ఆదిపరాశక్తి, కాళికాదేవి కూడా ఎనిమిది చేతులతో పూజలు అందుకుంటున్నారు. ఇక్కడ కాళీదేవి ప్రసన్న వదనంతో, చిరు మందహాసంతో కనిపిస్తుంది. ముఖ్యంగా ఆరోగ్యాన్ని, ఆయుష్షును ప్రసాదించే క్షేత్రంగా పేరు పొందిన ఈ మహా మృత్యుంజయేశ్వర స్వామి ఆలయాన్ని శీఘ్ర వివాహం, సంతాన ప్రాప్తి, మృత్యుగండ దోష పరిహారం నిమిత్తం ఎక్కువ మంది భక్తులు దర్శిస్తారు.

• శ్రీకంఠం రమణయ్య

సహజయోగ

వన సమారాధన... ప్రకృతి ఆరాధన

సహజమైన సంపదకు అసలైన అర్థం ఏమిటో తెలుసుకోవడంతో పాటు ఆ సంపదను మనం పూర్తిగా అనుభవించడం కోసం పూర్వీకులు అనేక ఆచారాలను, సంప్రదాయాలను ఏర్పరిచారు. అవి మనకు దైనందిన జీవితంలో అలవడేలా చూశారు. ఆ విధంగా ఏర్పాటుచేసినవే కార్తిక మాసంలోని వనభోజనాలు. అనుకూలమైన వనంలో బంధుమిత్రుల కలయిక, అక్కడే వంటలు, ఆటపాటలు, భోజనాలు. ఒకవైపు ఆధ్యాత్మిక వాతావరణం, మరోవైపు ఆహ్లాదకరమైన సామూహిక ఆనందం. కార్తిక మాసంలో వన సమారాధనలు అంటే మనకు గుర్తొచ్చేవి ఇవే. దీనిలో ఇమిడి ఉన్న ఆధ్యాత్మిక ప్రయోజనాల గురించి శ్రీమాతాజీ నిర్మలాదేవి వివిధ సందర్భాల్లో వివరించారు.



మన ఋషులు, మునులు ఏర్పాటు చేసిన సంప్రదాయాలన్నీ మన సూక్ష్మ శరీరంలోని కుండలినీ జాగృతి కోసం చక్రనాడుల శుద్ధి కోసం ఉద్దేశించినవే. ఎందరో మహనీయులు జన్మించి, తమ పాదస్పర్శతో చైతన్యపరచిన, పునీతం చేసిన భూమి మనది. అలాంటి భూమిని మనం తగిన విధంగా గౌరవిస్తున్నామా? భూమాతతో అనుసంధానమై ఉంటున్నామా? అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలి. దీనికి వనభోజనాలు చక్కటి సమాధానం అందిస్తాయి. ప్రకృతితో మమేకం కావడంతో పాటు... సామూహికంగా అందరూ కలిసి ఆనందించడానికి దోహదం చేస్తాయి. ఈ మాసంలో ఉసిరి చెట్టు కింద వనభోజనాలు చేస్తారు. ఇలా ఉసిరికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం వెనుక ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. ఈ నెల నుంచి శీతాకాలం మొదలవుతుంది. సీజనల్ వ్యాధులతో పాటు దగ్గు, జలుబు లాంటివి వచ్చే ప్రమాదం ఉంది. ఈ నెలలో ఉసిరి తినడం ద్వారా, లేక ఉసిరి చెట్టు నీడన గడపడం వల్ల ఆ దోషాలను నివారించుకోవచ్చు. "సకల మానవాళిని రక్షించే, వృద్ధాప్యాన్ని దరిచేరనివ్వని ఔషధ మొక్కలలో ఉసిరికి ఉసిరే సాటి" అని చరక సంహిత పేర్కొంది.

సామూహిక జీవనం కోసం...

మానవ శరీరం పంచభూతాలైన భూమి, ఆకాశం, వాయువు, జలం, అగ్ని అనే అయిదు మూలకాలతో తయారవుతుంది. ఈ పంచభూతాల తత్త్వాలతోనే మన సూక్ష్మ శరీరంలోని ఆరు చక్రాలు రూపొందాయి. ఉదాహరణకు మన సూక్ష్మ శరీరంలోని మొదటి శక్తి కేంద్రం అయిన మూలాధార చక్రం భూతత్త్వంతో ఏర్పడుతుంది. ఆ శక్తి కేంద్రంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు... మనం భూమి మీద కూర్చొని, రెండు చేతులు భూమి మీద పెట్టి, సహజయోగ పద్ధతిలో ధ్యానం చేస్తే... ఆ సమస్య నుంచి విముక్తి పొందవచ్చు. ఈ విధంగా పంచభూతాత్మకమైన ప్రకృతి... మానవుల సూక్ష్మ శరీరంలోని శక్తికేంద్రాలను చైతన్యపరచి, ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ప్రసాదిస్తుంది. వనభోజనాల ద్వారా సమకూరే మరో ప్రయోజనం... మనలో సామూహిక జీవనం మరింత బలపడం. పరస్పరం కలిసి పనిచేయడం వల్ల ప్రేమపూరితమైన వాతావరణం ఏర్పడుతుంది. అక్కడ ఉన్న మొక్కలు, చెట్లు, పువ్వుల పేర్లను పిల్లలకు పరిచయం చేయడం వల్ల... ప్రకృతి మనకు అందిస్తున్న అపారమైన సంపద ఏమిటో వారు గ్రహిస్తారు.

అందరితో సత్సంబంధాలు

మన విశుద్ధ చక్రం ఆకాశతత్త్వాన్ని కలిగి ఉంటుంది. వన భోజనాల లాంటి సామూహిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు... ఆ చక్రం వృద్ధి చెంది, చక్కటి సంభాషణా చాతుర్యం అలవడుతుంది. అందరితో సత్సంబంధాలు పెంచుకోగలుగుతాం. మనలోపల ఉన్న ఆరు చక్రాలూ సహజమైన ప్రకృతిలో ఉన్న పంచభూత తత్త్వాల ద్వారా చాలా వేగంగా స్పందిస్తాయి. కాబట్టి ఏడాదికి ఒకసారైనా కార్తిక మాసంలో వన భోజనాల ద్వారానైనా ప్రకృతితో మమేకమై, ధ్యానంతో, భజనలతో, ఆటపాటలతో గడిపితే... మన సామాజిక జీవితం మరింత బలోపేతం అవుతుంది.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ




తెలుసుకుందాం

నిరాకారుడి సాకార రూపం

నిర్గుణుడైన భగవంతుడి సాకార దర్శనాన్ని అందించేవి విగ్రహాలు. విగ్రహం అనే పదానికి ... 'వి' అంటే 'విశేషం', 'గ్రహం' అంటే 'చోటు'.. అంటే "భగవంతుడు విశేషంగా ఉండే చోటు" అనే అర్థం ఉంది. దాని ద్వారా భగవంతుణ్ణి రూపగుణాతిశయాలు ఉన్న సగుణ స్వరూపుడిగా మనసులో ఉంచుకొని ధ్యానించడం సులభం అవుతుంది. సాధారణ ప్రజలు భగవంతుణ్ణి విగ్రహ రూపంలోనే దర్శించుకుంటారు. దీనికి పెద్దగా వేదాంతం, తత్త్వం, జ్ఞానం లాంటివి ఏవీ అవసరం లేదు. కేవలం భక్తి భావం ఉంటే చాలు.


అయిదు రూపాలు...

దేవుని ప్రతిరూపమైన విగ్రహ రూపాల్లో... మనకు కనిపించేవి అయిదు రకాలుగా ఉన్నాయి. అవి: స్వయంభూ, దైవిక, ఆర్ష, మానుష, అసుర. తనకుతానుగా వెలసిన విగ్రహాన్ని 'స్వయంభూ' అంటారు. బ్రహ్మ, ఇంద్రుడు, శ్రీరాముడు, ఇతర దేవతలు పూజించిన మూర్తిని 'దైవికం' అంటారు. మహర్షులు పూజించిన విగ్రహాలు 'ఆర్షములు'గా ప్రసిద్ధి పొందాయి. మానవులు ప్రతిష్ఠించినవాటిని 'మానుషాలు' అనీ, పురాణాల ప్రకారం అసురులు ప్రతిష్ఠించినవాటిని 'అసురమూర్తులు' అనీ పిలుస్తారు.



విగ్రహ భేదాలు...: విగ్రహాలను వాటి భంగిమ, ముఖ భావం, లక్షణాలను బట్టి నాలుగు రకాలుగా విభజించారు. అవి: సౌమ్య విగ్రహాలు, భోగ విగ్రహాలు, యోగ విగ్రహాలు, ఉగ్ర విగ్రహాలు.


సౌమ్య విగ్రహాలు: రాజరాజేశ్వరి, లక్ష్మి, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, అన్నపూర్ణ తదితర అభయ రూపులైన దేవతల విగ్రహాల ముఖంలో శాంత భావం ఉంటుంది. వాటిని 'సౌమ్య విగ్రహాలు' అంటారు. ఈ దేవతలను గ్రామం, నగరం తదితర చోట్ల ఎక్కడైనా ప్రతిష్ఠించి, పూజించుకోవచ్చు.



భోగ విగ్రహాలు: కూర్చొని ఉన్న, నిలబడి ఉన్న, దేవేరులతో కూడి ఉన్న దైవాల విగ్రహాలు. ఉదాహరణకు లక్ష్మీ నారాయణులు, ఉమామహేశ్వర స్వామి, సీతారాములు, రాధాకృష్ణులు తదితరుల విగ్రహాలు. సౌమ్య, భోగ మూర్తుల విగ్రహాలను జనావాసాలకు దగ్గరగా నిర్మించిన దేవాలయాలలో ప్రతిష్ఠించవచ్చు.



యోగ విగ్రహాలు: తపస్సు చేస్తున్న భంగిమలో ఉన్న విగ్రహాలు. ఉదాహరణకు యోగ నరసింహ స్వామి, యోగ దక్షిణామూర్తి, అయ్యప్పస్వామి తదితర దైవాల యోగ మూర్తులను అరణ్యాలలో, కొండలపైన, గుహలలో ప్రతిష్ఠించడం కనిపిస్తుంది. తపస్సు చేసుకోవడానికి అనువైనవిగా భావించే ప్రదేశాలలోనే ఈ యోగ విగ్రహాలను, ఆలయాలను నిర్మిస్తూ ఉంటారు.



ఉగ్ర విగ్రహాలు: రౌద్రభావం కలిగిన ముఖంతో, ఉగ్ర భంగిమలో ఉన్న విగ్రహాలు. ఉదాహరణకు ఉగ్ర నరసింహస్వామి, వీరభద్రస్వామి, భైరవమూర్తి, కాళికాదేవి, భైరవి, దుర్గ, చాముండేశ్వరి లాంటి దైవాలు. సౌమ్య దేవతల ప్రతిష్ఠకు ఉత్తరాయణం, ఉగ్ర దేవతల ప్రతిష్ఠకు దక్షిణాయనం మంచివని ఆగమాలు చెప్పాయి.

• దగ్గుపాటి నాగవరప్రసాద్, స్థపతి, 9440525788

చాంపియన్‌ను కొట్టేసి

ఫైనల్ బెర్త్ పట్టేసి..

అజేయ ఆస్ట్రేలియాకు సెమీస్‌లో చెక్



● జెమీమా శతకమోత ● విజృంభించిన హర్మన్
● దక్షిణాఫ్రికాతో భారత్ టైటిల్ పోరు ● మహిళల వన్డే వరల్డ్‌కప్





జెమీమా (134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్)

నవీ ముంబై: వన్డే వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన భారత మహిళల జట్టు మూడోసారి ఫైనల్లోకి అడుగు పెట్టింది. జెమీమా రోడ్రిగ్స్ (134 బంతుల్లో 14 ఫోర్లతో 127 నాటౌట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 89) అదరగొట్టడంతో.. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన రెండో సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియాను భారత్ 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తొలుత ఆస్ట్రేలియా 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ఫోబీ లిచ్‌ఫీల్డ్ (119), ఎలీస్ పెర్రీ (77), ఆష్లే గార్డ్‌నర్ (63) శ్రమ వృథా అయింది. శ్రీచరణి, దీప్తి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో భారత్ 48.3 ఓవర్లలో 341/5 స్కోరు చేసి గెలిచింది. రిచా ఘోష్ (26) దూకుడుగా ఆడింది. కిమ్ గార్త్, సదర్లాండ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఓపెనర్‌గా షఫాలీని ఎంపిక చేయగా.. హర్లీన్ డియోల్ స్థానంలో అమన్‌జోత్ కౌర్ టీమ్‌లోకి వచ్చింది. జెమీమా ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచింది. కాగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరుగుతుంది.

అందోళనకు గురైనా.. : భారీ ఛేదనలో జెమీమా జట్టును ముందుండి నడిపించింది. కెప్టెన్ హర్మన్‌తో కలిసి మూడో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రోడ్రిగ్స్.. దీప్తి శర్మ (24), రిచా, అమన్‌జోత్ కౌర్ (15 నాటౌట్)తో కలసి జట్టును విజయ తీరాలకు చేర్చింది. ఓపెనర్ షఫాలీ వర్మ (10) స్వల్ప స్కోరుకే వెనుదిరిగింది. అయితే, మరో ఓపెనర్ స్మృతి మంధాన (24), వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రెండో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, లెగ్‌సైడ్‌లో వెళ్తున్న బంతిని కదిలించి మరీ మంధాన అవుట్ కావడంతో భారత్ 59/2తో నిలిచింది. అయితే, రోడ్రిగ్స్‌కు కెప్టెన్ హర్మన్ జత కావడంతో స్కోరు ఊపందుకొంది. స్ట్రయిక్ రొటేట్ చేస్తూనే వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ రన్‌రేట్‌ను నియంత్రణలో ఉంచారు. ఈ క్రమంలో జెమీమా అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. ఆ తర్వాత కౌర్ జోరందుకొంది. 29వ ఓవర్‌లో సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న హర్మన్ ఆ తర్వాత రెండు భారీ సిక్స్‌లతో దూకుడు పెంచింది. దీంతో 32వ ఓవర్‌లో టీమ్ స్కోరు 200 మార్క్ దాటింది. ఈ క్రమంలో వరుస బౌండ్రీలతో విరుచుకుపడుతున్న కౌర్‌ను సదర్లాండ్ అవుట్ చేసింది. ఈ దశలో దీప్తితో కలసి జెమీమా జట్టును గెలిపించే బాధ్యత భుజాన వేసుకొంది. కానీ, చివరి 10 ఓవర్లలో 82 పరుగులు కావల్సి ఉండగా.. దీప్తి రనౌట్ అయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రిచా అటాకింగ్ ఆటతో ఆసీస్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం చేసింది. మరోవైపు బౌండ్రీతో సెంచరీ పూర్తి చేసుకొన్న రోడ్రిగ్స్.. సదర్లాండ్ బౌలింగ్‌లో మెక్‌గ్రాత్ క్యాచ్ చేజార్చడంతో బతికిపోయింది. 45వ ఓవర్‌లో గార్డ్‌నర్ బౌలింగ్‌లో రిచా 6,4తో జోరు చూపడంతో.. సమీకరణం 34 బంతుల్లో 30 పరుగులకు దిగివచ్చింది. కీలక సమయంలో రిచాను అవుట్ చేసిన సదర్లాండ్ ఉత్కంఠ రేపింది. కానీ, అమన్‌జోత్, జెమీమా చెరో రెండు బౌండ్రీలతో మోతెక్కించడంతో.. భారత్ 9 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది.

బ్రేకులేసిన చరణి..: ఓపెనర్ లిచ్‌ఫీల్డ్, పెర్రీ రెండో వికెట్‌కు 155 పరుగుల దూకుడైన భాగస్వామ్యంతో ఆసీస్ భారీ స్కోరు చేసింది. ఒకదశలో స్కోరు 400 మార్క్ దాటేలా కనిపించింది. కానీ, చివరి 16.1 ఓవర్లలో 118 పరుగులకు 8 వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు ఆసీస్ జోరుకు కొంతమేర బ్రేకులు వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ స్వల్ప స్కోరుకే కెప్టెన్ హీలీ (5) వికెట్ కోల్పోయింది. కానీ, ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. లిచ్‌ఫీల్డ్, పెర్రీ క్రీజులో నిలదొక్కుకోవడంతో పరుగుల వరద పారింది. ముఖ్యంగా లిచ్‌ఫీల్డ్ గతితప్పిన భారత బౌలింగ్‌ను ఉతికి ఆరేసింది. ఫీల్డింగ్ కూడా పేలవంగా ఉండడంతో ఫోబి స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసింది. ఆమెను నియంత్రించడానికి హర్మన్‌ప్రీత్ బౌలర్లను మార్చి ప్రయోగించిన ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో శతకం పూర్తి చేసుకొన్న లిచ్‌ఫీల్డ్‌ను అమన్‌జోత్ బౌల్డ్ చేసి జట్టుకు ఊరటనిచ్చింది. ఆ తర్వాత బెత్ మూనీ (24), సదర్లాండ్ (3)ను చరణి అవుట్ చేయడంతో స్కోరు వేగం మందగించింది. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న పెర్రీని రాధ బౌల్డ్ చేసింది. కానీ, డెత్ ఓవర్లలో గార్డ్‌నర్ ఎడాపెడా షాట్లతో చెలరేగడంతో ఆసీస్ 330కి పైగా స్కోరు సాధించింది.



కెప్టెన్ హర్మన్



ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (119)

3

మహిళల వన్డేల్లో 300 పైగా స్కోరును ఛేదించడం ఇది మూడోసారి. ఇదే టోర్నీలో భారత్‌తో మ్యాచ్‌లో 331 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఆసీస్ అధిగమించింది. ఇప్పుడు భారత్ 339 పరుగుల టార్గెట్‌ను ఛేదించి టాప్‌లో నిలిచింది. గతేడాది సౌతాఫ్రికాపై లంక 302 స్కోరు చేసి గెలిచింది.

ఆస్ట్రేలియా వరుస 15 వన్డేల విజయాలకు బ్రేక్

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా: హీలీ (బి) క్రాంతి 5, లిచ్‌ఫీల్డ్ (బి) అమన్‌జోత్ 119, పెర్రీ (బి) రాధ 77, బెత్ మూనీ (సి) జెమీమా (బి) చరణి 24, సదర్లాండ్ (సి అండ్ బి) చరణి 3, గార్డ్‌నర్ (రనౌట్/క్రాంతి) 63, మెక్‌గ్రాత్ (రనౌట్/జెమీమా) 12, కిమ్ గార్త్ (రనౌట్/అమన్‌జోత్) 17, కింగ్ (సి) రిచా (బి) దీప్తి 4, మోలినెక్స్ (బి) దీప్తి 0, మేగన్ షట్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 13; **మొత్తం: 49.5 ఓవర్లలో 338 ఆలౌట్;** వికెట్ల పతనం: 1-25, 2-180, 3-220, 4-228, 5-243, 6-265, 7-331, 8-336, 9-336; **బౌలింగ్:** రేణుక 8-0-39-0, క్రాంతి గౌడ్ 6-0-58-1, శ్రీచరణి 10-0-49-2, దీప్తి శర్మ 9.5-0-73-2, అమన్‌జోత్ 8-0-51-1, రాధ 8-0-66-1.

భారత్: షఫాలీ (ఎల్బీ) గార్త్ 10, మంధాన (సి) హీలీ (బి) గార్త్ 24, జెమీమా (నాటౌట్) 127, హర్మన్ (సి) గార్డ్‌నర్ (బి) సదర్లాండ్ 89, దీప్తి (రనౌట్/గార్త్) 24, రిచా (సి) గార్త్ (బి) సదర్లాండ్ 26, అమన్‌జోత్ (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 26; మొత్తం: 48.3 ఓవర్లలో 341/5; వికెట్ల పతనం:** 1-13, 2-59, 3-226, 4-264, 5-310; **బౌలింగ్:** మేగన్ షట్ 6-0-40-0, కిమ్ గార్త్ 7-0-46-2, గార్డ్‌నర్ 8-0-55-0, మోలినెక్స్ 6.3-0-44-0, సదర్లాండ్ 10-0-69-2, అలనా కింగ్ 9-0-58-0, తహిల 2-0-19-0.




మ. 1.45 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

మెల్‌బోర్న్‌లో మోతెక్కించేనా?

జోష్‌లో టీమిండియా ● ఆసీస్‌తో రెండో టీ20

మెల్‌బోర్న్: ఐదు టీ20ల సిరీస్‌లో ఆరంభ మ్యాచ్ వర్షంతో రద్దయిన వేళ.. శుక్రవారం భారత్-ఆస్ట్రేలియా జట్లు మరో పోరుకు సిద్ధమయ్యాయి. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగే ఈ రెండో టీ20లో నెగ్గి బోణీ చేసేందుకు ఇరుజట్లూ ఎదురుచూస్తున్నాయి. పొట్టి వరల్డ్‌కప్ విజేతగానే కాకుండా ఇటీవలి ఆసియాకప్ టీ20 టోర్నీని గెలిచిన భారత్ బుధవారం నాటి తొలి మ్యాచ్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. 9.4 ఓవర్ల ఆటే సాగినా 97/1 స్కోరుతో సరైన ట్రాక్‌లో ఉన్నట్టు కనిపించింది. కెప్టెన్ సూర్యకుమార్ 24 బంతుల్లోనే 39 రన్స్‌తో మునుపటి ఫామ్‌ను అందుకోవడంతో పాటు, హాజెల్‌వుడ్ ఓవర్‌లో ఏకంగా 125మీ. దూరం బాదిన సిక్సర్‌తో ఆసీస్‌ను బెదరగొట్టాడు. అటు ఓపెనర్ గిల్ మాత్రం క్రీజులో కుదురుకున్నాడు. మరో ఓపెనర్ అభిషేక్ కాన్‌బెర్రాలో విఫలమైనా.. ఎంసీజీలో చెలరేగాలనుకుంటున్నాడు. మిడిలార్డర్‌లో తిలక్, శాంసన్, దూబే కీలకం కానున్నారు. మరోవైపు ఐదుగురు బ్యాటర్లు, ముగ్గురు ఆల్‌రౌండర్లు, ముగ్గురు బౌలర్లతో తొలి మ్యాచ్ ఆడిన జట్టు నేటి మ్యాచ్‌లోనూ ఇదే కాంబినేషన్‌ను కొనసాగించవచ్చు. అదే జరిగితే పేసర్ అర్ష్‌దీప్ బెంచీకి పరిమితం కాక తప్పదు. అతనికన్నా హర్షిత్ మెరుగైన బ్యాటర్ కావడంతో కోచ్ గంభీర్ అతడి వైపే మొగ్గుచూపుతున్నాడు. అయితే కుల్దీప్, వరుణ్‌లలో ఒక్కరికే చాన్స్ కల్పిస్తే అర్ష్‌దీప్‌ను తీసుకోవచ్చు.

ఎదురుదాడే లక్ష్యంగా..: భారత్ తరహాలోనే ఆస్ట్రేలియా కూడా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగుతోంది. ఓపెనర్లు హెడ్, మార్ష్ మెరుపు ఆరంభాలతో భారీ స్కోరు అందుకోవాలనుకుంటోంది. ఆ తర్వాత ఇన్‌గ్లిస్, డేవిడ్, స్టొయినిస్ బ్యాట్లు ఝుళిపిస్తే భారత బౌలర్లకు కష్టమే. ఇక పేసర్ హాజెల్‌వుడ్‌కు ఈ సిరీస్‌లో ఇదే చివరి మ్యాచ్. రాబోయే యాషెస్ సిరీస్ కోసం అతడికి విశ్రాంతినివ్వనున్నారు. బార్ట్‌లెట్, ఎలిస్, స్పిన్నర్ కునేమన్ బౌలింగ్‌పై ఆధారపడి ఉంది.



తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, శాంసన్, దూబే, అక్షర్, హర్షిత్, కుల్దీప్, వరుణ్, బుమ్రా.

ఆసీస్: హెడ్, మార్ష్ (కెప్టెన్), ఇన్‌గ్లిస్, డేవిడ్, ఓవెన్, స్టొయినిస్, ఫిలిప్, బార్ట్‌లెట్, ఎలిస్, కునేమన్, హాజెల్‌వుడ్.

పిచ్, వాతావరణం

2022 టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత ఎంసీజీలో పొట్టి ఫార్మాట్‌లో జరుగుతున్న మొదటి మ్యాచ్ ఇది. బౌలర్లకు సహకరించే ఈ పిచ్‌పై సగటు స్కోరు 152. అయితే శుక్రవారం కూడా మెరుపులతో కూడిన వాతావరణం ఉండడంతో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

పసిడీలా!



క్యూ3లో 16 శాతం తగ్గిన బంగారం గిరాకీ

- ధరలు రికార్డు స్థాయికి పెరగడమే కారణం
- పెట్టుబడి డిమాండ్‌లో 20 శాతం వృద్ధి
- డబ్ల్యూజీసీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ధరలు రికార్డు స్థాయికి పెరగడంతో ఈ జూలై-సెప్టెంబరు త్రైమాసికం (క్యూ3)లో పసిడి గిరాకీ 16 శాతం తగ్గి 209.4 టన్నులకు పరిమితమైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) గురువారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాదిలో ఇదే కాలానికి డిమాండ్ 248.3 టన్నులుగా నమోదైంది. అయితే, అధిక ధరల కారణంగా ఈ క్యూ3లో బంగారం గిరాకీ విలువ వార్షిక ప్రాతిపదికన 23 శాతం పెరిగి రూ.2,03,240 కోట్లకు చేరిందని రిపోర్టు తెలిపింది. 2024లో ఇదే సమయానికిది రూ.1,65,380 కోట్లుగా ఉంది. డబ్ల్యూజీసీ నివేదికలో మరిన్ని విషయాలు..

- ఈ క్యూ3లో బంగారం నగల గిరాకీ వార్షిక ప్రాతిపదికన 31 శాతం తగ్గి 117.7 టన్నులకు పడిపోయింది. డిమాండ్ విలువ మాత్రం దాదాపు గత ఏడాది స్థాయిలోనే (రూ.1,14,270 కోట్లుగా) నమోదైంది.
- పసిడిలో పెట్టుబడుల డిమాండ్ పరిమాణం పరంగా 20 శాతం పెరిగి 91.6 టన్నులకు చేరుకోగా.. పెట్టుబడుల విలువ 74 శాతం పెరిగి రూ.88,970 కోట్లకు ఎగబాకింది.
- గడిచిన మూడు నెలల్లో దేశంలోకి బంగారం దిగుమతులు 37 శాతం తగ్గి 194.6 టన్నులకు పరిమితమైంది. గత ఏడాదిలో ఇదే సమయానికి 308.2 టన్నులు దిగుమతైంది. పాత బంగారం పునర్ వినియోగం కూడా 7 తగ్గి 21.8 టన్నులుగా నమోదైంది.

క్యూ3 సగటు ధర రూ.97,074

గడిచిన మూడు నెలలకు బంగారం సగటు ధర (దిగుమతి సుంకం, జీఎస్‌టీ మినహాయించి) రూ.97,074.9గా నమోదైంది. గత ఏడాదిలో ఇదే కాలానికి నమోదైన సగటు ధర రూ.66,614.1తో పోలిస్తే 46 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ సగటు రేటు 2,474.3 డాలర్ల నుంచి 3,456.5 డాలర్లకు పెరిగింది.

ఏడాది గిరాకీ 600-700 టన్నులు

ఈ సంవత్సరం మొత్తానికి పసడి గిరాకీ 600-700 టన్నుల స్థాయిలో నమోదు కావచ్చని డబ్ల్యూజీసీ అంచనా వేసింది. గడిచిన 9 నెలలకు (జనవరి-సెప్టెంబరు) డిమాండ్ 462.4 టన్నులుగా ఉంది.

ప్రపంచవ్యాప్త గిరాకీ 1.313 టన్నులు

ఈ జూలై-సెప్టెంబరు కాలానికి ప్రపంచవ్యాప్తంగా పసిడి డిమాండ్ రికార్డు స్థాయిలో 1,313 టన్నులకు పెరిగింది. ఆయా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు జోరుగా పసిడి కొనుగోలు చేయడం, ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఈ విలువైన లోహంలోకి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వచ్చి చేరడం ఇందుకు కారణం.

క్యూ4లో బలమైన గిరాకీ

దీర్ఘకాలంలో విలువ పెంచేదిగా బంగారంపై భారత వినియోగదారులకు ఉన్న నిబద్ధతను తాజా గణాంకాలు నొక్కి చెబుతున్నాయి. క్యూ3లో గిరాకీ పరిమాణం 16% తగ్గినా, విలువపరంగా 23% పెరగడాన్ని విస్మరించలేం. భారత వినియోగదారుల తలసరి ఆదాయంతో పాటు ఖర్చు పెట్టే స్తోమత కూడా క్రమంగా పెరుగుతోంది. దీపావళి సీజన్‌లో బంగారం విక్రయాలు భారీగా జరిగాయని విక్రేతల నుంచి సంకేతాలందుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కూడా ఉన్నందున నాలుగో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో బలమైన గిరాకీ నమోదు కానుందని ధీమాగా ఉన్నాం.

- సచిన్ జైన్, రీజనల్ సీఈఓ, డబ్ల్యూజీసీ ఇండియా

ఎంపిక చేసిన జియో 5జీ యూజర్లకు ఉచితంగా గూగుల్ ఏఐ ప్రో సేవలు

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ కృత్రిమ మేధ(ఏఐ) అనుబంధ విభాగమైన రిలయన్స్ ఇంటెలిజెన్స్ తాజాగా గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. తద్వారా రిలయన్స్ జియోకు చెందిన ఎంపిక చేసిన (18-25 ఏళ్లలోపు) 5జీ వినియోగదారులకు రూ.35,100 విలువైన ‘గూగుల్ ఏఐ ప్రో’ సేవలను 18 నెలల పాటు ఉచితంగా అందించనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం ప్రకటించింది. ఈ ఉచిత సేవల్లో భాగంగా గూగుల్ జెమినీ యాప్‌లో జెమినీ 2.5 ప్రో మోడల్ యాక్సెస్‌తో పాటు అన్‌లిమిటెడ్ చాట్స్, 2 టీబీ క్లౌడ్ స్టోరేజీ, వీఈఓ 3.1పై వీడియో జనరేషన్, నానో బనానా ద్వారా ఇమేజ్ జనరేషన్, అధ్యయనం, పరిశోధన కోసం నోట్‌బుక్ ఎల్ఎంకు విస్తృత యాక్సెస్ సహా ఇతర ఆధునిక ఏఐ టూల్స్‌ను వినియోగించుకునే అవకాశం అర్హులైన వినియోగదారులకు లభించనుంది.

తగ్గిన యూనియన్ బ్యాంక్ లాభం

ముంబై: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.4,249 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 10 శాతం క్షీణించింది. కీలక ఆదాయాలు, రికవరీలు తగ్గటం పనితీరుపై ప్రభావం చూపించాయని బ్యాంక్ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం 2.6 శాతం తగ్గి రూ.8,812 కోట్లకు చేరింది. అలాగే నికర వడ్డీ మార్జిన్ కూడా 2.90 శాతం నుంచి 2.6 శాతానికి క్షీణించింది.

బిజినెస్

మేఘా ఇంజనీరింగ్ చేతికి టీఏక్యూఏ నైవేలీ పవర్ ప్లాంట్

అబుదాబీ కంపెనీ నుంచి 100% వాటా కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్).. తమిళనాడులోని టీఏక్యూఏ నైవేలీ పవర్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్‌ను చేజిక్కించుకుంది. అబుదాబీ నేషనల్ ఎనర్జీ కంపెనీ పీజేఎస్‌సీ (టీఏక్యూఏ) నుంచి 100 శాతం వాటాలను అనుబంధ సంస్థ ఎంఈఐఎల్ ఎనర్జీ కొనుగోలు చేసిందని మేఘా ఇంజనీరింగ్ వెల్లడించింది. అయితే ఎంత మొత్తానికి ఈ వాటాను కొనుగోలు చేసిందనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. టీఏక్యూఏ నైవేలీ పవర్ ప్లాంట్ ప్రస్తుతం తమిళనాడులో 250 మెగావాట్ల సామర్థ్యం గల లిగ్నైట్ ఆధారిత విద్యుదుత్పత్తి ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థలకు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు టీఏక్యూఏ నైవేలీ ఇప్పటికే దీర్ఘకాలిక ఒప్పందాలు కూడా కుదుర్చుకుంది. ఇప్పటికే ఎంఈఐఎల్‌కు ఉన్న 5,200 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల పోర్టుఫోలియోను ఈ కొనుగోలుతో మరింతగా విస్తరించే అవకాశం లభిస్తుందని తెలిపింది. వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా ఇంధన రంగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించే అవకాశం లభించనుందని ఎంఈఐఎల్ గ్రూప్ సీఎఫ్ఓ సలీల్ కుమార్ మిశ్రా తెలిపారు. థర్మల్, హైడ్రో, పునరుత్పాదక ఇంధన వనరులన్నింటితో కూడిన సమతూకమైన, సుస్థిర పోర్టుఫోలియో అభివృద్ధి చేయాలన్నది తమ లక్ష్యమని మిశ్రా పేర్కొన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (వెక్ 100 గుడ్లు)

31వ తేదీ			
హైదరాబాద్	570	విజయవాడ	575
వరంగల్	572	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	120
వరంగల్	112	గుంటూరు	124
కరీంనగర్	112	ఒంగోలు	124
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	114
కర్నూలు	112	నెల్లూరు	119
విశాఖపట్నం	116	అనంతపురం	119
గోదావరి	120		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,20,490 ▼	1,10,450 ▼	1,65,000 ▲
విజయవాడ	1,23,200 ▼	1,16,000 ▼	1,51,200 ▲
విశాఖపట్నం	1,23,520 ▼	1,10,450 ▼	1,65,000 ▼
రాజమండ్రి	1,21,470 ▼	1,11,350 ▼	1,48,000 ▼
ప్రొద్దుటూరు	1,19,500 ▲	1,09,940 ▲	1,50,000 ▲
ముంబై	1,19,619 ▼	1,09,571 ▼	1,46,783 ▲

కెనరా బ్యాంక్ లాభం రూ.4,774 కోట్లు

క్యూ2లో 19 శాతం వృద్ధి

రూ.50 కోట్లతో అమరావతిలో ప్రాంతీయ కార్యాలయం

బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్.. సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను బ్యాంక్ నికర లాభం 19 శాతం వృద్ధి చెంది రూ.4,774 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.4,015 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో మొండి బకాయిలు గణనీయంగా తగ్గటం ఎంతగానో కలిసి వచ్చిందని బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు వెల్లడించారు. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా రూ.34,721 కోట్ల నుంచి రూ.38,598 కోట్లకు పెరిగిందన్నారు. ఈ కాలంలో బ్యాంక్ వడ్డీ ఆదాయం కూడా రూ.29,740 కోట్ల నుంచి రూ.31,544 కోట్లకు పెరగగా నికర వడ్డీ ఆదాయం మాత్రం రూ.9,315 కోట్ల నుంచి రూ.9,141 కోట్లకు తగ్గింది. బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 13.4 శాతం వృద్ధి చెంది రూ.15,27,922 కోట్లకు చేరుకున్నాయి. మొత్తం అడ్వాన్సులు కూడా 13.7 శాతం పెరిగి రూ.11,51,041 కోట్లకు చేరుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.75-2.8 శాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ తెలిపింది.

తగ్గిన మొండి బకాయిలు: సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 3.73 శాతం నుంచి 2.35 శాతానికి తగ్గగా నికర ఎన్‌పీఏలు కూడా 0.98 శాతం నుంచి 0.54 శాతానికి తగ్గినట్లు బ్యాంక్ పేర్కొంది. మరోవైపు మొండి పద్దుల కోసం చేసిన కేటాయింపులు రూ.2,587 కోట్ల నుంచి రూ.1,504 కోట్లకు తగ్గినట్లు తెలిపింది. అలాగే ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి (పీసీఆర్) 90.89 శాతం నుంచి 93.59 శాతానికి పెరిగిందని పేర్కొంది. కాగా వ్యాపార విస్తరణకు సంబంధించి బ్యాంక్ వద్ద ప్రస్తుతం సరిపడా నిధులు ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనపు నిధులను సమీకరించాల్సిన అవసరం లేదని బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు తెలిపారు.

అమరావతిలో రీజినల్ కార్యాలయం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కెనరా బ్యాంక్ రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సత్యనారాయణ రాజు వెల్లడించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటికే చర్చించినట్లు ఆయన చెప్పారు. అయితే మొంథా తుపాను కారణంగా భూమి కేటాయింపు వాయిదా పడిందన్నారు. రూ.50 కోట్లతో పూర్తి హంగులతో ఈ ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. రీజినల్ ఆఫీస్‌తో పాటు జోనల్ ఆఫీస్, రిటైల్, ఎంఎస్ఎంఈ విభాగాలకు సంబంధించి కార్యాలయాలు అనుబంధంగా ఉంటాయని రాజు తెలిపారు.

రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ 593 పాయింట్లు డౌన్

25,900 దిగువ స్థాయికి నిఫ్టీ

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 592.67 పాయింట్లు క్షీణించి 84,404.46 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 176.05 పాయింట్ల పతనమై 25,877.85 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోయాయి. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.472.38 లక్షల కోట్లకు పడిపోయింది.

దుగరాజపట్నంలో రూ.29,662 కోట్లతో పోర్ట్, షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటు

ఏపీ ప్రభుత్వంతో విశాఖ పోర్టు ఒప్పందం

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు రూ.39,216 కోట్ల విలువైన ప్రాజెక్టులకు అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకుంది. ముంబైలో ఈ నెల 28 నుంచి జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్-2025లో ఈ మేరకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు విశాఖ పోర్టు వెల్లడించింది. ఇందులో భాగంగా దుగరాజపట్నంలో మేజర్ పోర్టు కమ్ షిప్ బిల్డింగ్ అండ్ షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు కోసం రూ.29,662 కోట్ల విలువైన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసింది. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి లభించనుంది. అలాగే మెకాన్ ఇండియాతో మరో రూ.3,000 కోట్లకు ఒప్పందం చేసుకుంది. అదే విధంగా ఆధునిక స్టాక్ యార్డులు, రైల్వే సైడింగ్‌లు అభివృద్ధి చేస్తారు. హార్బర్ పార్కులో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులకు ఎన్‌బీసీసీతో మరో ఒప్పందం కుదుర్చుకుంది. కార్గో బెర్తుల మెకనైజేషన్, ఆధునికీకరణ, పర్యావరణానికి అనుకూలమైన సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుకోవడానికి హడ్కోతో రూ.478.38 కోట్లతో డీల్ కుదుర్చుకుంది. పోర్టు ప్రాంగణంలో అంతర్గత ఫ్లైఓవర్ల నిర్మాణానికి రైల్ వికాస్ లిమిటెడ్‌తో రూ.535 కోట్లకు మరొక ఒప్పందం చేసుకుంది. విశాఖపట్నం పోర్టు తరఫున డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబే ఆయా సంస్థలతో ఈ ఒప్పందాలను కుదుర్చుకున్నారు.

ఉద్యోగాల గేట్ వే.. 'నైపుణ్యం' పోర్టల్

- దేశ, విదేశీ ఉద్యోగాల సమాచారమిచ్చేలా అభివృద్ధి
- ప్రతి నెలా, ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు
- వాట్సాప్ ద్వారా ఉద్యోగావకాశాల సమాచారం
- యువత కోరుకున్న రంగంలో నైపుణ్య శిక్షణ
- నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- క్లస్టర్ల విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం: లోకేశ్


స్కిల్ డెవలప్‌మెంట్‌పై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, తదితరులు

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్.. ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా ఆ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఇక నుంచి ప్రతినెలా, ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని ఆదేశించారు. 2029 నాటికల్లా 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై సీఎం సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి లోకేశ్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ, 'యువతకు నైపుణ్య కల్పన కోసం దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలి. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే వారి ఉన్నత విద్యకు సహకరించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఏ లబ్ధీ పొందని నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరేలా నైపుణ్యం పోర్టల్‌ను తీర్చిదిద్దాలి. అభ్యర్థులు కోరుకునే ఉద్యోగం, ఉపాధి అవకాశాలను పొందేందుకు తగిన వివరాలను పోర్టల్‌లో పొందుపర్చాలి' అని సూచించారు.

విదేశీ భాషల్ని నేర్చుకునేలా శిక్షణ

'ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు, వర్సిటీలు, వివిధ విద్యాసంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించడం ద్వారా ఆయా విద్యా సంస్థలకు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలను తెలిసేలా చేయాలి. నైపుణ్య పరీక్షకు కూడా పోర్టల్‌లో అవకాశం కల్పించాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలను మరింత ఉన్నతీకరించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)తో అనుసంధానించాలి. విదేశాల్లో ఉద్యోగావకాశాలు సులభంగా పొందేందుకు వీలుగా ఆయా దేశాల స్థానిక భాషలను నేర్చుకునేలా శిక్షణ ఇవ్వాలి. ఏపీఎస్ఆర్టీ ద్వారా ఉద్యోగ సమాచారం పొందేలా చూడాలి. ఆపోర్టల్ ద్వారా యువత కోరుకున్న నైపుణ్య శిక్షణ, ప్రస్తుతమున్న సామర్థ్యాలను మెరుగుపరుచుకునేలా పునఃశిక్షణ, ఉత్తమ శిక్షణ అందించాలి' అని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జాబ్ మేళాల్లో 1.44 లక్షల మందికి ఉద్యోగాలు

రాష్ట్రంలో ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని సీఎం తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్‌లను రూపొందించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. వాట్సాప్ ద్వారా ఉద్యోగావకాశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. శిక్షణ అందించే రంగం, వేదిక, జాబ్ మేళాలు నిర్వహించే ప్రాంతం, ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే సమాచారం అందించేలా నైపుణ్యం పోర్టల్‌ను తీర్చిదిద్దామని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం 'నైపుణ్యం' పోర్టల్‌లో అందుబాటులో ఉందని చెప్పారు.

క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ: మంత్రి లోకేశ్

క్లస్టర్ల ఆధారంగా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ చెప్పారు. స్పేస్, ఆక్వా, క్వాంటమ్ తదితర రంగాల్లోని సంస్థలు, పరిశ్రమల్లోని ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్య శిక్షణను నిరుద్యోగ యువతకు అందించేలా కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరుల్ని అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేస్తున్నామని ముఖ్యమంత్రికి మంత్రి లోకేశ్ వివరించారు.

బడికి.. టీచర్లే లేటు!

కొద్ది మంది ప్రతిరోజూ ఆలస్యమే

- 9.30 తర్వాత వచ్చేవారిపై విద్యాశాఖ దృష్టి
- వంద పని దినాల హాజరు పరిశీలన

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సమయపాలన, క్రమశిక్షణ నేర్పించాల్సిన ఉపాధ్యాయులే పాఠశాలలకు ఆలస్యమవుతున్నారు. అందరూ కాకపోయినా ఇలా కొద్ది మంది మాత్రం ప్రతిరోజూ ఆలస్యంగానే విధులకు హాజరవుతున్నట్లు హాజరు గణాంకాలే తేటతెల్లం చేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం.. జూన్ 12న బడులు తెరుచుకున్నాయి. అక్టోబరు 28 వరకు వంద రోజులు పాఠశాలలు పనిచేశాయి. ఆ రోజుల్లో ఉపాధ్యాయుల హాజరును పాఠశాల విద్యాశాఖ పరిశీలించింది. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 3.30గంటలు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పనిచేస్తాయి. అన్ని పాఠశాలల్లోనూ ఉదయం 9గంటలలోపు టీచర్లంతా బడుల్లో ఉండాలి. తప్పని పరిస్థితుల్లో కొన్నిసార్లు ఆలస్యమైతే 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. కాగా, గ్రేస్ పీరియడ్ కూడా కాకుండా 9.30గంటల తర్వాత ఎంత మంది టీచర్లు బడులకు వస్తున్నారనేదానిపై పాఠశాల విద్యాశాఖ ఆరా తీసింది. వివిధ ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో 1,94,602 మంది టీచర్లు పనిచేస్తున్నారు. మొత్తం 100 రోజుల్లో... పది రోజుల్లోపు 1.84లక్షల మంది 9.30 తర్వాత హాజరు నమోదుచేశారు. 11 నుంచి 20 రోజుల పాటు 7060 మంది, 21 నుంచి 30 రోజుల పాటు 1776 మంది, 31 నుంచి 40 రోజుల పాటు 729 మంది, 41 నుంచి 50 రోజుల పాటు 388 మంది ఆలస్యంగా 9.30 తర్వాత హాజరయ్యారు. ఇక 51 నుంచి 60 రోజులపాటు 227 మంది, 61 నుంచి 70 రోజుల పాటు 134 మంది, 71 నుంచి 80 రోజుల పాటు 86 మంది, 81 నుంచి 90 రోజులపాటు 32 మంది, 91 నుంచి వంద రోజుల పాటు ఐదుగురు 9.30 తర్వాతే బడులకు వచ్చారు. ముఖ హాజరులో సాంకేతిక సమస్యలుంటాయనే ఉద్దేశంతో 9.10గంటలను కాకుండా 9.30గంటల తర్వాత హాజరునే ప్రామాణికంగా తీసుకుని పాఠశాల విద్యాశాఖ పరిశీలించింది. అరగంట తర్వాత కూడా వేల మంది టీచర్లు బడులకు హాజరుకావట్లేదని ముఖ హాజరులో తేలింది. వంద రోజుల్లో 15 రోజుల పాటు ఆలస్యంగా వచ్చారంటే ఏవైనా తప్పనిసరి కారణాలుంటాయని, కానీ 15రోజుల దాటి ఆలస్యం కావడం ఏంటనే దానిపై పాఠశాల విద్యాశాఖ దృష్టి పెట్టింది. కొందరు టీచర్లైతే ప్రతిరోజూ ఆలస్యంగానే విధులకు హాజరవుతున్నారు.





ఘనంగా నారా రోహిత్ - శిరీషల వివాహం

పెళ్లి పెద్దలుగా సీఎం చంద్రబాబు దంపతులు

ప్రముఖ నటుడు నారా రోహిత్, శిరీష లేళ్ల పెళ్లి గురువారం రాత్రి 10.35 గంటలకు అంగరంగ వైభవంగా జరిగింది. ఏపీ సీఎం, రోహిత్ పెదనాన్న చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి ఈ పెళ్లికి పెద్దలుగా వ్యవహరించారు. మంత్రి లోకేశ్ దంపతులు, సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దంపతులతోపాటు నందమూరి, నారా కుటుంబాలకు చెందిన బంధుమిత్రుల నడుమ పెళ్లివేడుక ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని అజీజ్ నగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

-అమరావతి, (ఆంధ్రజ్యోతి)



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న 'అఖండ 2: తాండవం' కోసం థమన్ అందిస్తున్న శక్తిమంతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను మరింత అద్భుతంగా మార్చేందుకు సర్వేపల్లి సిస్టర్స్ గాత్రాన్ని పాటల కోసం వాడుతున్నట్లు చిత్రబృందం తెలిపింది.

నిజం నేనే.. ఇజం నేనే



దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కిస్తోన్న పీరియాడికల్ డ్రామా 'కాంత'. స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫెరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్లపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. టీజర్, పాటలతో చిత్రంపై అంచనాలు పెంచిన మేకర్స్ తాజాగా లిరికల్ వీడియోను విడుదల చేశారు. నిజం నేనే..ఇజం నేనే..పడి పడి లేచే అలల తల పొగరుని..నేనే అంటూ సాగే ఝాను చంతర్ స్వర పర్చిన పాట అదిరి పోయింది. వింటేజ్ ఎలిమెంట్స్‌ను ఆధునిక రాప్ బీట్స్, పవర్‌ఫుల్ సౌండ్‌తో మేళవిస్తూ రూపొందించిన ఈ బాణీ ఎంతో ఆకట్టుకుంటోంది.



'ఝూమ్ షరాబీ..'

అజయ్ దేవ్‌గన్, రకుల్‌ప్రీత్ సింగ్ జంటగా నటించిన సినిమా 'దే దే ప్యార్ దే-2'. అన్షుల్ శర్మ తెరకెక్కించిన ఈ చిత్రం 'దే దే ప్యార్‌దే'కు సీక్వెల్‌గా వస్తోంది. లవ్ రంజన్, భూషణ్ కుమార్, అంకుర్ గార్గ్ నిర్మించారు. నవంబరు 14న విడుదల కానుంది. దాంతో ప్రచార హోరు పెంచిన మేకర్స్ తాజాగా 'ఝూమ్ షరాబీ' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. అజయ్ దేవ్‌గన్ తన మిత్రులతో కలిసి పబ్‌లో పాడే ఈ పాటలో రకుల్‌ప్రీత్ సింగ్ స్టెప్పులతో అదరగొట్టారు. గులాబీ వర్ణం చీరలో ఆమె గ్లామరస్‌గా కనిపించారు. ఈ పాటను హీరో, హీరోయిన్‌పై చిత్రీకరించినప్పటికీ ప్రత్యేక గీతాన్ని తలదన్నేలా ఉంది.

సందేశాలిచ్చే ధైర్యం చేయను


రాహుల్ రవీంద్రన్

'సినిమా చూసిన ప్రేక్షకులు మంచీ, చెడూ ఆలోచించుకుంటారనే నమ్మకం నాకుంది. అందుకే ఎవరికీ సందేశాలు ఇచ్చే ధైర్యం చేయను. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రంలో బలమైన అభిప్రాయాలు, తీవ్ర భావోద్వేగాలు ఉన్న ఓ ప్రేమ కథని వాస్తవిక కోణంలో చూపించే ప్రయత్నం చేశాం' అని వివరించారు దర్శకుడు రాహుల్ రవీంద్రన్. రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. నవంబరు 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ 'నేను కాలేజీలో ఉన్నప్పుడు చూసిన ఓ సంఘటన ఆధారంగా ఈ కథ రాశాను. అప్పట్లో వచ్చిన ఓ పాట కూడా ఈ కథ రాసేందుకు ప్రేరణనిచ్చింది. రష్మికకు స్క్రిప్ట్ పంపినప్పుడు.. 'ఒక అమ్మాయిగా నేను ఈ కథకు చాలా కనెక్ట్ అయ్యాను. అమ్మాయిలందరికీ నేనిచ్చే బిగ్ హగ్ ఈ సినిమా' అని అన్నారు. కథలో హీరో, హీరోయిన్ ఇద్దరి పాత్రలకూ ప్రాధాన్యం ఉంటుంది. అయితే హీరోయిన్ కోణంలో తెరకెక్కించాం. రెండు సినిమాల తర్వాత రష్మికతో మరో సినిమా చేయబోతున్నా' అని చెప్పారు.



సరికొత్త ప్రేమకథ

-వెంకీ అట్లూరి

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా భాను తెరకెక్కించిన చిత్రం 'ప్రేమిస్తున్నా'. కనకదుర్గారావు పప్పుల నిర్మిస్తున్నారు. నవంబర్ 7న విడుదల కానుంది. దర్శకుడు వెంకీ అట్లూరి ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'అన్ కండీషనల్ లవ్‌తో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తుంది. ఇందులోని ప్రధాన పాత్రధారుల నటన మీ అందరినీ కట్టిపడేస్తుంది' అని భాను తెలిపారు. 'చాలా రోజుల తర్వాత ఓ అందమైన ప్రేమకథను చూశామన్న భావనను ఈ చిత్రం కలిగిస్తుంది. మంచి టీమ్ వర్క్‌కు ఈ సినిమా ఒక ఉదాహరణలా నిలుస్తుంది' అని కనకదుర్గారావు పప్పుల చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శిరీష్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: భాస్కర్ శ్యామల.

హైదరాబాద్‌లో సినిమాటిక్ ఎక్స్‌పో



పి.జి.విందా

హైదరాబాద్ హెచ్ఐసీసీలో నవంబరు 1, 2 తేదీల్లో 'సినిమాటిక్ ఎక్స్‌పో 2025' మూడో ఎడిషన్ నిర్వహిస్తున్నామని తెలుగు సినిమాటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సినిమాటిక్ ఎక్స్‌పో అండ్ సినికా క్రియేటర్స్ కౌన్సిల్ ఎండీ పి.జి.విందా తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సినికా క్రియేటర్స్ కౌన్సిల్ అనే స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సినిమాటోగ్రఫీ, వీఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్, ఏఐ ఫిల్మ్ మేకింగ్ వంటి ఆధునిక సాంకేతికతలపై మాస్టర్ క్లాసులు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు 'హాలీవుడ్ టు హైదరాబాద్' కాన్సెప్ట్‌తో భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే కొత్త మైలురాయిగా ఈ ఎడిషన్ నిలుస్తుందని పేర్కొన్నారు.

'ది తాజ్ స్టోరీ' విడుదలకు లైన్ క్లియర్

- నిషేధం కోసం వేసిన పిటిషన్లను కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు



తాజ్‌మహల్ చుట్టూ ప్రచారంలో ఉన్న పలు వివాదాస్పద అంశాల ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు తుషార్ అమ్రిష్ గోయల్ తెరకెక్కించిన చిత్రం 'ది తాజ్ స్టోరీ'. నేడు విడుదలవుతోంది. బాలీవుడ్ నటుడు పరేశ్ రావల్ ప్రధాన పాత్ర పోషించారు. 'ది తాజ్ స్టోరీ' చిత్రానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో ఈ చిత్రం విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి. ఈ సినిమా విడుదలపై నిషేధం విధించాలి లేదా 'ఇదొక వివాదాస్పద కథనం మాత్రమే వాస్తవం కాదు' అని స్పష్టమైన వివరణను టైటిల్స్‌కు జోడించాలని న్యాయవాదులు చేత్న గౌతమ్, షకీల్ అబ్బాస్ కోర్టును ఆశ్రయించారు. 'మేమేమైనా సూపర్ సెన్సార్‌బోర్డ్ అనుకుంటున్నారా?, చట్టపరమైన పరిమితుల్లోనే కోర్టులు పనిచేస్తాయి. సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికేషన్‌ను ప్రశ్నించే అధికారం మాకు లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించడానికి పిటిషనర్లకు అనుమతి ఇచ్చి, కేసులను కొట్టి వేసింది.









వరద నీటిలో పెళ్లికూతురిని, బంధువులను తీసుకొస్తున్న ఎక్స్‌కవేటర్

జేసీబీ ఎక్కి.. వాగు దాటి..!

వరద కష్టాన్ని దాటి పెళ్లి మండపానికి నవ వధువు

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): వధూవరులిద్దరూ పక్కపక్క గ్రామాలకు చెందినవారే. రెండింటి మధ్యదూరం మూడు కిలో మీటర్లు. అయితే వాగు ఉధృతి కారణంగా వధువు పెళ్లి వేదికకు చేరే వీలు లేకుండాపోయింది. దీంతో బంధువులు ఆందోళన పడుతుండగా సమాచారం అందుకున్న జరుగుమల్లి పోలీసులు ఎక్స్‌కవేటర్ తెప్పించి సకాలంలో వధువును మండపానికి చేర్చడంతో కథ సుఖాంతమైంది. వివరాలివీ..వరుడు ఎండ్లూరి సుధాకర్‌ది ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామం. వధువు ఆత్మకూరి అంజలిది పక్కనే సాధువారిపాలెం. రెండు గ్రామాలూ పక్కపక్కనే ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం సింగరాయకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో వీరి పెళ్లి జరగాల్సి ఉంది. సాధువారిపాలెం నుంచి వధువు బయలుదేరాల్సి ఉండగా.. ఇరువైపులా ముసి ప్రవహిస్తుండటంతో కదిలే వీల్లేకపోయింది. సమాచారం అందుకున్న జరుగుమల్లి ఎస్ఐ మహేంద్ర...ఎక్స్‌కవేటర్‌ను సాధువారిపాలెం పంపించారు. వధువు, బంధువులను ఎక్స్‌కవేటర్‌లో పలు దఫాలుగా ఒడ్డుకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి వధువు సింగరాయకొండ చేరుకోవడంతో.. అక్కడ పెళ్లి వైభవంగా జరిగింది.

5వేల కి.మీ. రహదారులు ధ్వంసం



పాడేరు ఘాట్‌లో కొండచరియలు విరిగిపడడంతో ధ్వంసమైన రహదారి

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లా ప్రధాన రహదారులు(ఎండీఆర్), స్టేట్ హైవే(ఎస్‌హెచ్)లు కలిపి దాదాపు 5వేల కి.మీ. మేర రోడ్లు ధ్వంసమైనట్లు ఆర్ అండ్‌బీ ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. తుఫాన్, వరదల ప్రభావంతో రాష్ట్ర హైవేలు 1,272 కి.మీ., జిల్లా ప్రధాన రహదారులు 3,728 కి.మీ మేర పాడయ్యాయని తెలిపింది. రహదారి పూర్తిగా కొట్టుకుపోయిన చోట్ల తాత్కాలిక ఏర్పాట్లు చేసినా అవి ఎక్కువ రోజులు ఉండే అవకాశం లేదని, ఇందుకోసం తక్షణ మర్మతులు చేపట్టాల్సి ఉందని పేర్కొంది. దీనికోసం రూ.272 కోట్ల ఖర్చు కానుందని సర్కారుకు నివేదించింది. చిన్నపాటి మరమ్మతులు, గుంతలు పూడ్చినా ఉపయోగంలోకి రానంతగా ధ్వంసమైన రహదారులను పునర్నిర్మించడానికి రూ.2,440 కోట్ల నిధులు కేటాయించాలని కోరింది. ఇలా మొత్తం రూ.2,712 కోట్లపైనే ఖర్చుకానుందని ఆర్అండ్‌బీ నివేదికల్లో పొందుపరిచింది.

తుఫానును ఆపలేం... నష్టం తగ్గించాం

» కృష్ణా జిల్లా పర్యటనలో మంత్రి అచ్చెన్నాయుడు



వరి పైరు వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు

కంకిపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'రైతు పక్షపాతి సీఎం చంద్రబాబు. రైతుకు అండగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది' అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని పునాదిపాడు గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'తుఫాన్‌ను ఆపడం ఎవరి తరం కాదు. సీఎం చంద్రబాబు ముందుచూపు కారణంగా రాష్ట్రంలో మొంథా తుఫాన్ తీవ్రంగా ఉన్నప్పటికీ ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. ప్రాథమిక అంచనా ప్రకారం 1.50 లక్షల హెక్టార్లలో వరి పైరు, 12,500 హెక్టార్లలో హార్టీ కల్చర్ పంట నష్ట పోయింది. బాధ్యతగల మాజీ ముఖ్యమంత్రి జగన్ ఈ క్రాప్ చేయలేదంటూ పచ్చి అబద్ధాలు చెబుతున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికే 95 శాతం ఈ క్రాప్ చేశాం' అని అచ్చెన్న వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నీలి మీడియా తప్పుడు కథనాలు: మంత్రి అనగాని



రేపల్లె, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'మొంథా తుఫాన్ ప్రభావాన్ని వీలైనంత వరకు తగ్గించడానికి కూటమి ప్రభుత్వం చేసిన కృషి ఒక చరిత్ర' అని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం బాపట్ల జిల్లా రేపల్లెలో మంత్రి అనగాని మీడియాతో మాట్లాడారు. 'గత ఆరు రోజులుగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ మైక్రో లెవెల్లో పర్యవేక్షించారు. కానీ నీలి మీడియా తుఫాన్ సమయంలో కూడా అబద్ధాలు ప్రచారం చేస్తుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి స్టేజీ కట్టించుకుని బాధితులను ఆయన దగ్గరకే రప్పించుకున్నారు. పంట నష్టానికి సంబంధించి హెక్టార్‌కు రూ.25 వేల వరకు పరిహారం ఇచ్చే అవకాశం ఉంది' అని మంత్రి అనగాని వివరించారు.

సీఎం పనితీరు అభినందనీయం

» సహాయక చర్యల్లో ప్రభుత్వం విజయవంతం: మాధవ్



అనంతపురం అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'మొంథా తుఫాను రాష్ట్రాన్ని కుదిపేసింది. బాధితులకు అండగా నిలవడం, వారికి ధైర్యం, భరోసా కల్పించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ, పనితీరు అభినందనీయం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తుఫాను విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించింది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా నిత్యం ఇక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీఎం చంద్రబాబు మత్స్యకారులకు భృతి అందజేయడాన్ని స్వాగతిస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం ప్రీమియం చెల్లించనందుకే అప్పట్లో రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన లబ్ధి అందలేదు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో తుఫాను బాధితులను ఆదుకోవడానికి తీసుకుంటున్న చర్యలను అభినందించాల్సింది పోయి విమర్శించడం వైసీపీ దిగజారుడు తనానికి నిదర్శనం. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించిన వైసీపీకి ప్రజలే తగిన బుద్ధి చెప్పారు' అని మాధవ్ అన్నారు.

51 లక్షల టన్నుల ధాన్యం కొంటాం: నాదెండ్ల



తెనాలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 51 లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చెయ్యాలని నిర్ణయించుకున్నాం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను పరామర్శించిన అనంతరం గురువారం గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ధాన్యం క్వింటాల్‌కు రూ.2,369 చొప్పున మద్దతు ధర ఇస్తాం. రైతు నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే కచ్చితంగా డబ్బు వారి ఖాతాలో జమ చేసేలా మార్పులు చేశాం. ఈ క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి కౌలు రైతుకు నష్టపరిహారం కచ్చితంగా అందుతుంది. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రత్యేక అవసరాల వారికి నిత్యావసరాలు ఇవ్వాలని దివ్యాంగులు విజ్ఞప్తి చేశారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతాను' అని మంత్రి మనోహర్ తెలిపారు.

భారత్ ఎదుగుదల కాంగ్రెస్‌కు జీర్ణం కాదు

» మొంథా వేళ జగన్ ఏమైపోయారు..?: యామిని

విజయవాడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు భారత్ ఎదుగుదల జీర్ణం కావడం లేదనే విషయం కర్ణాటక కాంగ్రెస్ మంత్రి ఎంబీ పాటిల్ వ్యాఖ్యలు చూస్తుంటే అర్థమవుతోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు సాదినేని యామిని అన్నారు. విజయవాడలో గురువారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మొంథా తుఫాన్ సమయంలో జగన్ ఏమయ్యారు? అని ప్రశ్నించారు. షర్మిల రాష్ట్ర, దేశ నాయకత్వాలపై అనవసరపు నిందలు వేస్తున్నారు' అని యామిని అన్నారు.

ఎకరానికి 25 నుంచి 50 వేల పరిహారం: సీపీఐ

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'మొంథాతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 నుంచి రూ.50 వేల వరకు పరిహారమిచ్చి ఆదుకోవాలి' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మోదీ నుంచి భారీగా నిధులు రాబట్టండి: షర్మిల

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథాతో రాష్ట్రంలో నష్టపోయిన ప్రతి కుటుంబానికీ సహాయం చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. మన రాష్ట్రానికి ప్రధాని మోదీ నుంచి భారీగా నిధులు తీసుకొని రావాలని చంద్రబాబుని డిమాండ్ చేశారు.

రబీలో విత్తన పంపిణీకి 110 కోట్ల రుణం

రబీ సీజన్‌లో విత్తన సేకరణ, రైతులకు పంపిణీ కోసం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ నుంచి రూ.110కోట్ల రుణం తీసుకునేందుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

టెక్‌తో చెక్

మొంథాను ఎదుర్కొన్న సాంకేతిక పంథా

» రియల్‌టైమ్‌లో సేకరించిన సమాచారంతో సమగ్ర విశ్లేషణ

» మొంథా పర్యవేక్షణలో ఆర్టీజీఎస్ పనితీరును వివరించిన ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం ముున్ముందు తుఫాన్లను ఎదుర్కోవడంలో ఓ కేస్ స్టడీగా నిలిచిపోనుంది. తుఫాను సమయంలో రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) చురుగ్గా వ్యవహరించడం వల్లే దాని గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయడంతో పాటు .. ఎంత మేర నష్టాన్ని కలిగించే అవకాశం ఉందన్న అంచనాలను ఎప్పటికప్పుడు అటు ప్రజలకు.. ఇటు అధికారులకు అందించి నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించగలిగామని ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మొంథా తుఫాను సమయంలో ఆర్టీజీఎస్ పనిచేసిన తీరును ఆయన వివరించారు. ఆర్టీజీఎస్‌కు 2017లో నాటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. పాలనలో సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించే లక్ష్యంతో దీనికి రూపకల్పన చేశారు. దాని ఫలితాలు మొంథా తుఫాను సమయంలో స్పష్టంగా కనిపించాయి. తుఫాను సమయంలో తాము ఏం చేశామనే అంశాన్ని భాస్కర్ పీపీటీ ప్రజంటేషన్ రూపంలో వివరించారు. దానిలోని ముఖ్యాంశాలు..

గతంలో అలా.. ప్రస్తుతం ఇలా..

గతంలో తుఫాన్ల సమయంలో సమాచారం కోసం భారత వాతావరణ శాఖ (ఐఎండీ)పైనే ఆధారపడాల్సి వచ్చేది. ప్రజలకు కచ్చితమైన సమాచారం అందించడంలో దీనివల్ల ఆలస్యం జరిగేది. తుఫాను ముందస్తు జాగ్రత్త చర్యల్లోగానీ, తుఫాను అనంతర సహాయక చర్యల్లోగానీ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించేది. ఈసారి ఐఎండీ సమాచారంతోపాటు ఇతరత్రా మార్గాల్లోనూ తుఫాను గమనానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. ప్రత్యేకంగా ప్రజలను అప్రమత్తం చేయడానికి అవేర్ 2.0 (ఏపీ వెదర్‌ఫోర్‌కాస్టింగ్ అండ్ ఎర్లీ వార్నింగ్ రీసెర్చ్ సెంటర్) వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించారు. ఫలితంగా ఏ ప్రాంతంలో తుఫాను తీరాన్ని దాటనుంది.. ఎక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందో ఈ వ్యవస్థ అంచనా వేసింది. సమాచారాన్ని సేకరించడం ఒక ఎత్తు. దాన్ని బాధిత ప్రాంత ప్రజలకు చేరవేయడం మరో ఎత్తు. దీనికి వాట్సాప్ గవర్నెన్స్‌ను పూర్తిస్థాయిలో వాడుకున్నారు. ఫలితంగా ప్రాణనష్టాన్ని పూర్తిస్థాయిలో నివారించగలిగారు. మన మిత్ర ద్వారా.. తమ ప్రాంతంలో చెట్లు పడిపోయాయని, విద్యుత్తు సరఫరా లేదని.. నీటి సరఫరా లేదని తదితర ఫిర్యాదులు 1200 వరకు వచ్చాయి.

602 డ్రోన్లు... 14770 సీసీ కెమెరాల ఫుటేజీ

ముంపు ప్రాంతాలను గుర్తించేందుకు 602 డ్రోన్లు, 14770 సీసీ కెమెరాల ఫుటేజీలను వాడుకున్నారు. వీటన్నింటినీ ఆర్టీజీఎస్ నెట్‌వర్క్‌కు అనుసంధానించి ఏయే ప్రాంతాల్లో ముంపు పరిస్థితి ఉందో తెలుసుకుని అధికారులను అప్రమత్తం చేశారు. అన్ని శాఖల సమాచారం ఒకచోట క్రోడీకరించి డేటాలేక్‌ను క్రియేట్ చేయడం ద్వారా శాఖల నడుమ పూర్తిస్థాయి సమన్వయం ఉండేలా చూశారు. జేసీబీలు, క్రేన్లు వంటి యంత్రాలను లైవ్ ట్రాక్ చేయడం ద్వారా వాటిని సమర్థవంతంగా వాడుకునే వెసులుబాటు లభించింది. 5,803 గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో కమాండ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగలిగింది.

ఆదుకున్న అవేర్ 2.0.

ఫలాన ఊరులో ఉన్న చెరువుకు ఏ సమయంలో ఎంత నీరు చేరే అవకాశం ఉందో కూడా స్థానికులకు, అధికారులకు తెలిపే స్థాయిలో సమాచారాన్ని అవేర్ 2.0. చేరవేసింది. మొంథా తుఫాను రకరకాలుగా ముందుకు సాగుతూ వచ్చింది. అయినా దాని కదలికలను, అందులో వస్తున్న మార్పులను 72 గంటల ముందుగా అంచనా వేసి.. అధికారులను ఈ వ్యవస్థ అప్రమత్తం చేసింది.

వేగంగా వాట్సాప్ గవర్నెన్స్..

తుఫాన్ తీవ్రతకు సంబంధించిన సమాచారాన్ని మిత్ర యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సేకరిస్తూ, బాధిత ప్రాంత ప్రజల ఫోన్లకు నిరంతరాయంగా పంపుతూ వచ్చారు. 1.1 కోట్ల మెసేజ్‌లతో ప్రభావిత ప్రాంత ప్రజలను ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి అప్రమత్తం చేశారు

మానిటర్.. అలర్ట్.. రెస్క్యూ..

నష్టాన్ని వీలైనంత తగ్గించడంతోపాటు, శరవేగంగా సహాయక చర్యలు చేపట్టేందుకు మొంథా తుఫాన్ సమయంలో ప్రభుత్వ యంత్రాంగం అనుసరించిన ఐదు సూత్రాలివీ.

గతానికి భిన్నంగా చంద్రబాబు

తుఫాను హెచ్చరికలు వచ్చినప్పటినుంచీ ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం.. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవడమనే అంశాలకు చంద్రబాబు నిన్నటివరకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. అందులో భాగంగా అధికారుల్లో సీరియస్‌నెస్ పెంచడానికి తాను కూడా క్షేత్రస్థాయిలోనే ఉంటూ వారి వెంటపడేవారు. 1996-97 సూపర్ సైక్లోన్ సమయంలో రాజమండ్రి సబ్ కలెక్టర్ కార్యాలయమే సీఎం కార్యాలయంగా మారిపోయింది. హుద్‌హుద్, బుడమేరు వరదల్లోనూ అదే శైలి! ఇప్పుడు భిన్నంగా ఆర్టీజీఎస్ నుంచి ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని మొంథా తుఫాన్ సమయంలో కదిలించారు. తొమ్మిది సార్లు టెలీ కాన్ఫరెన్సులు నిర్వహించి క్షేత్రస్థాయిలో అధికారులతో నిరంతరం టచ్‌లో ఉంటూ వారిలో స్ఫూర్తిని నింపారు. ఆయన తరచూ చెప్పే స్మార్ట్ వర్క్‌కు సాంకేతికతను జోడించి తుఫాను పర్యవేక్షణ చేశారు. డేటా డ్రివెన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మోడల్‌ను ఆవిష్కరించారు.

సీఎం అభినందనలు

మొంథా తుఫాన్ సమయంలో బాగా సేవలు అందించాలంటూ ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ జి.శివప్రసాద్, ఐపీఎస్ అధికారి మల్లికా గార్గ్, ఐఏఎస్ అధికారులు ధాత్రిరెడ్డి, సౌర్యమాన్ పటేల్, గీతాంజలి శర్మ, ప్రఖర్‌జైన్ సేవలను సీఎం చంద్రబాబు అభినందించారు.

మరింత బలహీనపడిన మొంథా

» 3, 4 తేదీల్లో కోస్తాలో వర్షాలు?

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ మరింత బలహీనపడి గురువారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది సాయంత్రానికి విదర్భ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ పరిసరాల్లో కొనసాగుతోంది. ఇంకా ఉత్తరంగా పయనించి శుక్రవారం నాటికి ఉత్తర ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ పరిసరాల వైపు పయనించి అల్పపీడనంగా మారనుంది. దీని ప్రభావంతో గురువారం కోస్తాలో ఎక్కువచోట్ల ముసురు వాతావరణం నెలకొని తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు ఆనుకుని అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణనిపుణులొకరు పేర్కొన్నారు. గురువారం గల్ఫ్ ఆఫ్ థాయ్‌ల్యాండ్‌లో ఉపరితల ఆవర్తనం ఆవరించిందని, ఇదిరానున్న రెండు రోజుల్లో ఉత్తర అండమాన్ సముద్రంలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. దీనిప్రభావంతో తూర్పుగాలులు దక్షిణ భారతం వైపు రానున్నందున నవంబరు 3, 4 తేదీల్లో కోస్తాలో వర్షాలు కురిసే వీలుందన్నారు. శుక్రవారం కోనసీమ, ఉమ్మడి గోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)



కృష్ణా జిల్లా కోడూరు వద్ద దెబ్బ తిన్న పంటను చూపిస్తూ డిప్యూటీ సీఎం పవన్ ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న రైతు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుబాష్, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా తుఫాన్ కారణంగా 1.38 లక్షల హెక్టార్లలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని డిప్యూటీ సీఎం చెప్పారు. 'సముద్రానికి అతి చేరువలో ఉండే దివి ప్రాంతంలో వరి పైరు పాలు పోసుకునే దశ, ఈనిన దశల్లో ఉంది. పలు చోట్ల వరి పైరు నేలకొరడంతో రైతులు గణనీయంగా నష్టపోయారు. సుదీర్ఘ పాలనానుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల కారణంగా నష్ట తీవ్రతను గణనీయంగా తగ్గించగలిగాం. ఆర్‌టీజీఎస్ ద్వారా 24 గంటలూ పర్యవేక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని గ్రామస్థాయి వరకు అప్రమత్తం చేశాం. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 1.16 లక్షల మందిని పునరావాస కేంద్రాలకు తరలించాం. అక్కడ ఆశ్రయం పొందిన ప్రతి ఒక్కరికీ.. ఇళ్లకు వెళ్లడానికి ముందే ఒక్కొక్కరికీ రూ.1,000 చొప్పున, కుటుంబానికైతే గరిష్ఠంగా రూ.3 వేలు, 25 కిలోల బియ్యం, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం, కందిపప్పు, లీటర్ వంట నూనె, కిలో చొప్పున బంగాళదుంపలు, పంచదార, ఉల్లిపాయలు అందిస్తున్నాం. విపత్తు కారణంగా నష్టపోయిన కౌలు రైతులను ప్రత్యేకంగా ఆదుకునే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాం' అని తెలిపారు. తుఫాన్ అనంతరం ప్రభావిత గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా సూపర్ శానిటేషన్, సూపర్ క్లోరినేషన్ పద్ధతుల ద్వారా ఉపశమన చర్యలను ప్రారంభించామని చెప్పారు. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం తోపాటు ఆ ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలను చేపడతామని, జిల్లాల వారీగా సిబ్బందిని బృందాలుగా విభజించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు మొదలుపెట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,583 గ్రామాలు తుఫానుకు తీవ్రంగా ప్రభావితం కాగా.. ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం 21,055మంది సిబ్బందిని రంగంలోకిదించామని.. ఎక్కడైనా తాగు నీటిసరఫరావ్యవస్థకు ఇబ్బంది ఎదురైతే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తీర ప్రాంత రక్షణకు చర్యలు

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీర ప్రాంత గ్రామాల్లో నష్టం వాటిల్లకుండా చర్యలు చేపడతామని పవన్ కల్యాణ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సముద్రపు కరకట్టలు, కృష్ణా కరకట్టలు అధ్వాన స్థితికి చేరిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా.. కలెక్టర్‌ను వివరణ కోరారు. అనంతరం సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తీర ప్రాంతాల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోడూరు మండలంలో అవుట్ స్లూయిస్ దురవస్థ కారణంగా పంట పొలాల్లోకి సముద్రపు నీరు వచ్చి చేరుతోందని, కొత్త స్లూయిస్ నిర్మాణానికి నాబార్డు సాయం తీసుకుంటామని తెలిపారు. సముద్రపు కోతకు గురై దెబ్బతిన్న ఎదురుమొండి-గొల్లమంద రహదారి నిర్మాణానికి రూ.13.08 కోట్లు కేటాయించామని, టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా ప్రత్యేకాధికారి ఆమ్రపాలి, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పరువు తీసేసిన సొంత మీడియా

» సీఎంగా లేకపోయినా తుఫాన్‌లో ఆదుకున్న ఏకైక మగాడట!

» రోత మీడియాలో వింత కామెంట్.. విపత్తుల్లో ఏనాడూ గడపదాటని జగన్

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జగన్ గ్రాఫ్‌ను అమాంతం ఆకాశానికి ఎత్తేయాలన్న తొందరలో సొంత మీడియా చేస్తున్న వ్యాఖ్యానాలు ఆయన పరువును పాతరేసేలా ఉన్నాయి. 'సీఎంగా లేకపోయినా తుఫాన్ నుంచి ప్రజలను కాపాడిన ఏకైక మగాడు' అంటూ గురువారం మధ్యాహ్నం 12 గంటలకు జగన్ చానల్‌లో ఒక వాక్యం కనిపించింది. దీనిపై కూటమి పక్షాల నేతలు వెంటనే స్పందిస్తూ.. తామెవరమూ జగన్ మగాడు కాదనలేదంటూ వ్యంగ్యధోరణిలో ట్వీట్‌లు చేయడం మొదలుపెట్టారు. నిజానికి, సీఎంగా ఉండగా జగన్ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏనాడూ గడప దాటలేదు. అంతకుముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చాలావరకు హైదరాబాద్ నివాసానికే ఆయన పరిమితమయ్యారు. పంట నష్టపోయిన రైతుల వద్దకు వెళ్లింది లేదు. జగన్ సీఎంగా ఉండగా రాష్ట్రాన్ని ఒకసారి ప్రకృతి విపత్తు ముంచెత్తింది. దానివల్ల దెబ్బతిన్న వరిచేలలోని పనలను చూసేందుకు ఆయన ప్రత్యేకంగా స్టేజీ సెటప్ వేయించుకున్నారు. ఆయన తీరు అప్పట్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. పైగా మొంథా తుఫాను సమయంలో ఆయన రాష్ట్రంలో లేరు. ఎప్పటిలాగే బెంగళూరు వెళ్లిపోయారు.

ఇది చంద్రబాబు సృష్టించిన తుఫాన్

» ఉచిత పంటల బీమాను నిర్వీర్యం చేశారు: జగన్

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముఖ్యమంత్రి చంద్రబాబు సృష్టించిన విపత్తు అంటూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వింత వ్యాఖ్యానం చేశారు. ఉచిత పంటల బీమాను తన ప్రభుత్వం గొప్పగా అమలుచేయగా, చంద్రబాబు దానిని నిర్వీర్యం చేశారన్నారు. గడచిన 16నెలల్లో 16సార్లు తుఫాన్లు వస్తే రైతులకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆపార్టీ జిల్లాల అధ్యక్షులు, సమన్వయకర్తలతో ఆయన మీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అరకొర లెక్కల ప్రకారమే గడచిన విపత్తులకు చెల్లించాల్సి పంటనష్ట పరిహారం రూ.600కోట్లను ప్రభుత్వం ఎగ్గొట్టిందని విమర్శించారు. "మిర్చిక్వింటాలు రూ.11,781కు కొంటామని, మామిడి కిలో రూ.12 చొప్పున తీసుకుంటామని, ఉల్లి క్వింటాలు రూ.1800కు కొనుగోలుచేస్తామని చెప్పి చంద్రబాబు మాట తప్పారు" అని ఆరోపించారు. కాగా, మెడికల్ కాలేజీల అంశంలో తలపెట్టిన నిరసనను వచ్చే నెల 4నుంచి 11వతేదీకి వాయిదా వేసినట్టు తెలిపారు. జిల్లాల్లో ఎప్పుడు పర్యటిస్తారని కొందరు ప్రశ్నించగా, ప్రభుత్వం పంటనష్టం లెక్కలువేసి రైతులకు చెల్లింపులు జరిపాక, పరిస్థితినిబట్టి పర్యటనకు వస్తానని జగన్ తెలిపారు.

వస్తే... విధ్వంసమే!

ఒక్కో తుఫాన్ తీవ్రత ఒక్కోలా.. విశాఖను వణికించిన హుద్‌హుద్

» ఆ తర్వాత తితిలీతోనూ ముప్పు

» వాటికంటే మొంథా తీవ్రత తక్కువ

» కానీ... పరిధి, విస్తృతి అధికం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తుఫాన్ వచ్చిందంటే వణుకు మొదలవుతుంది. తీరం దాటేసరికి ఆ ప్రాంతం కకావికలమవుతుంది. వాటి తీవ్రతను బట్టి నష్టం పెరుగుతుంటుంది. పదకొండేళ్ల క్రితం విశాఖకు తాకిన హుద్‌హుద్, ఏడేళ్ల క్రితం శ్రీకాకుళం జిల్లాలో తితిలీ ఇలాంటి విధ్వంసాలనే మిగిల్చాయి. ఆ తర్వాత... ఇప్పుడొచ్చిన 'మొంథా' అదే స్థాయిలో భయపెట్టింది. అయితే... హుద్‌హుద్, తితిలీతో పోల్చితే మొంథా తీవ్రత తక్కువే. ఇవీ ఆ తుఫాన్లు... అవి సృష్టించిన విధ్వంసాలు...

అమ్మో... హుద్‌హుద్

హుద్‌హుద్ పేరు వింటే విశాఖ వాసులు ఇప్పటికీ వణికిపోతారు. 2014 అక్టోబరు 12న హుద్‌హుద్ తుఫాన్ విశాఖపట్నాన్ని తాకిన సమయంలో గంటకు 185 కి.మీ. వేగంతో పెనుగాలులు వీచాయి. తూర్పు నౌకాదళం, విశాఖ ఓడరేవులో కొద్దిసేపు 245 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. విశాఖ నగరం కకావికలమైంది. చెట్లు, స్తంభాలు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. విశాఖలో పోర్టు, నేవీ, షిప్‌యార్డు, హెచ్‌పీసీఎల్, విశాఖ ఉక్కు కర్మాగారంతోపాటు, ఎయిర్‌పోర్టు, ఇతర పరిశ్రమలు దారుణంగా దెబ్బతిన్నాయి. హుద్‌హుద్ తుఫాన్ తీరం దాటిన తరువాత వాయవ్యంగా పయనించి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బిహార్ మీదుగా నేపాల్ వరకు వెళ్లింది. హుద్‌హుద్ తుఫాన్ ప్రభావంతో మొత్తం 124 మంది (ఏపీలో 89 మంది) ప్రాణాలు కోల్పోగా, రూ. 21 వేల కోట్లకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. ఇందులో మూడో వంతు నష్టం పరిశ్రమలదేనని అప్పట్లో అంచనా వేశారు.



హుద్‌హుద్ సమయంలో విశాఖలో రహదారికి ఇరువైపులా నేలకూలిన చెట్లు, నిలిచిపోయిన వాహనాలు (ఫైల్)

తీవ్రంగా తితిలీ గాలులు..

2018 అక్టోబరు 10న శ్రీకాకుళం జిల్లా బారువ వద్ద తితిలీ తుఫాన్ తీరం దాటింది. ఆ సమయంలో గాలులు గంటకు 150 కి.మీ. వేగంతో వీచాయి. కొద్దిసేపు 185 కి.మీ. వేగానికికూడా చేరాయి.ఈ తుఫాన్ శ్రీకాకుళంజిల్లాతోపాటు పొరుగునున్న ఒడిశాపైనా తీవ్రప్రభావం చూపింది. ఏపీ, ఒడిశాల్లో రూ. 6,300 కోట్ల ఆస్తినష్టం వాటిల్లగా 127 మంది ప్రాణాలు కోల్పోయారు.

మొంథా ప్రత్యేకత వేరు

హుద్‌హుద్, తితిలీతో పోల్చితే.. మొంథా తుఫాన్ తీవ్రత తక్కువే. కానీ.. పరిధి ఎక్కువ. మొంథా తీరం దాటినప్పుడు గంటకు 90 నుంచి వంద కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. ఒక్కోసారి ఆ వేగం 110 కిలోమీటర్లను చేరింది. హుద్‌హుద్, తితిలీవల్ల ఏపీలో కేవలం ఉత్తరాంధ్రలోనే వర్షాలు కురిశాయి. కానీ... మొంథా ప్రభావం కోస్తాంధ్రతీరంతో పాటు, రాయలసీమలోనూ ప్రభావం చూపింది. ఇంకా...తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌లలోనూ భారీవర్షాలు నమోదయ్యాయి. హుద్‌హుద్ సమయంలో రుతుపవనాలు బలహీనంగా ఉండడంతో సముద్రం నుంచి భూఉపరితలంపైకి గాలులు తప్ప తేమ తక్కువగా రావడంతో ఉత్తరాంధ్రలో మాత్రమే వర్షాలు కురిశాయి. మొంథాకు బలమైన ఈశాన్య రుతుపవనాలు తోడయ్యాయి. హిందూ మహాసముద్రంలో తుఫాన్‌లకు అనుకూల వాతావరణం నెలకొంది. దీనివల్లే మొంథా పరిధి పలు రాష్ట్రాలకు విస్తరించిందని వాతావరణ విభాగం అధికారి జగన్నాథకుమార్ తెలిపారు.

పెన్నా బ్యారేజీలోకి కొట్టుకొచ్చిన బోటు





పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పెన్నా నది బ్యారేజీ వద్ద పెను ముప్పు తప్పింది. ఇసుక తరలించే మూడు బోట్లు బ్యారేజీ వైపు కొట్టుకువచ్చాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వాటిలో ఒకదానిని గుర్తించి నియంత్రించారు.





కృష్ణానదిలో కొట్టుకొచ్చిన బోటు!

విజయవాడ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో కృష్ణానదికి భారీగా చేరుతున్న వరదలో గురువారం ఓ బోటు కొట్టుకొచ్చింది. ఇబ్రహీంపట్నం ఫెర్రీ నుంచి వచ్చిన ఈ బోటును అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అధికార యంత్రాంగం ముందే గుర్తించింది. డ్రోన్లు ఈ సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు చేరవేశాయి. అప్రమత్తమైన యంత్రాంగం అన్ని శాఖలను సమన్వయం చేసింది. దీంతో అధికారులు, సిబ్బంది హుటాహుటిన తుమ్మలపాలెం చేరుకున్నారు. వరద ఉధృతిలోనూ గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బోటు వద్దకు చేరుకున్నారు. దానికి తాడు కట్టి, తుమ్మలపాలెం సమీపంలోనే ఒడ్డుకు చేర్చారు. బోటును ముందుగానే గుర్తించకపోతే బ్యారేజీకి పెను ప్రమాదం జరిగేదని అధికారులు తెలిపారు. గతేడాది బుడమేరు వరదల సమయంలో నదిలో కొట్టుకొచ్చిన బోట్లు ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న విషయం తెలిసిందే.

పంట నష్టం.. రైతుకు కష్టం

3 లక్షలకుపైగా ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు.. ఇందులో 70 శాతం వరి.. నీటమునిగిన చేలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మొంథా తుపాను అన్నదాతకు అపార నష్టం కలిగించింది. తుపాను ప్రభావిత జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దాదాపు 3 లక్షల ఎకరాలకు పైగా వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో సుమారు 70 శాతం వరి పంటలు ఉన్నట్టు సమాచారం. కొన్ని చోట్ల పంట నేలకొరిగిపోయి నీటిలో నానడంతో వరికంకులన్నీ కుళ్లిపోయాయి. ఇక వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, మినుము, పత్తి, కూరగాయలు, ఉద్యాన పంటలకు నష్టం జరిగింది. ప్రాథమిక అంచనా మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీ నష్టం సంభవించింది. ముఖ్యంగా వరిపంటను తుపాను తీవ్రంగా దెబ్బతీసింది. గురువారం వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ఆయా జిల్లాలలో పంట నష్టంపై పరిశీలన చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలు నమోదు చేస్తున్నారు. గురువారం కూడా కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడటంతో పంటలు దెబ్బతిన్నాయి.

ఉమ్మడి 'తూర్పు'లో అపారనష్టం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరికొద్దిరోజుల్లో చేతికి వస్తుందనుకున్న వరిపంటను తుపాను తీవ్రంగా దెబ్బతీసింది. కాకినాడ జిల్లాలో 14 మండలాల్లోని 216 గ్రామాల్లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో, తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని చోట్ల వరిపంట తీవ్రంగా దెబ్బతింది. పంట నేలకొరిగిపోయి నీటిలో నానడంతో ధాన్యం మొలకెత్తింది. వరికంకులన్నీ కుళ్లిపోయాయి. దీంతో పంట ఎందుకూ పనికిరాని పరిస్థితి. కాకినాడ జిల్లాలో గురువారం ప్రాథమిక అంచనాల మేరకు.. పంటనష్టం 50,700 ఎకరాల్లో జరగ్గా రూ.98 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. కోనసీమ జిల్లాలో 78 వేల ఎకరాల్లో పంట దెబ్బతినగా.. రూ.148 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు అంచనా. తూర్పుగోదావరిలో 10 వేలకుపైగా ఎకరాల్లో నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. పెదపూడి మండలంలో 16 వేల ఎకరాల్లో వరిపంట తీవ్రంగా దెబ్బతింది. ఈ మండలంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నష్ట తీవ్రతను పరిశీలించి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. గురువారం ఉదయం పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట, యు.కొత్తపల్లి తదితర మండలాల్లో మూడు గంటలకుపైగా భారీవర్షం కురిసింది. కాకినాడ జిల్లాలో కాలువలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. ఏలేరు రిజర్వాయరుకు ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో వరద ముప్పు పొంచి ఉంది. అన్నవరంలో పంపా రిజర్వాయరుకు వరద పోటెత్తుతోంది.



నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలంలో పర్యటిస్తూ పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

'పశ్చిమ'లో 33,630 ఎకరాల్లో వరి నష్టం

పశ్చిమ గోదావరి జిల్లాలో 33,630 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. ఈ-క్రాప్‌లో నమోదైన పేర్ల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. కౌలు రైతుల పేరు ఉంటే ముంపు పొలాల్లో వారి పేర్లనే పరిహారం కోసం నమోదు చేస్తున్నారు. అరటి, ఇతర కూరగాయల పంటలు 750 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. విరిగిపడిన చెట్లను పూర్తిగా తొలగించారు. రెండు రోజులు పాటు జిల్లాలోని 117 పునరావాస కేంద్రాల్లో 23,307 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. వాతావరణం ప్రశాంతంగా ఉండడంతో ఆ కేంద్రాల్లో ఉన్న వారంతా ఇళ్లకు చేరుకున్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు.

ఏలూరు జిల్లా ఏజెన్సీలో కుండపోత

గురువారం తెల్లవారుజామున ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో భారీ ఈదురు గాలులతో కుండపోత వర్షం కురిసింది. కొండవాగులు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించాయి. పోలవరం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, మునునూరు మండలాల్లో కాలువలు, వాగులు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గడిచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పోలవరం మండలంలో 94.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



అనకాపల్లి జిల్లాలో శారదానదికి గండి పడడంతో ముంపునకు గురైన పంట పొలాలు, ఆక్వా చెరువులు

ఉమ్మడి కృష్ణాలో భారీ నష్టం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 63,354.2 హెక్టార్లలో తీవ్ర పంట నష్టం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా మేరకు కృష్ణా జిల్లాలో వరి 45 వేల హెక్టార్లలో, మినుము 985 హెక్టార్లు, వేరుశనగ 288 హెక్టార్లు, పత్తి 48 హెక్టార్లలో.. మొత్తంగా 46,357 హెక్టార్లలో దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. పలు మండలాల్లో కూరగాయలు, తమలపాకు, అరటి తోటలు బలమైన గాలుల తాకిడికి నేలకొరిగాయి. జిల్లాలో 2,229 మంది రైతులకు చెందిన 1416.22 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు నిర్ధారించారు. ఎన్టీఆర్ జిల్లాలో వరి 5622 హెక్టార్లలో, పత్తి 10,068.2 హెక్టార్లు, మొక్కజొన్న 699 హెక్టార్లు, రాగి, కంది, మినుము, పెసర, వేరుశనగ, చెరకు వంటి ఇతర పంటలు 608 హెక్టార్ల మేర పంట నష్టం వాటిల్లినట్టుగా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 235 గ్రామాలపై తుపాను ప్రభావం చూపించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,876 మంది రైతులు నష్టపోయినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.

ప్రతి ఒక్కరికీ పరిహారం: బీసీ జనార్దన్‌రెడ్డి

నంద్యాల జిల్లాలో నష్టపోయిన పంటలను అధికారులు లెక్కిస్తున్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి, జేసీ కొల్లాబత్తుల కార్తీక్, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 36,948 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని.. రైతుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా అర్హులందరికీ పరిహారం అందించేలా సమగ్ర నివేదిక తయారు చేయాలని కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. గురువారం జిల్లా వ్యాప్తంగా 464 హెక్టార్ల పంటలను ఆయన పరిశీలించారు. తన బనగానపల్లె నియోజకవర్గంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. వరద నీటిలో మంత్రి ట్రాక్టర్ నడుపుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లకు తక్షణ మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు.

అనకాపల్లి జిల్లాలో...

తుపాను ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గురువారం జిల్లాలో పెద్దగా వర్షం కురవకపోయినప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు జలాశయాల్లోకి చేరుతుండడంతో అధికారులు గేట్లు ఎత్తి కిందకు వదులుతున్నారు. జిల్లా వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం వెన్ను కట్టే దశలో ఉన్న 1,381 హెక్టార్ల వరి పంట ముంపునకు గురైంది. శారదా నదికి గట్లు పడటంతో సుమారు 1,500 ఎకరాల్లో వరి పంట మునిగిపోయింది.

పాడేరు ఘాట్‌లో విరిగిపడ్డ కొండచరియలు

అల్లూరి జిల్లా పాడేరు ఘాట్‌లో వ్యూపాయింట్‌కు సమీపాన గురువారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడడంతో రోడ్డు ధ్వంసమైంది. 2గంటలు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ దినేశ్‌కుమార్.. పరిస్థితులను చక్కదిద్దాలని ఆర్‌డీవోను ఆదేశించారు. ఉదయం 9 గంటలకు రాకపోకలకు అనువుగా రోడ్డును బాగు చేశారు. భారీ వాహనాల కారణంగా మళ్లీ కొంత ధ్వంసం కావడంతో మధ్యాహ్నం 12 గంటల తర్వాత రాకపోకలను నిలిపివేశారు. మరమ్మతులు చేశాక వాహనాల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి.



కాకినాడ జిల్లా పెదపూడి మండలంలో నేలవాలిన వరి



నంద్యాల జిల్లా ముదిగేడులో వరద నీటిలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



ఎన్టీఆర్ జిల్లాలో ముంపునకు గురైన పత్తి చేను



ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం బొందలపాడులో దెబ్బతిన్న మిరప మొక్కలను చూపుతున్న రైతు ఎర్రారెడ్డి

శివమెత్తిన శారద..!

- భారీ వర్షాలతో నదికి గండ్లు..
- నీటమునిగిన 1,500 ఎకరాలు మునిగిన వై.లోవ గ్రామం

అనకాపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో శారదానది శివమెత్తింది. గండ్లు తెగిపోవడంతో పోటెత్తి ప్రవహిస్తూ..వందలాది ఎకరాల పంట పొలాలను ముంచేసింది. తుపాన్ మొదలైనప్పటినుంచీ జిల్లాలో భారీ వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీనికితోడు ఎగువనున్న రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి పెద్ద మొత్తంలో వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మంగళవారం నుంచి శారదా నదిలో వరద ప్రవాహం క్రమేపీ పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో గురువారం మేజర్ శారదానదికి రాంబిల్లి మండలం రజాల అగ్రహారం వద్ద, మైనర్ శారదా నదికి నారాయణపురం వద్ద గండ్లు పడ్డాయి. రజాల, మర్రిపాలెం, కట్టుబోలు, మురకాడ, మర్రిపాలెం తదితర గ్రామాల పరిధిలోని 1,500 ఎకరాల్లో వరి పంట, 50 ఎకరాల కొబ్బరి తోటలు మునిగిపోయాయి. నదికి సమీపంలో ఉన్న వై.లోవ గ్రామంలోకి నీరు ప్రవేశించింది. 30 ఇళ్లు, ప్రభుత్వ పాఠశాల, దేవాలయాలు ముంపునకు గురయ్యాయి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శారదా నీటి ప్రవాహానికి అడ్డుగా ఎన్‌ఏవోబీలో వంతెన నిర్మించారని, దానివల్ల వరద సముద్రంలోకి వెళ్లకుండా, వెనక్కు తన్నడంతో గట్లకు గండ్లు పడ్డాయని రైతులు, వై.లోవ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వై.లోవ గ్రామస్థులను కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పరామర్శించి సహాయ చర్యలు చేపట్టారు. జిల్లాలో తీర ప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. గురువారం 78 పునరావాస కేంద్రాలు కొనసాగాయి.

'మొంథా' నష్టం 5,265 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలకు టెక్నాలజీ బాగా ఉపయోగపడిందని చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎం విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ వల్ల వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన పంటలు-39 కోట్లు, పట్టు పరిశ్రమ-65 కోట్లు, ఆక్వా-1270 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు-2,079 కోట్లు, పురపాలక శాఖ-109 కోట్లు, జలవనరుల విభాగం-207 కోట్లు, పంచాయతీరాజ్-8 కోట్లు, విద్యుత్ శాఖ-16 కోట్లు, పశుసంవర్థక శాఖకు రూ.71 లక్షలు నష్టం వాటిల్లగా.. రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని చెప్పారు. త్వరలోనే నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేసి, కేంద్రానికి నివేదిక పంపుతామన్నారు. మొంథా బీభత్సాన్ని సృష్టిస్తుందని దాని గమనాన్ని బట్టి ముందుగానే అంచనా వేశామని చెప్పారు. 'తుఫాన్‌ను ఆపగలిగే అవకాశం లేకపోయినా.. వీలైనంత వరకు ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగాం. ఆ దిశగా ఐదు రోజులు రేయింబవళ్లు యంత్రాంగం పని చేసింది. రియల్‌టైమ్ మానిటరింగ్, టెక్నాలజీ సత్ఫలితాలిచ్చాయి' అని వివరించారు. 'వన్ గవర్నమెంట్, వన్ సిటిజన్' నినాదంతో పనిచేస్తున్నామన్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

మొంథా అనుభవంతో మాన్యువల్

విపత్తులను ఎదుర్కొనేందుకు మొంథా తుపాన్ అనుభవంతో ఓ మాన్యువల్ తయారుచేస్తాం. ముఖ్యమంత్రిగా చాలా తుపాన్లను హ్యాండిల్ చేశా. గత 16 నెలల్లో టెక్నాలజీని సమగ్రంగా తయారుచేశాం. దానిని తాజా తుపాన్ సమయంలో ఒక పద్ధతి ప్రకారం వాడాం. విభిన్న శాఖలు సమన్వయంతో పనిచేశాయి. డేటాబేస్ తీసుకుని అందరి ఆధార్ అథెంటికేషన్‌తో ప్రతి ఇంటికీ జియోట్యాగ్ చేశాం. డ్రోన్లను వాడాం. వాతావరణ శాఖ ఇచ్చే సమాచారాన్ని అందించి.. తుపాన్ కదలికలను గమనించి.. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీస్, ఫైర్ ఇంజన్లను సిద్ధం చేశాం. తుపాన్ చాలా సమస్యలు సృష్టించి దాగుడు మూతలాడింది. కాకినాడ దగ్గర తీరం దాటుతుందని అంచనా ఉంటే.. తీవ్రత నెల్లూరులో ప్రారంభమై.. కావలి, బాపట్ల, మచిలీపట్నం మీదుగా రాజోలు దగ్గర తీరాన్ని తాకింది. వాన పడుతుందనుకున్న చోట పడలేదు. లక్షా 16 వేల మందిని శిబిరాలకు తరలించి.. ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాం.



> అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయినా.. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రజలకు నష్టం కలుగకుండా పని చేస్తుంటే.. కొందరు ఫేక్ మనుషులు ఫేక్ పోస్టులు పెట్టి, తప్పుడు ప్రచారం చేస్తున్నారు.
>
> - సీఎం చంద్రబాబు

పని చేసినవారందరికీ అభినందనలు

సీఎం నుంచి మంత్రులు, అధికారులు, క్షేత్ర స్థాయి ఉద్యోగులు, సిబ్బంది సమర్థంగా పని చేయడం వల్లే నష్టాన్ని చాలా వరకు తగ్గించగలిగాం. మంత్రులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. తద్వారా ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకాన్ని కలిగించాం. సీఎస్ నుంచి కలెక్టర్.. క్షేత్ర స్థాయిలో సచివాలయ సిబ్బంది వరకు ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు. ఆర్‌టీజీఎస్ నుంచి మంత్రులు లోకేశ్, అనిత ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు చేశారు. ఆర్‌టీజీఎస్‌లోని యువ ఐఏఎస్‌లతో పాటు అధికారులంతా చక్కగా పనిచేశారు. కలెక్టర్లు పోటీ పడి పనిచేశారు. అంతా సమష్టిగా పని చేయబట్టే.. నష్ట నివారణ సాధ్యమైంది. వారందరికీ అభినందనలు.

'ఏపీఎయిమ్స్ యాప్'లో పంట నష్టం నమోదు

పంట నష్టాన్ని ఏపీ ఎయిమ్స్(ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) యాప్‌ల ద్వారా నమోదు చేయనున్నట్టు వ్యవసాయశాఖ ప్రత్యేక సీఎస్ బీ.రాజశేఖర్ తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా ఉపగ్రహ ఛాయా చిత్రాలు, ఇతర సాంకేతిక సమాచారం ఆధారంగా కాకినాడ, కోనసీమ, నెల్లూరు జిల్లాల్లో పంట నష్టాన్ని అంచనా వేయనున్నట్టు తెలిపారు.

కుదుటపడని 'ప్రకాశం'

ఉధృతంగా గుండ్లకమ్మ వరద... ఇంకా జలదిగ్బంధంలోనే పలు గ్రామాలు

ఒంగోలు/విశాఖపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నుంచి ప్రకాశం జిల్లా ప్రజానీకం తేరుకోలేదు. వర్షాలు ఆగినా పైనుంచి వస్తున్న వరద ప్రవాహాలకు జిల్లాలోని పలుగ్రామాలు జలమయమయ్యాయి. వేలాది ఇళ్లలోకి నీరు చేరింది. గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాజెక్టును ప్రారంభించి 17 ఏళ్లు అవుతుండగా ఈ స్థాయిలో వరద రావడం ఇదే ప్రథమం. నీటి నిల్వ సామర్థ్యం 3.89 టీఎంసీలు కాగా, 3.30 టీఎంసీల వరకు నిల్వ ఉంచి మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ఎగువ నుంచి 98వేల క్యూసెక్కుల వరద వస్తుండగా పది గేట్లు ఎత్తి 80వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో దిగువన మూడు మండలాల్లోని పది గ్రామాల్లోకి నీరు చేరింది. మద్దిరాలపాడు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇక్కడ ఒంగోలు-దిగమర్రు హైవేపై రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లపైకి వరద రావడంతో వెల్లంపల్లి-తాళ్లూరు, త్రోవగుంట-ఉలిచి మార్గాల్లోనూ రాకపోకలు నిలిచాయి. ఏటొడ్డు ఉప్పలపాడు చుట్టూ నీరు చేరడంతో గ్రామస్థులు బుధవారం రాత్రంతా మేడలు ఎక్కి బిక్కుబిక్కుమంటూ గడిపారు. గురువారం సాయంత్రానికి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పడవల్లో వారికి ఆహారం, నీరు అందించాయి. అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం, చేకూరపాడు, కనపర్తి తదితర గ్రామాల్లోనూ గుండ్లకమ్మ నీరు పంట పొలాలను ముంచెత్తింది. గత 24గంటల్లో సుమారు 9 టీఎంసీల నీటిని డ్యాం నుంచి దిగువకు వదిలారు. కొత్తపట్నం మండలానికి ఒంగోలుతో సంబంధాలు తెగిపోగా కొండపి మండల కేంద్రానికి ఒంగోలు నుంచి వెళ్లే అన్ని మార్గాల్లోనూ రవాణా నిలిచింది. అర్ధవీడు మండలం బోల్లుపల్లి వాగు ఉధృతికి రోడ్డు దెబ్బతిని 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో సుమారు 25వేల హెక్టార్లలో పత్తి, మిర్చి, సజ్జ, కంది, వరి పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇంకా 50వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పంటలు నీటిలోనే ఉన్నాయి. అయితే, వర్షాలు ఆగడంతో తక్షణ సహాయక చర్యలను అధికార యంత్రాంగం ముమ్మరంగా చేసింది. బాధిత కుటుంబాలకు బియ్యంతోపాటు ఇతర సరుకులు పంపిణీ చేపట్టారు. దెబ్బతిన్న రోడ్లు, గండ్లుపడ్డ చెరువులకు అత్యవసర పనులు చేపట్టారు. ఒంగోలు నగరంలో చెర్వుకొమ్ముపాలెంలో మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాతసింగరాయకొండ పంచాయతీలోని మల్లికార్జున్‌నగర్ గిరిజన కాలనీలో బాధితులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య బియ్యం పంపిణీ చేశారు.

విశాఖలో బాధితులకు సాయం పంపిణీ

విశాఖ జిల్లాలో తుఫాన్ బాధితులకు గురువారం ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ముంపు, కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని ముందుజాగ్రత్త చర్యగా పునరావాస శిబిరాలకు తరలించిన సంగతి తెలిసిందే. వారికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి, కుటుంబానికి అత్యధికంగా రూ.3 వేలు చొప్పున అందజేశారు. జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లోని 21 గ్రామాల్లో 10.77 హెక్టార్లలో వరి పంట ధ్వంసమైనట్టు అధికారులు గుర్తించారు.



పులిచింతల బ్యారేజీ నుంచి ఎగసిపడుతున్న వరద నీరు

ప్రకాశం బ్యారేజీకి పోటెత్తిన వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద పోటెత్తింది. తుఫాన్ కారణంగా తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ నీరు కృష్ణానదిలో కలుస్తుండటంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. ఎగువ నుంచి 5,66,860 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో గేట్లన్నీ పూర్తిస్థాయిలో ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పులిచింతల నుంచి 3,82,295 క్యూసెక్కులు, పాలేరు నుంచి 23,967, కీసర నుంచి 96,244 క్యూసెక్కుల వరద వస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో ప్రవహించే మునేరుకు ఎగువ నుంచి 1,49,946 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ మొత్తం నీరు కృష్ణానదిలోకి చేరుతోంది. నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. శుక్రవారానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అయితే ఎగువన కురిసిన వర్షాలకు కొన్ని రోజులు వరద హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని పేర్కొంది.



ప్రకాశం జిల్లా చీర్వానుప్పలపాడు గ్రామాన్ని చుట్టుముట్టిన గుండ్లకమ్మ వరద

ప్రజల్లోకి పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

నేరాల కట్టడి, మత్తు వినియోగం తగ్గించడం, ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తత, సైబర్ నేరాలపై చైతన్యం, రోడ్డు ప్రమాదాల తగ్గింపునకు 'కమ్యూనిటీ ఫస్ట్' పేరుతో నవంబరు 1 నుంచి పోలీసులు ప్రజల్లోకి వెళ్లబోతున్నారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు కమిటీలు ఏర్పాటు చేసి డిజిటల్ ప్రచారానికి పెద్దపీట వేయనున్నారు.



ఆర్థిక మోసాల అడ్డుకట్టకు..

ఆర్థిక నేరగాళ్లు ప్రజలను రకరకాల మార్గాల్లో మోసం చేసి వందల కోట్లు కొల్లగొడుతున్నారు. ఆకర్షించేలా మాయ మాటలు చెప్పడం, అధిక వడ్డీల ఆశ చూపడం, అనుమతిలేని చిట్టీలు-ఇతరత్రా స్కీమ్‌ల పేరిట దోచుకొంటున్నారు. పోలీసులు తరచూ వారిని అరెస్టు చేస్తున్నా మోసాలు ఆగడం లేదు. బాధితులు పెద్ద ఎత్తున పోలీసుల వద్దకొచ్చి లబోదిబోమంటున్నారు. ఇటువంటి కేసులు ఎక్కువగా ఎక్కడ నమోదవుతున్నాయనో గుర్తించి పోలీసులు మ్యాపింగ్ చేశారు. ఆర్థిక మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండటం ఎలా? మోసగాళ్ల బారిన పడితే బయట పడటం ఎంత కష్టమో.. రీల్స్, స్కిట్లు, పోస్టర్లు, ఇతర ప్రచారాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించారు. ఎన్జీవోలతో కలిసి పోలీసు శాఖ ఇందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఆర్థిక మోసాలకు పాల్పడిన వారికి ఎటువంటి దుర్గతి పడుతుందో, చట్టాలు ఎంత కఠినంగా ఉన్నాయో వివరించనుంది.




రోడ్డు ప్రమాదాలు.. 4 'ఈ'లతో బ్రేకులు

మన రాష్ట్రంలో ఏటా 800 నుంచి 900 మంది హత్యకు గురవుతుంటే.. రోడ్డు ప్రమాదాల్లో 8 వేల నుంచి 9 వేలమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత గడచిన పదేళ్లలో 87 వేలమందికి పైగా రోడ్లపై ప్రాణాలు వదిలేశారు. పోలీసు, రవాణా, విద్య వైద్య శాఖలతో పాటు రోడ్ ఇంజనీరింగ్ విభాగం సమన్వయంతో రోడ్డు ప్రమాదాల కట్టడికి వ్యూహం సిద్ధమైంది. ప్రమాదాలు జరుగుతున్న తీరుతెన్నులపై అధ్యయనం చేసిన పోలీసు శాఖ, రవాణా శాఖ వద్ద ఉన్న సమాచారాన్ని కూడా తెప్పించుకుని విశ్లేషించింది. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యం వంటివి ప్రధాన కారణాలుగా గుర్తించారు. ప్రమాదాల్లో జాతీయ రహదారులపై 30 శాతం, రాష్ట్రంలోని ఇతర అన్ని రోడ్లపై 70 శాతం జరుగుతుండగా.. ఎక్కువగా(41శాతం) ద్విచక్ర వాహనదారులే ప్రాణాలు కోల్పోతున్నారు. అందులోనూ ఎక్కువగా యువత ఉంటున్నారు. హెల్మెట్ లేకపోవడం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి కారణమని గుర్తించారు. యువతలో చైతన్యం తీసుకురావడం.. ఎడ్యుకేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంజనీరింగ్, ఎన్విరాన్మెంట్ అనే నాలుగు 'ఈ'లతో ప్రమాదాలకు బ్రేకులు వేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

మహిళలపై నేరాల కట్టడికి..

మనవరాలి వయసున్న మైనర్ బాలికను తాత వయసున్న వ్యక్తి అత్యాచారం చేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. మైనారిటీ తీరని బాలురు సైతం ఇటువంటి ఘోరాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై ఇప్పటికే సమీక్షించిన పోలీసులు... ఎక్కువగా ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్న పోలీస్ స్టేషన్ల పరిధిలో చైతన్యం తీసుకురానున్నారు. విస్తృత ప్రచారం ద్వారా నేరాల కట్టడికి చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మ్యాపింగ్ చేసిన పోలీస్ స్టేషన్ల పరిధిలో వాట్సాప్ గ్రూపుల్లో రీల్స్, స్కిట్స్ లాంటివి చేసి ప్రచారం చేయనున్నారు. పెద్ద పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక సినిమా థియేటర్లలో స్లైడ్‌లు వేయిస్తారు. మహిళలపై నేరాలకు పాల్పడితే పడే శిక్షలు ఎలా ఉంటాయో, జైలుకు వెళితే జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో వీడియోల ద్వారా వివరించనున్నారు. నేరాల నుంచి మహిళలు ఎలా తప్పించుకోవాలో, ఆపద సమయంలో శక్తి యాప్ ఎలా రక్షణ కల్పిస్తుందో వివరిస్తారు. స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు అవగాహన కమిటీలు నిరంతరం మహిళలను చైతన్యం చేయనున్నారు.





మత్తు మహమ్మారిపై ఉక్కుపాదం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి గంజాయి, డ్రగ్స్ అతిపెద్ద సవాలుగా నిలిచాయి. హోంమంత్రి అధ్యక్షతన ఏర్పాటైన ఐదుగురు మంత్రుల(విద్య, వైద్య, ఎక్సైజ్, గిరిజన సంక్షేమం) కమిటీ నివేదిక ఆధారంగా 459 మందితో 'ఈగల్'ను ఏర్పాటు చేసింది. విశాఖ మన్యంలో గతంలో పదివేల ఎకరాల్లో ఉన్న గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించింది. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా గిరిజనుల్లో మార్పు తీసుకొచ్చింది. ఒడిశా నుంచి గంజాయి రవాణా కట్టడికి ఈగల్ బృందాలు, పోలీసులు ఒడిశా పోలీసులను సమన్వయం చేసుకుని పనిచేస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)లో ఏపీ పోలీసులు అభినందనలు అందుకున్నారు. గతంలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ఏపీ పేరు వినిపించేదని, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని, సమర్థంగా గంజాయి సాగు కట్టడి చేశారని అధికారులు ప్రశంసించారు. ఎన్‌సీబీ సూచనలతో ఏపీ పోలీసులు విద్య, వైద్య శాఖలతో సమన్వయం చేసుకుని 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ పాఠశాలల్లో ప్రచారం మొదలుపెట్టారు. విద్యా సంస్థల నుంచి యూనివర్సిటీల వరకూ డిజిటల్ ప్రచారానికి ప్రణాళిక సిద్ధం చేశారు. యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర మాధ్యమాల ద్వారా విద్యార్థులు, యువతలో చైతన్యం తీసుకురానున్నారు. గంజాయి, డ్రగ్స్ అమ్మేవారిని జైలుకు.. అలవాటు పడినవారిని రిహాబిలిటేషన్ కేంద్రానికి పంపి మార్పు తీసుకురావడానికి కృషి చేయనున్నారు.



సైబర్ నేరాలు.. అతిపెద్ద సవాలు

ఏపీ పోలీసులకే కాదు ప్రపంచానికే సైబర్ నేరాలు అతిపెద్ద సవాలుగా మారాయి. వాటిని అరికట్టేందుకు రాష్ట్రాలతో పాటు కేంద్ర హోంశాఖ ఎన్ని చర్యలు తీసుకొంటున్నా.. సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త మార్గం వెతుక్కొని రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. నైజీరియా లాటరీ మోసాల నుంచి బ్యాంకు ఓటీపీ, ఆధార్ అప్డేట్, కస్టమ్స్, డిజిటల్ అరెస్టుల పేరిట మోసాలు చేస్తున్నారు. మనీ యాప్‌లు, నకిలీ పెట్టుబడులు, క్రెడిట్ కార్డులో సొమ్ము దోచుకోవడం.. ఇలా రకరకాల ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి సైబర్ మోసాల కట్టడికి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేందుకు పోలీసు శాఖ ఒక స్టూడియో ఏర్పాటు చేసింది. మంగళగిరిలో టెక్ టవర్‌లోని డిజిటల్ స్టూడియోలో యాంకర్లు, న్యూస్ రీడర్లు, రీల్స్, స్కిట్లు లాంటివి చేసే వాళ్లను నియమించుకుంది. సమాచార ప్రసార శాఖ సహకారంతో ఎప్పటికప్పుడు న్యూస్ బులెటిన్ విడుదల చేస్తుంది. ప్రపంచంలో ఎక్కడ కొత్తరకం మోసం వెలుగులోకి వచ్చినా అన్ని దేశాలు, రాష్ట్రాల పోలీసులను అప్రమత్తం చేసే ఎంఐయూ(మార్కెట్ ఇంటెలిజెన్స్ యూనిట్) ద్వారా సమాచారం అందుకొని వెంటనే రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, అవగాహన బృందాలకు పంపుతుంది. స్టూడియో నుంచి బులెటిన్లు విడుదల చేయడం, ఎఫ్ఎం రేడియోలో చెప్పించడం, సినిమా హాళ్లలో స్లైడ్స్ వేయించడం వంటివి చేస్తుంది. సైబర్ నేరాల బారిన పడిన వారు గోల్డెన్ అవర్(మొదటి గంట)లోనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేస్తే డబ్బులు పోకుండా ఎలా సీజ్ చేయవచ్చో తెలియజేస్తుంది. సైబర్ నేరగాళ్లు, వారికి సహకరిస్తున్న వారిపైనా పోలీసులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.

ప్రజా చైతన్యంతోనే నేరాల కట్టడి

సమాజం ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా శాంతిభద్రతలు కీలకం. సంఘ విద్రోహశక్తులు, నేరస్తులను జైలుకు పంపడం పోలీసుల విధి. నేరం జరిగిన తర్వాత బాధ్యులను జైలుకు పంపడంతో పాటు నేరాల బారిన పడకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కూడా ఎంతో ముఖ్యం. అందుకే ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడికి ప్రణాళిక రూపొందించాం. రాష్ట్రంలో ఫ్యాక్షన్, రౌడీయిజం, నక్సలిజం వంటివాటిని పోలీసులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, ఆర్థిక మోసాలు, మత్తు వినియోగం, రోడ్డు ప్రమాదాలు సమాజానికి అతిపెద్ద ముప్పుగా మారాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో 30 శాతం నేరాలు తగ్గాల్సిందేనని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశాం. నేరాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన తీసుకొస్తే మంచి ఫలితాలు ఉంటాయని నమ్ముతున్నాం. ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ఈ దిశగా పని చేస్తాం. జిల్లాలో ఎస్పీ, రాష్ట్ర స్థాయిలో పోలీస్ కమాండ్ కంట్రోల్ పర్యవేక్షిస్తుంది. ఈ ఏడాదిలో కనీసం 15 శాతం నేరాలు, మోసాలు, రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో పనిచేస్తాం. నవంబరు 1న ఇందుకు శ్రీకారం చుడుతున్నాం. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని నేరాల బారిన పడకుండా ఉండాలని ప్రజల్ని కోరుతున్నా. తప్పు చేసిన వారిపై చట్టపరంగా గట్టి చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా.

- డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

'నెయ్యి'లోనూ కమీషన్ల దందా!

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు చేస్తోంది. టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన డెయిరీల నుంచి కమీషన్లు దండుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో వైవీ వ్యవహారాలు చక్కబెట్టే క్రమంలో చిన్న అప్పన్న 2022 నుంచి 2024 ఎన్నికల దాకా నెయ్యి సరఫరా కాంట్రాక్టు వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నట్లు సిట్ గుర్తించింది. 2022లో టీటీడీ మార్కెటింగ్ విభాగం కీలక అధికారి నుంచి నెయ్యి సరఫరా చేస్తున్న డెయిరీల జాబితా, ధరల వివరాల వంటివి అతడు సేకరించినట్లు నిర్ధారించింది. భోలేబాబా డెయిరీ, ప్రీమియం డెయిరీ దాకా టీటీడీకి నెయ్యి సరఫరా చేసే అన్ని డెయిరీల ప్రతినిధులతో చర్చించినట్లు పసిగట్టింది. వారితో ఫోన్లో, నేరుగా పలు దఫాలుగా మాట్లాడి కమీషన్ల కోసం ఒత్తిడి చేశాడని, మాట వినకుంటే కాంట్రాక్టులు రద్దు చేయిస్తానంటూ బెదిరించాడని విశ్వసనీయంగా తెలిసింది. ఆయా డెయిరీల నుంచీ హవాలా మార్గంలో కమీషన్లను అందుకున్నట్లు తెలిసింది. వీటన్నింటినీ నిర్ధారించుకున్న తర్వాతే సిట్ అధికారులు చిన్న అప్పన్నకు నోటీసులు జారీచేసి గత జూన్‌లోనే తొలి విడత విచారించారు. అతడి అరెస్టును అడ్డుకునేందుకు వైవీ హైకోర్టును ఆశ్రయించడం, సిట్‌లో లేని అధికారి దర్యాప్తు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ఆరోపించడం.. అయన నోటీసులు చెల్లవని హైకోర్టు తీర్పు ఇవ్వడం.. సుప్రీంకోర్టు ఆ తీర్పును పక్కనపెట్టడం వంటి పరిణామాలతో దర్యాప్తు ప్రక్రియ మూడున్నర నెలలు ఆగిపోయిన సంగతి తెలిసిందే. లేదంటే గత జూన్‌లోనే చిన్న అప్పన్నను అరెస్టు చేసి ఉండేవారమని సిట్‌వర్గాలు తెలిపాయి. సుప్రీం ఆదేశాలతో దర్యాప్తు పునఃప్రారంభమైన వెంటనే చిన్న అప్పన్నను అరెస్టు చేయడం గమనార్హం.



చిన్న అప్పన్న

రూ.కోట్ల ఆస్తులున్న 'నిరుపేద'

చిన్న అప్పన్నను అరెస్టుచేసిన సిట్ అధికారులు బుధవారం రాత్రి ఏసీబీ కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం అతడికి 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. వారు ఇప్పటి వరకూ సేకరించిన ఆధారాల ప్రకారం సుబ్బారెడ్డి సన్నిహిత అనుచరుడైన చిన్న అప్పన్న నిరుపేద. తల్లిదండ్రులు జీవించి లేరు. స్వగ్రామంలో పూరిల్లు తప్ప మరే ఆస్తులూ లేవు. పెద్దగా చదువు కూడా లేదు. అవివాహితుడు. అయితే ఢిల్లీలో ఇతడి పేరిట నాలుగైదు బ్యాంకు ఖాతాలున్నాయని, వాటిలో రూ. 4.50 కోట్లు ఉన్నట్లు సిట్ గుర్తించింది. విశాఖ నగరంతో పాటు పరిసరాల్లో ఖరీదైన 13 స్థలాలు, మరో నాలుగైదు అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు ఇతడి పేరిట ఉన్నట్లు గుర్తించింది. చిన్న అప్పన్న కుటుంబ నేపథ్యం, సాగించిన వ్యవహారాలు పరస్పర విరుద్ధంగా ఉండడంతో.. గతప్రభుత్వంలో వైసీపీ కీలక నేతలను అడ్డుపెట్టుకుని సొంతంగా దందా సాగించాడా.. లేక వైసీపీ కీలక నేతలకు బినామీగా పనిచేశాడో తేల్చుకునేందుకు సిట్ సిద్ధమైంది. అతడిని వారం పాటు తమ కస్టడీకి అనుమతించాలని కోరుతూ నెల్లూరు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కస్టడీకి తీసుకుని విచారిస్తే అతడి పాత్రపై మరింత స్పష్టత వస్తుందని భావిస్తోంది. ఎలాంటి ఆస్తిపాస్తులూ లేని వ్యక్తి బ్యాంకు ఖాతాల్లో రూ.కోట్ల నగదు ఎలా జమయింది.. ఎవరు.. ఎందుకు వేశారు.. విలువైన స్థలాలు, ఫ్లాట్లు ఎలా కొనుగోలు చేశారు? అంత భారీ మొత్తాలు ఎలా వచ్చాయన్న అంశాలపై దృష్టి సారించనుంది. ఈ అంశాలపై స్పష్టత వస్తే చిన్న అప్పన్న సొంతంగా దందా నడిపాడో, కీలక వ్యక్తులకు బినామీగా ఉన్నాడో తేలిపోతుంది. ఇప్పటికే రెండు విడతలుగా చిన్న అప్పన్నను ప్రశ్నించిన సిట్ అధికారులు ఆ సందర్భంగా అతడు చెప్పిన ప్రతి అంశాన్నీ వీడియో, ఆడియో రికార్డింగ్ చేసినట్లు సమాచారం. కోర్టు కస్టడీకి అనుమతిస్తే మరోసారి విచారించనుంది. ఆ సందర్భంగా వెల్లడించే వివరాలను బట్టి అవసరమైతే వైవీ సుబ్బారెడ్డికి నోటీసులు జారీ చేసి చిన్న అప్పన్న సమక్షంలోనే ఆయన్ను విచారించే అవకాశముందని తెలిసింది.

ఢిల్లీ ఏపీ భవన్‌లో ఉద్యోగం.. టీటీడీ నుంచి జీత భత్యాలు?

వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉండగా.. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఓఎస్డీగా నియమితుడైన చిన్న అప్పన్నకు జీత భత్యాలు మాత్రం టీటీడీ నుంచీ అందినట్లు సమాచారం. జీత భత్యాలతో పాటు కారు, ఇంటి అద్దె అలవెన్సు తదితరాలకు నెలకు రూ.1.30 లక్షల వరకూ టీటీడీ నిధులు చెల్లించినట్లు తెలిసింది. ఇదెలా జరిగిందో సిట్ ఆరా తీస్తోంది.

2022లోనే నెయ్యి కల్తీ నిర్ధారణ?

టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన డెయిరీలను కమీషన్ల కోసం బెదిరించే క్రమంలో 2022లోనే కల్తీ వ్యవహారం బయటపడినట్లు తెలిసింది. అప్పట్లో మాట వినని డెయిరీలను దారిలోకి తెచ్చుకునేందుకు మూడు డెయిరీలకు సంబంధించిన నాలుగు శాంపిళ్లను మైసూరులోని ల్యాబ్‌కు పంపగా, వెజిటబుల్ ఆయిల్స్ తదితరాలతో నెయ్యి కల్తీచేసినట్లు రిపోర్టు వచ్చిందని, అప్పటి కీలక వ్యక్తుల ఒత్తిడితో టీటీడీ ఆ నివేదికను తొక్కిపెట్టిందని సిట్ దృష్టికి వచ్చినట్లు సమాచారం. కమీషన్ చెల్లించేందుకు అంగీకరించకపోవడంతో అప్పటిదాకా నెయ్యి సరఫరా చేస్తున్న డెయిరీని పక్కకు తప్పించినట్లు తెలిసింది. మరో డెయిరీ చిన్న అప్పన్నకు కమీషన్ ఇస్తామనడంతో మునుపటి డెయిరీ కంటే ఏకంగా రూ.130 దాకా ధర పెంచి కోట్ చేసి కాంట్రాక్టు దక్కించుకున్నట్లు సమాచారం.



అనంతపురం జిల్లా మరుట్లలో తల్లిపాలను డాక్టర్ హేమలతకు అందజేస్తున్న మాతృమూర్తి లావణ్య

అమ్మపాల అమృతాన్ని పంచి..

12 లీటర్ల తల్లిపాలు దానం చేసిన పేదింటి మహిళ

అనంతపురం మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు అందజేత

అనంతపురం వైద్యం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్ఠం. కానీ.. అలాంటి శ్రేష్ఠమైన తల్లిపాలు నేడు చాలామందికి అందడం లేదు. ఇలా తల్లిపాల కొరత ఉన్న చిన్నారుల కోసం అనంతపురం జిల్లా కూడేరు మండల మరుట్లకు చెందిన లావణ్య ఏకంగా 12 లీటర్ల తల్లిపాలు దానం చేసి తన గొప్ప మనసును చాటుకున్నారు. అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు ఈ పాలను ఆమె గురువారం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన నవీన్, లావణ్య దంపతులకు ఈ నెల 4న అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సాధారణ కాన్పులో కొడుకు పుట్టాడు. ఈ క్రమంలో డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, న్యూట్రీషనిస్టులు పల్లవి, రాధ మదర్స్ మిల్క్ బ్యాంక్ గురించి లావణ్యకు అవగాహన కల్పించారు. దీంతో ఆమె తన బిడ్డకు ఇవ్వగా మిగిలిన పాలను దానం చేస్తూ వచ్చారు. డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లాక కూడా డాక్టర్లు సూచించిన జాగ్రత్తలు పాటిస్తూ పాలుపట్టి నిల్వ చేశారు. ఇలా ఫ్రిజ్‌లో దాచిన 12లీటర్ల పాలను మరుట్లకు వచ్చిన డాక్టర్ హేమలతకు లావణ్య అందజేశారు. లావణ్యను సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ హేమలత అభినందించారు.

ఓ తండ్రి ఆవేదన!

కూతురు చనిపోయిన బాధలో కుటుంబం

- అంబులెన్స్ నుంచి డెత్ సర్టిఫికెట్ వరకు.. లంచాల కోసం అధికారుల వేధింపులు

బెంగళూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంతో 'కొంత' ముట్టజెప్పనిదే.. కొంతమంది అధికారులు పని చేయని పరిస్థితి! ఇలాంటి లంచగొండుల అమానవీయమైన ప్రవర్తన తాజాగా కర్ణాటకలో చోటుచేసుకుంది. ఒక్కగానొక్క కూతురిని కోల్పోయి, పుట్టెడు దుఃఖంతో ఉన్న ఆ కుటుంబాన్ని అవినీతి జలగలు పీక్కుతిన్నాయి. తనకు ఎదురైన ఈ అనుభవాన్ని బాధిత తండ్రి సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'మా వద్ద డబ్బులు ఉన్నాయి కాబట్టి సరిపోయింది. ఇదే పరిస్థితి పేదలకు ఎదురైతే..' అంటూ ఆయన ఎండగట్టడం వైరల్‌గా మారింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో కె.శివకుమార్ సీఎఫ్ఓగా పనిచేసి, రిటైర్డ్ అయ్యారు. ఆయన కూతురు అక్షయ (34) మెదడులో రక్తస్రావమై గత నెల 18న మృతిచెందింది. సంబంధిత ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం తాను వెళ్లిన ప్రభుత్వ కార్యాలయాలు, అక్కడ ఎదురైన 'లంచాల' అధికారుల గురించి బాధిత తండ్రి లింక్డ్‌ఇన్ పోస్టులో ప్రస్తావించారు. బెంగళూరు నగర పరిధిలోని బెళ్లందూరు పోలీసుస్టేషన్ సిబ్బంది, మహదేవపురలోని బీబీఎంపీ ఉద్యోగులు వేల రూపాయలు లంచం తీసుకున్నారని పేర్కొన్నారు. 'ఒక్కగానొక్క కూతురిని కోల్పోయాం. ఆవేదనలో ఉన్న మమ్మల్ని లంచాలు డిమాండ్ చేశారు. మృతదేహాన్ని తరలించే అంబులెన్స్ సిబ్బంది, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం, డెత్ సర్టిఫికెట్.. ఇలా ప్రతిచోటా లంచం లేకుండా పని జరగలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. బెళ్లందూరు ఇన్‌స్పెక్టర్ తనపట్ల సానుభూతి చూపకుండా అత్యంత దురహంకారంతో వ్యవహరించారని పేర్కొన్నారు. శివకుమార్ పోస్టు చూసిన నెటిజన్లు లంచావతారులపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. పోస్టులో పేర్కొన్న ప్రతి ఉద్యోగిపైనా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత, సుప్రీంకోర్టు న్యాయవాది బ్రిజేష్ కాళప్ప కోరారు.

తెలంగాణ మద్యం పాలసీపై ఏపీ ప్రభుత్వం ఆరా

హైదరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నూతన మద్యం విధానంపై ఏపీ ప్రభుత్వం ఆరా తీసింది. నూతన పాలసీ వివరాల సేకరణ కోసం విజయవాడ నుంచి ఎక్సైజ్ అధికారుల బృందం తెలంగాణ ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించింది. అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, జాయింట్ కమిషనర్ సురేష్ రాథోడ్, ఏసీ శ్రీనివాసులను కలిసి మద్యం విధివిధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో అమ్మకాల తీరు, డిజిటల్ విక్రయాలపై ఆరా తీశారు. గుంటూరు డీసీ కె. శ్రీనివాస్, పల్నాడు డీపీఈవో మణికంఠ అడిగిన సమాచారాన్ని తెలంగాణ అధికారులు అందించారు.

'విజిలెన్స్' బలోపేతానికి కృషి: కమిషనర్ అనిల్

అమరావతి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విజిలెన్స్ వ్యవస్థ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఏపీ విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్ర పునేత అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్ర సచివాలయంలో 'విజిలెన్స్‌లో మన భాగస్వామ్యం, బాధ్యత' అనే థీమ్‌తో సమావేశాన్ని నిర్వహించారు. విజిలెన్స్ నిఘాను పటిష్ఠం చేయడం, పారదర్శకత, సమగ్రతను ప్రోత్సహించడానికి చురుకైన భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి సమష్టి ప్రయత్నాలు అవసరమని కమిషనర్ పునేత చెప్పారు.

పరకామణి దొంగతనం ఓ పెద్ద కుట్ర: వర్ల రామయ్య

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 'తిరుమల పరకామణి దొంగతనం కేసు దర్యాప్తును పరిశీలిస్తే ఇది కేవలం దొంగతనం కాదు. ఓ పెద్ద కుట్ర అని అనిపిస్తోంది' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కేసు దర్యాప్తులో అడుగడుగునా తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, దీనికి నాటి చైర్మన్, ఈవో, టీటీడీ అధికారులు బాధ్యులని ఆరోపించారు. తన హయాంలో తప్పు జరిగితే తల నరక్కుంటా అన్న భూమన కరుణాకర్‌రెడ్డి తల నరుక్కోవాల్సిన పనిలేదని, కేసును ఎందుకు నీరుగార్చారో చెబితే చాలని వర్ల రామయ్య కోరారు.

కార్గో క్యాబిన్‌లో రెండో డ్రైవర్ నిద్ర

- కర్నూలు బస్సు ప్రమాదంపై పోలీసుల విచారణలో ఆసక్తికర అంశాలు
- మృతుల కుటుంబాలకు వి.కావేరి ట్రావెల్స్ ఆర్థిక సాయం

కర్నూలు/న్యూఢిల్లీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదం ఘటనపై విచారణ చేస్తున్న పోలీసులకు పలు ఆసక్తికర అంశాలు తెలుస్తున్నాయి. వి.కావేరీ ట్రావెల్ బస్సు మంటల్లో చిక్కుకున్న సమయంలో రెండో డ్రైవర్ శివనారాయణ బస్సు కింది భాగంలోని కార్గో క్యాబిన్‌లో నిద్రిస్తున్నట్లు తెలిసింది. చాలా బస్సుల్లో రెండో డ్రైవర్ అందులోనే పడుకుంటారని, అత్యవసరమైతే ప్రయాణికులను కూడా ఆ క్యాబిన్‌లోనే తరలిస్తారని వెలుగు చూసింది. పోలీసుల విచారణలో రెండో డ్రైవర్ పలు ఆసక్తి విషయాలు వెల్లడించాడు. ప్రమాద సమయంలో తాను కార్గో క్యాబిన్‌లో గాఢనిద్రలో ఉన్నట్లు, భారీ శబ్దం రావడంతో మెలుకువ వచ్చినట్లు చెప్పాడు. ముందుభాగంలో మంటలు చెలరేగిన సమయంలో కంగారుగా డ్రైవర్ లక్ష్మయ్య తన వద్దకు వచ్చినట్లు తెలిపాడు. తామిద్దరూ ఎంత ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదని, బస్సు కుడివైపు అద్దాలు పగులకొట్టి కొంతమంది ప్రయాణికులను బయటకు లాగామని వెల్లడించాడు. ఇతరులతో కలిసి తాము చేసిన ప్రయత్నం వల్లే 27మంది ప్రయాణికులు ప్రాణాలతో బయట పడ్డారన్నాడు.



పరిహారం చెక్కును మంత్రి టీజీ భరత్, కలెక్టర్ సిరికి అందజేస్తున్న వి.కావేరి ట్రావెల్స్ ప్రతినిధులు

మంత్రి భరత్‌కు చెక్ అందజేత

ప్రమాదంలో మృతి చెందిన 19మంది కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2లక్షల చొప్పున, గాయపడిన నలుగురికి రూ.50వేల చొప్పున వి.కావేరి ట్రావెల్స్ యాజమాన్యం ఆర్థిక సాయం అందజేసింది. ఈ మేరకు రూ. 40 లక్షల చెక్‌ను ఆ సంస్థ ప్రతినిధులు జిల్లా కలెక్టరేట్‌లో గురువారం మంత్రి టీజీ భరత్‌కు అందజేశారు. కాగా, ప్రమాదంలో మృతి చెందిన ఏపీ వాసులైన ఏడుగురు కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబీకులు, గాయపడిన నలుగురి బ్యాంక్ ఖాతాలు తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించామని, ఒకటి రెండు రోజుల్లో వారి ఖాతాల్లో ఆర్థిక సాయం జమ అవుతుందని జిల్లా కలెక్టర్ ఏ.సిరి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

నిబంధనలకు విరుద్ధంగా వి.కావేరీ బస్సు మార్పు

బస్ కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకే: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

నిబంధనలకు విరుద్ధంగా బస్సులలో మార్పులు చేస్తే నేరుగా జైలుకు పంపిస్తామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ హెచ్చరించారు. బస్ కోడ్ ఉల్లంఘిస్తూ సీటర్ బస్సులను స్లీపర్ బస్సులుగా మారిస్తే దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గురువారం, ఢిల్లీలో ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ, కర్నూలు బస్సు ప్రమాదంపై స్పందించారు. ఆ బస్సును చట్ట విరుద్ధంగా స్లీపర్ బస్సుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ఇటీవల సవరించిన బస్ కోడ్‌లో స్పష్టమైన నిబంధనలు చేర్చామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.